పార్టీ ఎడ్యుకేషన్ సిరీస్

7

# పార్టీ నిర్మాణం

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

## పార్టీ ఎడ్యుకేషన్ సిరీస్ 7

# ముందుమాట

**భా**రత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఎడ్యుకేషన్ సబ్–కమిటీ 2022 అక్టోబర్‌లో కేంద్ర శిక్షణా పాఠశాల నిర్వహించింది. పాఠశాలలో ఒక నోట్స్ పంపిణీ చేసింది. ఈ పాఠశాలలో జరిగిన చర్చలు, విద్యార్థుల నుండి వచ్చిన అభిప్రాయాలను చేర్చి ఈ నోట్స్ తయారు చేసింది. అవసరమైన మార్పులు చేసిన అనంతరం ఈ నోట్స్‌ను ప్రచురిస్తున్నాం.

నిర్మాణం పాఠ్యాంశంలో మూడు ఉప–విభాగాలున్నాయి. 1. పార్టీ నిర్మాణ సూత్రాలు 2. పార్టీ నిర్మాణంలో ప్రస్తుత కర్తవ్యాలు. 3. పార్టీ, ప్రజాసంఘాలు. ఈ మూడింటినీ కలిపి గానీ లేక దేనికదే గానీ అన్ని స్థాయిల్లో రాజకీయ విద్యకు ఉపయోగించుకోవచ్చు.

ఈ పాఠ్యాంశాన్ని బోధిస్తున్న వారికీ, ఈ అంశాన్ని అర్థం చేసుకోగోరేవారికీ ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నాం.

**పార్టీ ఎడ్యుకేషన్ సబ్ కమిటీ,**
**కేంద్ర కమిటీ, సిపిఐ(ఎం)**

**ఫిబ్రవరి 2023**

# పార్టీ నిర్మాణ సూత్రాలు

*(నోట్స్‌ను నాలుగు విభాగాలుగా విభజించాం. ప్రతి విభాగాన్ని పాయింట్లుగా విభజించాం. విద్యార్థుల నేపథ్యం, స్థాయిలను బట్టి విభాగాలు, పాయింట్లను మార్చుకోవచ్చు. ప్రాథమిక స్థాయిలో (అంటే సహాయ శాఖ సభ్యులు, క్యాండిడేట్లు/ కొత్త పార్టీ సభ్యులకు) తొలి రెండు విభాగాలను నొక్కి చెప్పవచ్చు. ఇంకా పై స్థాయిలో మూడు, నాలుగు విభాగాలకు ప్రాధాన్యతనివ్వాలి. వివిధ స్థాయిల్లోని విద్యార్థులకు వివరించేటప్పుడు ఆ పాయింటును వివరించే కోణం, పద్ధతి భిన్నంగా ఉండవచ్చు. ప్రాథమిక స్థాయిలో మనం విషయాన్ని సరళమైన పద్ధతిలో వివరించాలి. పై స్థాయిలో వారికి వివరించేటప్పుడు మన డాక్యుమెంట్లను ఉటంకిస్తూ, జాతీయ అంతర్జాతీయ ఉదాహరణలతో వివరించవచ్చు.)*

## పరిచయం

పెట్టుబడిదారీ సమాజాన్ని సోషలిస్టు సమాజంగా విప్లవ పరివర్తన గావించడానికి ఒక విప్లవకర, స్వతంత్ర కార్మిక వర్గ పార్టీ అవసరం అని మార్క్స్, ఏంగెల్స్, లెనిన్ చెప్పారు.

లెనిన్ తను రాసిన ముఖ్యమైన గ్రంథం 'ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కు'లో ప్రధానమైన నిర్మాణ సూత్రాలను ప్రతిపాదించాడు. ఈ పుస్తకం 1904 మేలో ప్రచురితమైంది. తదుపరి కమ్యూనిస్టు పార్టీల అనుభవాలతో ఈ సూత్రాలను మరింత విస్తృతపరిచి, బలోపేతం చేయడం జరిగింది.

# I

# కమ్యూనిస్టు పార్టీ మౌలిక నిర్మాణ సూత్రాలు

*(ప్రాథమిక స్థాయిలో ఈ విభాగాన్ని వివరించేటప్పుడు కమ్యూనిస్టు పార్టీ విశిష్టత గురించీ, కార్మికవర్గ పార్టీకీ, పాలక వర్గ పార్టీకీ మధ్యనున్న తేడా గురించీ ప్రధానంగా కేంద్రీకరించి చెప్పాలి. ఉన్నత స్థాయిలో కమ్యూనిస్టు పార్టీ పట్ల విప్లకర అవగాహన, రివిజనిస్టు/సోషల్ డెమోక్రాటిక్ అవగాహనకూ మధ్య తేడాను వివరించడంపై కేంద్రీకరించాలి.)*

కమ్యూనిస్టు పార్టీ ప్రధాన నిర్మాణ సూత్రాలు ఇవీ:

1) మార్క్సిస్టు పార్టీ కార్మిక వర్గంలో భాగం, దానికి సంబంధించిన అగ్రగామి దళం. వర్గ–చైతన్యం గల కార్మికవర్గపు అగ్రగామి దళమే పార్టీ.

2) పార్టీ కార్మికవర్గపు నిర్మాణయుతమైన అగ్రగామి దళం. దాని క్రమశిక్షణే దాని సభ్యులను ఒక్కటి చేస్తుంది.

3) పార్టీ కార్మికవర్గపు "అన్ని సంస్థల్లో కెల్లా అత్యున్నత స్థాయి సంస్థ." అది కార్మికవర్గపు ఇతర అన్ని సంస్థలకు మార్గదర్శకత్వం వహించాల్సిన బాధ్యత కలిగి ఉంటుంది.

4) కోట్లాదిమంది కార్మికులతో కార్మికవర్గపు అగ్రగామి దళాన్ని అనుసంధించే స్వరూపమే పార్టీ.

5) కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రంపై పార్టీ నిర్మితమవుతుంది.

6) పార్టీ ఒక ఉమ్మడి కార్మికవర్గ క్రమశిక్షణను పార్టీ సభ్యులందరిపైనా– నాయకులు, కిందిస్థాయిలో కార్యకర్తలందరిపైనా అమలు చేస్తుంది.

ఈ కమ్యూనిస్టు పార్టీ సూత్రాల ప్రాముఖ్యతను అంతర్జాతీయ అనుభవాలతో మేళవించి 'సోవియట్ యూనియన్ (బోల్షివిక్) కమ్యూనిస్టుపార్టీ చరిత్ర' గ్రంథంలో ఇలా చెప్పారు:

"1) మార్క్సిస్టు పార్టీ అనేది కార్మికవర్గంలో భాగం, దాని విభాగం. కానీ కార్మికవర్గానికి అనేక విభాగాలుంటాయి. అందువల్ల కార్మికవర్గ విభాగాలన్నిటినీ కార్మికవర్గ పార్టీలుగా పిలవకూడదు. కార్మికవర్గపు ఇతర విభాగాలకు పార్టీ భిన్నంగా ఉంటుంది, ఎందుకంటే అది సాధారణమైన విభాగం కాదు కాబట్టి. అది ఒక అగ్రగామి విభాగం, వర్గ చైతన్యం గల విభాగం, కార్మికవర్గపు మార్క్సిస్టు విభాగం. సామాజిక జీవనం, దాని అభివృద్ధి సూత్రాలు, వర్గపోరాట సూత్రాల గురించిన జ్ఞానాన్ని అది ఆయుధంగా

కలిగి ఉంటుంది. అందువల్లనే అది కార్మికవర్గానికి నాయకత్వం వహించ గలదు, దాని పోరాటాలకు మార్గదర్శకత్వం వహించగలదు. అందువల్ల ఒక భాగమూ, మొత్తమూ ఒకటే అని ఎలా గందరగోళపడకూడదో అలాగే పార్టీ, కార్మిక వర్గమూ రెండూ ఒకటే అని గందరగోళపడకూడదు. సమ్మెచేసే ప్రతి ఒక్క వ్యక్తీ తనను తాను పార్టీ సభ్యునిగా పరిగణించుకోడానికి అనుమతించాలని డిమాండు చేయకూడదు. పార్టీ, వర్గమూ ఒకటే అని గందరగోళపడేవారు పార్టీ చైతన్యాన్ని "ప్రతి సమ్మెకారుని" స్థాయికి దిగజార్చేస్తారు. కార్మికవర్గ అగ్రగామి దళంగా ఉన్న పార్టీని నాశనం చేస్తారు. పార్టీ కర్తవ్యం, తన చైతన్యాన్ని "ప్రతి సమ్మెకారుని" స్థాయికి దిగజార్చడం కాదు. కార్మికవర్గ జనబాహుళ్యాన్నీ, "ప్రతి సమ్మెకారునీ" పార్టీ స్థాయికి పెంపొందించడం దాని కర్తవ్యం.

"2) పార్టీ అనేది కేవలం అగ్రగామి దళం, కార్మికవర్గపు వర్గచైతన్యం గల విభాగం మాత్రమే కాదు. అది సభ్యులందరికీ వర్తించే క్రమశిక్షణ గల కార్మివర్గపు నిర్మాణయుతమైన విభాగం కూడా. అందువల్ల పార్టీ సభ్యులు తప్పకుండా పార్టీకి చెందిన ఏదో ఒక సంస్థలో సభ్యులుగా ఉండాలి. పార్టీ గనుక కార్మికవర్గపు నిర్మాణయుతమైన విభాగంగా ఉండకుండా, నిర్మాణంలో ఇమిడి ఉండకుండా ఎవరికి వారు సభ్యులుగా ప్రకటించుకుని ఏ సంస్థలోనూ సభ్యులు కాకుండా ఉండే ఒక సమూహంగా ఉంటే, అందువల్ల పార్టీ సభ్యులు నిర్మాణంలో ఉండకుండా, పార్టీ నిర్ణయాలకు కట్టుకబడకుండా ఉంటే అప్పుడు పార్టీకి ఒక ఉమ్మడి సంకల్పం ఉండదు. అప్పుడది తన పార్టీ సభ్యుల ఐక్య కార్యాచరణను సాధించలేదు. దాని ఫలితంగా అది కార్మికవర్గ పోరాటానికి మార్గదర్శకత్వం వహించలేదు. పార్టీ సభ్యులంతా ఒకే విభాగంలో నిర్మాణయుతంగా ఉన్నప్పుడే, ఒకే సంకల్పంతో బంధించబడినప్పుడే, కార్యాచరణలోనూ, క్రమశిక్షణలోనూ ఐక్యత ఉన్నప్పుడే పార్టీ కార్మికవర్గపు ప్రత్యక్ష పోరాటాన్ని నడపగలదు, దాన్ని ఒకే లక్ష్యం వైపు నడిపించగలదు.

"3) పార్టీ కేవలం నిర్మాణయుతమైన విభాగం మాత్రమే కాదు, అది కార్మికవర్గపు "సంస్థల అన్ని రూపాల్లోకీ అత్యున్నతమైన రూపం". కార్మిక వర్గపు ఇతర అన్ని సంస్థలకు మార్గదర్శకత్వం వహించడం దాని కర్తవ్యం. పార్టీ అత్యుత్తమ సంస్థాగత రూపం, తన వర్గంలోని అత్యంత ఉన్నతమైన సభ్యులను కలిగి ఉంటుంది, ఆధునిక సిద్ధాంతాన్ని ఆయుధంగా కలిగి ఉంటుంది, వర్గ పోరాట సూత్రాల గురించి తెలుసుకుని ఉంటుంది, విప్లవోద్యమంలో అనుభవం

కలిగి ఉంటుంది కనుక అది కార్మికవర్గపు ఇతర అన్ని సంస్థలకు మార్గదర్శకత్వం వహించే అవకాశం కలిగి ఉంటుంది, మార్గదర్శకత్వం వహించాల్సిన బాధ్యత కలిగి ఉంటుంది. పార్టీ నాయకత్వ పాత్రను తగ్గించడానికీ, బలహీనపరచడానికీ మెన్షివిక్కులు చేసిన ప్రయత్నాల వల్ల పార్టీ మార్గదర్శకత్వంలో ఉన్న కార్మివర్గపు ఇతర అన్ని సంస్థలు బలహీన పడిపోయే పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా కార్మిక వర్గం బలహీన పడి, నిరాయుధం అయ్యే పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే "అధికారం కోసం జరిపే పోరాటంలో కార్మికవర్గానికి నిర్మాణం తప్ప మరో ఆయుధం లేదు."

"4) కోట్లాదిమంది కార్మికులతో కార్మికవర్గపు అగ్రగామి దళాన్ని అనుసంధించే స్వరూపమే పార్టీ. ఎంత మంచి అగ్రగామి దళంగా పార్టీ ఉన్నా, ఎంత మంచి నిర్మాణయుతంగా ఉన్నా, పార్టీ ఏతర ప్రజాబాహుళ్యంతో సంబంధాలు లేకుండా, అభివృద్ధి చేసుకోకుండా, ఈ సంబంధాలను ఇబ్బిడిముబ్బిడిగా పెంచుకుంటూ, బలోపేతం చేసుకుంటూ ముందుకు పోకుండా అది మనుగడసాగించలేదు. తనలో తాను ముడుచుకుని బందించుకున్న పార్టీ, ప్రజల నుండి దూరమైన పార్టీ, తన వర్గంతో సంబంధాలను బలహీనపరుచుకున్నా చివరికి సడలింపునిచ్చినా ఆ పార్టీ ప్రజాబాహుళ్యపు విశ్వాసాన్ని కోల్పోతుంది. ఫలితంగా అది తప్పక అంతమైపోతుంది. సజీవంగా, సంపూర్ణంగా జీవించాలన్నా, అభివృద్ధి కావాలన్నా పార్టీ ప్రజలతో తన సంబంధాలను అనేక రెట్లు పెంచుకోవాలి. తన వర్గానికి చెందిన కోట్లాది మంది ప్రజల విశ్వాసం పొందాలి.

"5) పార్టీ సక్రమంగా పనిచేయాలన్నా, ప్రజలకు పద్ధతి ప్రకారం మార్గదర్శకత్వం వహించాలన్నా అది కేంద్రీకృత ప్రజాతంత్ర సూత్రం ప్రకారం నిర్మించబడాలి. దీని ప్రకారం ఒకే నిబంధనావళి ఉండాలి, అందరికీ సమానమైన పార్టీ క్రమశిక్షణ ఉండాలి, ఒకే నాయకత్వ సంస్థ – పార్టీ మహాసభ, మహాసభల మధ్య కాలంలో – పార్టీ కేంద్ర కమిటీ ఉండాలి, మైనారిటీ మెజారిటీ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలి. వివిధ సంస్థలు కేంద్రానికి కట్టుబడి పనిచేయాలి. కింది సంస్థలు పై స్థాయి సంస్థలకు కట్టుబడి పనిచేయాలి. ఈ షరతులను అమలు పరచడంలో విఫలమైతే, కార్మికవర్గ పార్టీ నిజమైన పార్టీగా ఉండజాలదు, తన వర్గానికి మార్గదర్శకత్వం వహించడంలో తన కర్తవ్యాలను నెరవేర్చజాలదు.

"6) ప్రత్యక్ష కార్యాచరణలో పార్టీ గనుక తన సభ్యుల మధ్య ఐక్యతను కాపాడాలంటే

అది ఉమ్మడి కార్మికవర్గ క్రమశిక్షణను పార్టీ సభ్యులందరికీ, నాయకులూ, కార్యకర్తలు అందరికీ వర్తించే విధంగా అమలు చేయాలి. అందువల్ల పార్టీలో క్రమశిక్షణను పాటించాల్సిన అవసరం లేని "కొంతమంది ఎంపికచేసినవారు", క్రమశిక్షణ తప్పక పాటించాల్సిన "అనేకమంది" మధ్య విభజన ఉండకూడదు. ఈ షరతు గనుక పాటించకపోతే పార్టీ సమగ్రత, పార్టీ కార్యకర్తల మధ్య ఐక్యత కొనసాగించలేం."

## II

# పార్టీ నిబంధనావళి

***(నిబంధనావళిలోని ప్రతి అంశాన్నీ దానికి ప్రాతిపదిక అయిన మౌలిక సూత్రాలను ఉటంకిస్తూ వివరించాలి.)***

పార్టీ నిర్మాణపు విప్లవ సూత్రాలను నిర్దిష్టంగా అమలు చేసేదే పార్టీ నిబంధనావళి. పార్టీ నిబంధనావళి పార్టీ మౌలిక పత్రాల్లో ఒకటి. ఇది పార్టీ యొక్క మౌలిక నిర్మాణ సూత్రాలనూ, ప్రత్యక్ష కార్యాచరణ పద్ధతులనూ, పార్టీ యంత్రాంగం, పార్టీ ఆంతరంగిక జీవనాలను నిర్వచిస్తుంది. 1968 డిసెంబర్ 23 నుండి 29 వరకు కోచిలో జరిగిన 8వ పార్టీ మహాసభ, విప్లవ కార్మికవర్గ పార్టీ లక్షణాల పట్ల అవగాహనను ప్రోదిచేస్తూ పార్టీ పనికీ, నిర్మాణానికీ మార్గదర్శకత్వం వహించే ఒక నిబంధనావళిని ఆమోదించింది. తరువాతి కాలంలో జరిగిన పార్టీ మహాసభలు కొత్తగా తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు కొన్ని సవరణలు చేశాయి.

పార్టీ నిబంధనావళిలో 25 అధికరణాలున్నాయి. ప్రతి అధికరణం, పార్టీ నిర్మాణం, పార్టీ ఆంతరంగిక జీవనానికి సంబంధించిన వేర్వేరు ముఖ్యమైన అంశాలను నిర్వచిస్తుంది. పార్టీ నిబంధనావళితోపాటు, నిబంధనలు, నిబంధనావళి కింద రూపొందించబడిన, దానికి అనుగుణమైన బై-లాలు ఉన్నాయి. ఈ నిబంధనలు, బై-లాలు నిబంధనావళిలోని అధికరణాలను అమలు చేయడానికి సంబంధించిన పద్ధతులు, కాల పరిమితులు, సభ్యత్వ రుసుము, లెవీ రేట్లు వగైరా వివరాలకు సంబంధించినవి.

### పార్టీ పేరు, లక్షణం, దాని లక్ష్యం, మార్గదర్శక సూత్రాలు

పార్టీ పేరు 'భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)' అని ఉండాలని ఒకటవ అధికరణం చెబుతోంది.

2వ అధికరణం, పార్టీ లక్షణం, దాని లక్ష్యం, మార్గదర్శక సూత్రాలు, దాని అంతర్జాతీయ లక్షణాన్ని గురించి చెబుతుంది. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), భారత కార్మిక వర్గ విప్లవ అగ్రగామి దళం. పార్టీ సోషలిజం, కమ్యూనిజాలను నిర్మించాలన్న తన లక్ష్యానికి గట్టిగా కట్టుబడి పనిచేస్తుంది. ప్రస్తుత బడా బూర్జువా నాయకత్వంలోని బూర్జువా–భూస్వామ్య ప్రభుత్వానికి చెందిన రాజ్యంలో సోషలిజం, కమ్యూనిజం సాధించబడదని నిర్ధారణ అయిపోయింది. కార్మికవర్గ నియంతృత్వ రాజ్యం కింద మాత్రమే సోషలిజం, కమ్యూనిజం ఏర్పాటు సాధ్యం. మనిషిని మనిషి దోపిడీ చేయడాన్ని అంతం చేసే సరైన మార్గాన్ని శ్రామిక వర్గానికి చూపించేది మార్క్సిజం–లెనినిజం మాత్రమేనన్న సూత్రాలు, తత్వశాస్త్రం చేత పార్టీ కార్యకలాపాలు, పార్టీ నడిపించబడతాయి.

కార్మిక వర్గ అంతర్జాతీయతా పతాకాన్ని పార్టీ సమున్నతంగా ఎగురవేయాలని 2వ అధికరణం నొక్కి చెబుతోంది. సామాజికాభివృద్ధి సూత్రాలు సర్వత్రా ఒకేలాగా ఉంటాయి, అన్ని దేశాల్లో ఒకేలాగా పనిచేస్తాయి. కానీ ప్రతి కమ్యూనిస్టు పార్టీ ఒక జాతీయ స్థాయిలో పోరాటం చేయాల్సి ఉంటుంది. ఇతర పార్టీల అనుభవాలు తెలిసి ఉన్న ఒక పార్టీ సరైన మార్గం కనుక్కోడానికి సహాయం చేయవచ్చు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) భారత పరిస్థితులకు మార్క్సిజం – లెనినిజాన్ని అమలుచేస్తూ స్వతంత్ర మార్గాన్ని అనుసరిస్తూనే మరోవంక అది పీడిత వర్గాల ప్రయోజనాలను కాపాడ్డం కోసం, సామ్రాజ్యవాదుల ఆధిపత్యాన్ని వ్యతిరేకించడం కోసం, సోషలిజాన్ని సమర్థించడం కోసం భావసారూప్యత గల కమ్యూనిస్టు పార్టీలతో సన్నితంగా కలిసి పనిచేస్తుంది.

## పతాకం

పార్టీ పతాకం ఎలా ఉండాలో 3వ అధికరణం చెబుతుంది.

## పార్టీ సభ్యత్వం, దానికి సంబంధించిన విషయాలు

పార్టీ సభ్యత్వానికి సంబంధించిన వివిధ అంశాలను 4వ అదికరణం నుండి 10వ అధికరణం వరకు వివరిస్తాయి.

పార్టీ సభ్యత్వానికి ఉండాల్సిన కనీస అర్హతలు, సభ్యత్వ చేర్పింపు పద్ధతులు, క్యాండిడేట్ సభ్యుల విధులు, హక్కులు, వారి శిక్షణ, ఎడ్యుకేషన్‌కు సంబంధించిన అంశాలను 4వ అధికరణం వివరిస్తుంది.

**సహాయ కణాలు (ఆగ్జిలరీ గ్రూపులు)**

సహాయ కణాల ఏర్పాటుకు సంబంధించిన నిబంధనలు పార్టీ నిబంధనావళిలో ఉన్నాయి. పార్టీ సహాయ కణాలను ఏర్పాటు చేయాలని, ఈ సహాయ కణాల నుండే క్యాండిడేట్ సభ్యులను రిక్రూట్ చేసుకోవాలని 1967 కేంద్ర కమిటీ పత్రమూ, సాల్కియా ప్లీనం ఆదేశిస్తున్నాయి. 2002 డిసెంబర్‌లో కేంద్ర కమిటీ, పార్టీ రిక్రూట్‌మెంటు, క్యాండిడేట్ సభ్యులను, సహాయ కణ సభ్యులను తీసుకోవడం గురించి మార్గదర్శకాలను ఆమోదించింది. ప్రజా ఉద్యమాల సందర్భంలో చురుకుగా పాల్గొనే వారినీ, మిలిటెంట్‌గా పనిచేసేవారినీ, ప్రజాసంఘాల్లోని వారినీ సమీకరించి వారితో సహాయ కణాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని పార్టీ నిబంధనావళిలోని నిబంధనలు చెబుతున్నాయి. అంటే విశాలమైన సానుభూతిపరులతో వీటిని ఏర్పాటు చేయాలన్న మాట. ఈ సహాయ కణ సభ్యులకు పార్టీ కార్యక్రమం గురించీ, పార్టీ మౌలిక విధానాల గురించీ ఎడ్యుకేట్ చేసి, శిక్షణ ఇచ్చే ఏర్పాట్లను పార్టీ కమిటీలు చేయాలి. దాని వల్ల వారు ఒక నిర్ధిష్ట సమయంలో (సాధారణంగా ఆరుమాసాల్లో) పార్టీలో క్యాండిడేటు సభ్యులుగా చేరడానికి అర్హత సాధించగలుగుతారు. క్యాండిడేట్ సభ్యులను సహాయ కణాల నుండి మాత్రమే రిక్రూట్ చేసుకోవాలి. క్యాండిడేట్ సభ్యులకు ఎన్నుకోడానికీ, ఎన్నికవడానికీ, ఏ తీర్మానం మీదా ఓటు వేయడానికీ హక్కు ఉండదు మినహా మిగిలిన విషయాల్లో పూర్తి పార్టీ  సభ్యులకుండే అన్ని హక్కులూ, బాధ్యతలూ ఉంటాయి. క్యాండిడేట్ సభ్యుని చేర్చుకునే పార్టీ శాఖ, లేక పార్టీ కమిటీ వారికి ప్రాథమిక స్థాయిలో పార్టీ కార్యక్రమం, నిబంధనావళి, పార్టీ ప్రస్తుత రాజకీయాల గురించి ఎడ్యుకేట్ చేయాలి. అంతే కాకుండా పార్టీ శాఖ, యూనిట్‌లో సభ్యులుగా వారు పనిలో అభివృద్ధి చెందేట్లు ఆయా పార్టీ యూనిట్‌లు చూడాలి. క్యాండిడేట్ సభ్యుడు తను క్యాండిడేట్ సభ్యునిగా చేరిన తేదీ నుండి ఒక సంవత్సరం వరకు మాత్రమే క్యాండిడేట్ సభ్యునిగా ఉంటారు. క్యాండిడేచర్ కాలం పూర్తయిన తరువాత ఆయా పార్టీ యూనిట్‌లు క్యాండిడేట్ సభ్యుడు పూర్తి సభ్యత్వానికి అర్హుడా కాదా అని చర్చించాలి. ఒక క్యాండిడేట్ సభ్యుడు గనుక అనర్హుడని తేలితే పార్టీ యూనిట్ అతడు/ఆమె క్యాండిడేట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి. పూర్తి స్థాయి సభ్యునిగా తీసుకుంటే దానిపై ఆయా యూనిట్ తన పైకమిటీ ఆమోదం కోసం నివేదికను పంపాలి. నివేదికను  పైకమిటీ పరిశీలించాక ఆ నివేదిక సమర్పించిన యూనిట్‌తో సంప్రదించి ఆ నివేదికలో మార్పులు చేర్పులు చేయవచ్చును. క్యాండిడేట్ల రిక్రూట్ మెంటు, పూర్తి స్థాయి సభ్యునిగా చేర్చుకోవడంపై జిల్లా, రాష్ట్ర కమిటీలు పర్యవేక్షణ చేస్తాయి. కింది కమిటీలు చేసే నిర్ణయాలకు మార్పులు చేర్పులు చేసే, లేక తిరస్కరించే అధికారం ఈ కమిటీలకు ఉంటుంది.

ఇద్దరు పార్టీ సభ్యుల సిఫార్సుతో వ్యక్తిగత దరఖాస్తు పెట్టుకున్న కొత్త సభ్యులను పార్టీలోకి చేర్చుకుంటారు. ఒక దరఖాస్తుదారుని పార్టీలోకి తీసుకోవాలని సిఫార్సు చేసే పార్టీ సభ్యుడు దరఖాస్తు దారుని గురించి తనకు తెలిసిన సమాచారాన్నంతటినీ బాధ్యతాయుతంగా పార్టీ శాఖ ముందు పెట్టాలి. దరఖాస్తు దారుని పార్టీలో చేర్చుకోవచ్చని అనుకుంటే పార్టీ శాఖ తన పైకమిటీకి సిఫార్సు చేయవచ్చు. పైకమిటీ అన్ని సిఫార్సులపై నిర్ణయం తీసుకుంటుంది. పార్టీలోకి కొత్త సభ్యులను చేర్చుకునే అధికారం కేంద్ర కమిటీ వరకూ పార్టీ శాఖ పైనున్న అన్ని కమిటీలకు ఉంటుంది.

సహాయ కణాల ఏర్పాటులోనూ, క్యాండిడేటు సభ్యులు, పూర్తిస్థాయి సభ్యుల రిక్రూట్‌మెంటులోనూ అనేక బలహీనతలు, లోపాలు ఉన్నాయి.

పార్టీలోని అనేక మంది సభ్యులకు పార్టీ సభ్యత్వానికి ఉండాల్సిన కనీస అర్హత లేదని కొల్‌కొతా ప్లీనంలో పార్టీ నిర్మాణంపై ఆమోదించిన నివేదిక పేర్కొన్నది. ఇదంతా పార్టీ సభ్యుల రిక్రూట్‌మెంటు క్రమంలో జరుగుతున్న లోపాలవల్లనే సంభవిస్తున్నదని ప్లీనం పేర్కొంది. ఈ బాధ్యతంతా పార్టీ నిర్మాణానిదే. అనేక రాష్ట్రాల్లో పార్టీ సభ్యులను సహాయ కణాల నుండే రిక్రూట్ చేసుకుంటున్నప్పటికీ మెజారిటీ సహాయ కణాలు నిరంతరాయంగా పనిచేయడం లేదు, పై కమిటీలు వాటికి సక్రమంగా మార్గదర్శకత్వం వహించడం లేదు. సహాయ కణాలకూ, కాండిడేటు సభ్యులకూ రాజకీయ, నిర్మాణపరమైన విద్య గరపడంలో లోపాలున్నాయి. అందువల్ల సహాయ కణాల నుండి క్యాండిడేట్ సభ్యులుగా రిక్రూట్ చేసుకునే ముందు సహాయ కణాలకు శిక్షణ ఇవ్వకపోవడం దగ్గరే లోపం జరుగుతోంది. లూజ్ సభ్యత్వ రిక్రూట్‌మెంటు, సహాయ కణాలకు, క్యాండిడేట్ సభ్యులకు రాజకీయ, నిర్మాణపరమైన శిక్షణ ఇవ్వకపోవడం అనేది పార్టీ సభ్యుల్లో రాజకీయ, నిర్మాణ స్థాయి తక్కువగా ఉండడానికి ప్రధాన కారణం.

కొన్ని రాష్ట్ర కమిటీలు ఒక క్యాండిడేట్ సభ్యుడు ప్రమోషన్‌కు అనర్హుడని తేలినప్పటికీ అతను/ఆమెను ఏడాది తరువాత కూడా క్యాండిడేట్ సభ్యునిగా కొనసాగిస్తున్నారు. నిబంధనావళిలోని 4వ అధికరణం, 8వ నిబంధన ప్రకారం ఇది తప్పుడు పద్ధతి. క్యాండిడేట్ సభ్యుడు గనుక అనర్హుడని తేలితే పార్టీ శాఖ లేక కమిటీ అతను/ఆమె క్యాండిడేట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి.

మరో రాజకీయ పార్టీకి చెందిన స్థానిక/జిల్లా/రాష్ట్ర స్థాయి నాయకుడు పార్టీలో చేరడానికి వస్తే అతను/ఆమెను పార్టీ సభ్యత్వంలోకి తీసుకునే ముందు ఆయా స్థానిక, జిల్లా లేక రాష్ట్ర కమిటీ ఆమోదంతోపాటు పైకమిటీ ఆమోదం కూడా తప్పకుండా ఉండాలి. సాధారణంగా అటువంటి వారిని క్యాండిడేటు సభ్యులుగా చేర్చుకుంటారు. కొన్ని అసాధారాణ కేసుల్లో కేంద్ర కమిటీ లేక రాష్ట్ర కమిటీ అటువంటి సభ్యులను

పూర్తి స్థాయి పార్టీ సభ్యులుగా చేర్చుకోవచ్చు. రాష్ట్ర కమిటీ అటువంటి వారిని పార్టీలోకి చేర్చుకునే ముందు కేంద్ర కమిటీ అనుమతి తీసుకోవాలి. పార్టీ నుండి ఒక సారి బహిష్కరించబడిన పార్టీ సభ్యులను తిరిగి చేర్చుకోవాల్సి వస్తే వారి బహిష్కరణను నిర్ధారించిన కమిటీ లేక పై కమిటీ నిర్ణయంతో మాత్రమే చేర్చుకోవాలి.

**పార్టీ సభ్యత్వ రికార్డులు**

సభ్యత్వ రికార్డులన్నింటినీ జిల్లా కమిటీల పర్యవేక్షణలో ఉంచాలని నిబంధనావళిలోని 6వ అధికరణం చెబుతోంది.

**పార్టీ సభ్యత్వ తనిఖీ**

పార్టీ సభ్యుడు ఏ పార్టీ సంస్థలోనైతే సభ్యునిగా ఉన్నాడో ఆ సంస్థ ఏడాదికొకసారి పార్టీ సభ్యత్వాన్ని తనిఖీ చేయాలని నిబంధనావళిలోని 7వ అధికరణం వివరిస్తోంది. ఏ సభ్యుడైనా సరైన కారణం లేకుండా పార్టీ జీవితంలోనూ, కార్యకలాపాల్లోనూ పాల్గొనకపోతే లేక సభ్యత్వ రుసుం, లెవీ చెల్లించడంలో విఫలమైతే అటువంటి సభ్యుని పార్టీ సభ్యత్వం నుండి తొలగించాలి. ఒక పార్టీ యూనిట్ చేసిన పార్టీ సభ్యత్వ తనిఖీ నివేదికను నిర్ధారణ, రిజిస్ట్రేషన్ కోసం పై కమిటీకి పంపించాలి. ఒక పార్టీ సభ్యుడు సభ్యత్వం నుండి తొలగించబడితే ఆ తొలగింపు నిర్ణయంపై అతను/ఆమెకు అప్పీలు చేసుకునే అధికారం ఉంటుంది.

పార్టీ సభ్యుల రిక్రూట్‌మెంటు, స్క్రూటినీ, వారి శిక్షణపై కొల్‌కొతా ప్లీనం ఆమోదించిన నివేదిక ఈ క్రింది విధంగా తీవ్రమైన సమీక్ష చేసింది:

"1.80 పార్టీ సభ్యుల నాణ్యతను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం పార్టీ సభ్యత్వ పెరుగుదలను పార్టీ విస్తరణగా పరిగణించలేం. పార్టీ సభ్యుల రాజకీయ – సైద్ధాంతిక స్థాయినీ, పార్టీ సభ్యత్వ నాణ్యతనూ పెంచడం కీలక కర్తవ్యం. ఈ విషయంలో తక్షణం దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. పార్టీ సభ్యుల రిక్రూట్‌మెంటు, శిక్షణ విషయంలో మౌలికమైన మార్పు రావాలి. వర్గ, ప్రజా పోరాటాల్లో పాల్గొనడమే పార్టీ సభ్యత్వానికి ప్రధాన అర్హతగా ఉండాలి.

"1.81 ప్రస్తుత పార్టీ సభ్యుల నాణ్యతను పెంచడం కోసం, పార్టీ సభ్యత్వాన్ని ఒక పద్ధతి ప్రకారం, మంచి – ప్రణాళికా యుతమైన సమీక్ష చేయాలి. రాజకీయ చైతన్యం, ప్రజా కార్యకలాపాలు, నిర్మాణపరమైన క్రమశిక్షణ మొదలైనవి పార్టీ సభ్యునికి ఉండాల్సిన దాని కన్నా చాలా తక్కువగాఉన్న వారిని పార్టీ సభ్యత్వం నుండి తొలగించాలి. అయితే ఇది 2017 రెన్యువల్స్ నుండి జరగాలి. పై కమిటీ సభ్యులు హాజరైన పార్టీ

శాఖల్లో. కొత్త నిర్మాణ మార్గదర్శకత్వంలో ప్రతి ఒక్క సభ్యుని పనినీ, ప్రవర్తననూ ఆత్మ విమర్శనాపూర్వకంగా నివేదించడం ద్వారా జరగాలి. పార్టీ సభ్యుల రిక్రూట్‌మెంటుపై 2002లో కేంద్ర కమిటీ ఇచ్చిన మార్గదర్శకత్వాలు ఇప్పటికీ వర్తిస్తాయి. పార్టీ సభ్యుల నాణ్యతను పెంచడానికి వాటిని కచ్చితంగా అమలు చేయాలి.

"1.82 ఈ క్రింది కర్తవ్యాలు నెరవేర్చితేనే పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలి.

"1.83 1) పార్టీ సభ్యత్వ రుసుం, లెవీ చెల్లింపు. 2) శాఖా సమావేశాలకు నిరంతరంగా హాజరు. 3) పార్టీ తరగతులు, రాజకీయ క్యాంపెయిన్లు, ఆందోళనలు, పోరాటాల్లో సంతృప్తికరంగా పాల్గొనడం. 4) పార్టీ మినహాయిస్తే తప్ప ప్రజా సంఘాల్లో సభ్యత్వం కలిగి ఉండడం, చురుకుగా పాల్గొనడం. 5) పార్టీ పత్రికలను నిరంతరం చదవడం, వాటికి చందాదారులుగా ఉండడం."

నిబంధనావళిలోని 8వ అధికరణం పార్టీ సభ్యత్వం నుండి రాజీనామా చేసే విషయానికి సంబంధించింది. పార్టీకి రాజీనామా చేయాలనుకునే సభ్యుడు ఏ శాఖ లేక యూనిట్‌లో సభ్యత్వం కలిగి ఉంటే దానికి అతను/ఆమె తన రాజీనామా లేఖను సమర్పించాలి. ఆ శాఖ ఆ సభ్యుని రాజీనామాను ఆమోదించి తన సభ్యత్వ లిస్టులోనుంచి సభ్యుని పేరు తొలగించవచ్చు. ఆ విషయాన్ని పై కమిటీకి తెలపాలి. రాజకీయ కారణాలతో రాజీనామా చేస్తే శాఖ ఆ రాజీనామాను ఆమోదించడానికి నిరాకరించి సభ్యుని బహిష్కరించవచ్చు. పార్టీకి రాజీనామా చేయాలనుకునే సభ్యుడు పార్టీ క్రమశిక్షణను తీవ్రంగా ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటూ, అతను పార్టీ నుండి బహిష్కరించబడేవాడు అయితే ఆ రాజీనామానే పార్టీ నుండి బహిష్కరణగా పరిగణించవచ్చు. బహిష్కరణగా పరిగణించబడే అటువంటి కేసులు లేక రాజీనామా లన్నింటినీ తక్షణం పై కమిటీలకు నివేదించి వాటి ఆమోదం తీసుకోవాలి.

సభ్యత్వ రుసుం ఏడాదికి రూ. 5 గా నిబంధనావళిలోని 9వ అధికరణం నిర్దేశిస్తోంది. సభ్యుల నుండి వసూలు చేసే సభ్యత్వ రుసుం అంతటినీ కేంద్ర కమిటీ వద్ద డిపాజిట్ చేయాలి.

నిబంధనావళిలోని 10వ అధికరణం లెవీ గురించి వివరిస్తుంది. ప్రతి పార్టీ సభ్యుడూ కేంద్ర కమిటీ నిర్ణయించిన విధంగా నెలసరి లెవీ చెల్లించాలి. ఎవరైనా సభ్యుడు లెవీ బకాయిని మూడు మాసాల్లోగా చెల్లించడంలో విఫలమైతే అతన్ని పార్టీ జాబితా నుండి తొలగించాలి. వార్షిక లేక సీజనల్ ఆదాయం వచ్చే వారు సీజన్ ప్రారంభంలో లేక ప్రతి త్రైమాసికం ప్రారంభంలో లెవీ చెల్లించాలి. కేంద్ర కమిటీ లెవీ చెల్లింపుల నిబంధనలను 10వ అధికరణంలో వివరించింది. ఇటీవల కేంద్ర కమిటీ లెవీ రేట్లను సవరించింది.

కొల్‌కొతా ప్లీనం లెవీ వసూళ్ల అనుభవాలను సమీక్షించి క్రింది వాఖ్యానాలు చేసింది: "పెద్ద సంఖ్యలో కామ్రేడ్స్ కేంద్ర కమిటీ నిర్దేశించిన విధంగా లెవీ చెల్లించడం లేదని అనేక రాష్ట్ర కమిటీలు పేర్కొన్నాయి. కేంద్ర కమిటీ రేట్ల ప్రకారం లెవీ వసూలు చేయడానికి కొన్ని రాష్ట్ర కమిటీలు ప్రయత్నిస్తున్నాయి. రాష్ట్ర రాష్ట్రానికీ పరిస్థితి వేరుగా ఉంటోంది. పూర్తికాలం కార్యకర్తలు, ప్రత్యేక శాఖలకు చెందిన సభ్యులు మినహా సాధారణంగా లెవీని ఏడాదికొక సారి సభ్యత్వ పునరుద్ధరణ సమయంలోనే వసూలు చేస్తున్నారు. ఎక్కువ ఆదాయం వస్తున్న సభ్యులు కేంద్ర కమిటీ రేట్ల ప్రకారం లెవీ చెల్లించడం లేదని అనేక రాష్ట్ర కమిటీలు చెప్పాయి. పెద్ద సంఖ్యలో పార్టీ సభ్యులు తమ నిజ ఆదాయాలను బయటపెట్టడం లేదని కొన్ని రాష్ట్ర కమిటీలు ఫిర్యాదు చేశాయి. సాధారణంగా ఒకటి నుండి రెండు శాతం సభ్యులు మాత్రమే కేంద్ర కమిటీ రేట్ల ప్రకారం లెవీ చెల్లిస్తున్నారని తమిళనాడు రాష్ట్ర కమిటీ చెప్పింది. కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపురలో పరిస్థితి కొద్దిగా మెరుగ్గా ఉంది కానీ లెవీ వసూళ్లు అనుకున్న స్థాయిలో మాత్రం అవడం లేదు. పార్టీ సభ్యుల్లో తక్కువ స్థాయిలో ఉన్న రాజకీయ–సైద్ధాంతిక స్థాయి, పార్టీకి వారి నిబద్ధత స్థాయి పార్టీకి లెవీ చెల్లించడంలోని లోపాల్లో ప్రతిబింబిస్తోంది. కేంద్ర కమిటీ రేట్ల ప్రకారం లెవీ చెల్లించేట్లు చేయాలి."

## పార్టీ సభ్యుల విధులు, హక్కులు

పార్టీ సభ్యుల విధులను నిబంధనావళిలోని 11వ అధికరణం, పార్టీ సభ్యుల హక్కులను నిబంధనావళిలోని 12వ అధికరణం వివరిస్తాయి.

నిబంధనావళిలోని 11వ అధికరణంలో పార్టీ సభ్యులకు ఉన్న 11 ముఖ్యమైన విధులను గురించి పేర్కొనడం జరిగింది.

పార్టీ సభ్యుని మొదటి విధి ఏమంటే, అతను/ఆమె ఏ పార్టీ సంస్థలోనైతే సభ్యులుగా ఉన్నారో ఆ సంస్థ కార్యకలాపాల్లో నిరంతరం పాల్గొనాలి, పార్టీ విధానాలు, నిర్ణయాలు, ఆదేశాలను విశ్వాసంతో అమలు చేయాలి. పార్టీ సభ్యుల్లో గణనీయమైన భాగం పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా లేరనీ, పార్టీ శాఖా సమావేశాలకు, పార్టీ రాజకీయ తరగతులకే, లేక రాజకీయ క్యాంపెయిన్లకు, ఆందోళనలకు హాజరుకావడం లేదనీ పార్టీ మహాసభ, కొల్‌కొతా ప్లీనం చేసిన సమీక్ష తెలియజేసింది. పార్టీ సభ్యులందరినీ చురుకుగా పనిచేయించాలనీ, రాజకీయ విద్య ద్వారా, పార్టీ శాఖలను చురుకుగా పనిచేయించడం ద్వారా వారి రాజకీయ చైతన్యాన్ని పెంచాలని కొల్‌కొతా ప్లీనం నిర్ణయించింది.

పార్టీ సభ్యుల రెండవ విధి, మార్క్సిజం – లెనినిజాన్ని అధ్యయనం చేసి తమ అవగాహనా స్థాయిని పెంచుకోడానికి కృషి చేయాలి. పార్టీ సభ్యుడు చైతన్య పూర్వకంగా మార్క్సిజం – లెనినిజం సిద్ధాంతాన్ని, పద్ధతిని అధ్యయనం చేసి దాని సారాన్ని, స్ఫూర్తినీ గ్రహించడానికి ప్రయత్నించాలి. మార్క్సిస్టు – లెనినిస్టు సూత్రాలనూ, నిర్ధారణలనూ బట్టీపట్టడంతో వారు సరిపుచ్చుకోరాదు. వారుపటిష్టవంతమైన మార్క్సిస్టు – లెనినిస్టు వైఖరి తీసుకోవాలి, మార్క్సిజం – లెనినిజం పద్ధతని తెలుసుకోవాలి, దానికనుగుణంగా నడుచుకోవాలి. ప్రతి విప్లవ పోరాటంలోనూ స్ఫూర్తివంతమైన మార్గదర్శకత్వం వహించాలి.

పార్టీ పత్రికలు, ప్రచురణలను చదవడం, వాటికి మద్దతిచ్చి ప్రచారం చేయడం పార్టీ సభ్యుని మూడవ విధి. పార్టీ సభ్యులు తాము పనిచేస్తున్న ప్రజలచేత పార్టీ పత్రికలను, ప్రచురణలను చదివించాలి, ప్రచారం చేయాలి. ప్రజల రాజకీయ, సైద్ధాంతిక చైతన్యాన్ని పెంచకుండా వారిని ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక పోరాటాల్లోకి తీసుకు రావడం, నాయకత్వం వహించడం సాధ్యం కాదు.

పార్టీ సభ్యుని నాల్గవ విధి, పార్టీ నిబంధనావళినీ, పార్టీ క్రమశిక్షణనూ పాటించడం. కార్మికవర్గ అంతర్జాతీయతా స్ఫూర్తితో వ్యవహరించాలి. కమ్యూనిస్టులు సాధారణ వ్యక్తులు కారు కాబట్టి వారు కమ్యూనిస్టు ఆదర్శాల నమూనాతో మెలగాలి.

పార్టీ సభ్యుడు/సభ్యురాలి వ్యక్తిగత ప్రయోజనం కన్నా ప్రజలు, పార్టీ ప్రయోజనాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం పార్టీ సభ్యుల అయిదవ విధి. పార్టీ ప్రమాణాన్ని నిర్వచించే 5వ అధికరణం కూడా పార్టీ సభ్యులు... ప్రజల, పార్టీ ప్రయోజనాలను వ్యక్తిగత ప్రయోజనాలకన్నా ముందుంచాలని పేర్కొన్నది. పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ, పార్టీ సభ్యుడు/సభ్యురాలు తన వ్యక్తిగత ప్రయోజనాలకన్నా పార్టీ ప్రయోజనాలకు అంటే విప్లవ ప్రయోజనాలను విధేయతతో, బేషరతుగా మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాడా అన్నదే పార్టీ పట్ల పార్టీ సభ్యునికి ఎంత విధేయత ఉంది అన్నదానికి పరీక్ష.

కామ్రేడ్ మావో జెడాంగ్ ఇలా చెప్పారు: "ఏనాడూ, ఎట్టి పరిస్థితుల్లో కూడా కమ్యూనిస్టు తన స్వప్రయోజనాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వకూడదు. అతను తన స్వప్రయోజనాలను దేశ ప్రయోజనాలకు, ప్రజల ప్రయోజనాలకు లోబరిచి ఉంచాలి. అందువల్ల, స్వార్థం, బద్ధకం, అవినీతి, కీర్తి కండూతి వంటివి అత్యంత హేయమైనవి. నిస్వార్థం, ఒక వ్యక్తి తన శక్తియుక్తులన్నిటినీ వెచ్చించి పని చేయడం, ప్రజల పనిని హృదయపూర్వకంగా చేయడం, హడావుడి లేకుండా కష్టించి పనిచేయడం వారికి గౌరవాన్ని తెచ్చిపెడతాయి."(జాతీయ యుద్ధంలో చైనా కమ్యూనిస్టు పార్టీ పాత్ర" మావో ఏరిన రచనలు. ఇంగ్లీషు ఎడిషన్, 1975, వాల్యూమ్ 2, పేజీ 198)

పార్టీ సభ్యుని ఆరవ విధి ఏమంటే, ప్రజలకు విధేయతతో సేవచేయాలి. వారితో సంబంధాలను నిరంతరాయంగా అభివృద్ధి చేసుకోవాలి. ప్రజల నుండి నేర్చుకోవాలి, వారి అభిప్రాయాలు, డిమాండ్లను పార్టీకి నివేదించాలి. ప్రత్యేకంగా మినహాయించబడితే తప్ప పార్టీ సభ్యుడూ పార్టీ మార్గదర్శకత్వంలోని ఒక ప్రజా సంఘంలో పని చేయాలి. అనేక మంది పార్టీ సభ్యులు ప్రజా సంఘాల్లో సభ్యులుగా లేరని కొల్‌కొతా ప్లీనం పేర్కొంది.

పార్టీ సభ్యులు ప్రజాబాహుళ్యంతో సరైన, సన్నిహిత సంబంధాలను ఏర్పాటుచేసుకుని వారితో తమ బంధాలను నిరంతరాయంగా పెంచుకోవాలి. పార్టీ మినహాయిస్తే మినహా పార్టీ మార్గదర్శకత్వంలోని ప్రజా సంఘంలో చురుకుగా పనిచేయడం పార్టీ సభ్యుని విధి. ప్రజా సంఘాల్లో చురుకుగా పనిచేయడం ద్వారా, వాటి విస్తరణ ద్వారానే పార్టీ విస్తరణ సాధ్యమవుతుంది.

పార్టీలోని సభ్యుల మధ్య కామ్రేడ్లీ సంబంధాలు పెంచుకోవడం, పార్టీ లోపల సౌహార్ద్ర సంబంధాలను నిరంతరాయంగా పెంచడం పార్టీ సభ్యుని ఏడవ విధి. పార్టీ నిరంతరం శత్రువర్గాలతో పోరాడుతుంది. పార్టీ ఒక ఉమ్మడి అభిప్రాయాన్ని ఇముడ్చుకుని పనిచేయాలి. అందువల్ల ప్రతి పార్టీ సభ్యుడూ ఒకరిపట్ల మరొకరు సన్నిహిత కామ్రేడ్లీ సంబంధాలు పెంచడానికీ, పార్టీలోపల సౌహార్ద్రత నిరంతరాయంగా పెంపొందించడానికీ కృషి చేయాలి.

ఒకరికొకరు సహకరించుకేనే దృష్టితో, వ్యక్తిగత, సమిష్టి పనిని పెంపొందించు కునే దృష్టితో ప్రతి పార్టీ సభ్యుడు విమర్శ, ఆత్మ – విమర్శ అమలు జరపడం పార్టీ సభ్యుని ఎనిమిదవ విధి. పార్టీ పనిని మెరుగుపరుచుకోడానికి గాను పార్టీ నిరంతరాయంగా పార్టీ సభ్యుల కార్యకలాపాలను వ్యక్తిగతంగానూ, సమిష్టిగానూ సమీక్షిస్తుండాలి. వారిలోని సానుకూల, ప్రతికూల అంశాలను గుర్తించి లోపాలనూ, బలహీనతలనూ సరిదిద్దు కోడానికి విమర్శ, ఆత్మ – విమర్శ అనేవి సమీక్షకుపకరించే పద్ధతి. విమర్శ, ఆత్మ – విమర్శను కామ్రేడ్లీ స్ఫూర్తితో చేయాలి.

పార్టీ పట్ల నిక్కచ్చిగా, నిజాయితీగా, సత్యవంతంగా ఉండడం, పార్టీ విశ్వాసానికి ద్రోహం చేయకుండా ఉండడం పార్టీ సభ్యుని తొమ్మిదవ విధి. ఒక పార్టీ సభ్యుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీకి ద్రోహం చేయకూడదు, పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా ఏ పనీ చేయకూడదు.

పార్టీ సభ్యుని పదవ విధి, పార్టీ ఐక్యతనూ, సౌహార్ద్రతనూ కాపాడ్డం, కార్మికవర్గానికీ, దేశానికీ శత్రువులైన వారిపట్ల అప్రమత్తంగా ఉండడం.

పార్టీకీ, కార్మికవర్గానికీ, దేశానికీ శత్రువులైన వారి నుండి వచ్చే దాడుల

నుండి పార్టీని రక్షించడం, పార్టీ లక్ష్యాన్ని సమున్నతంగా ఉంచడం పార్టీ సభ్యుని పదకొండో విధి. పార్టీ, కార్మికవర్గం, దేశం ప్రయోజనాలకు హాని కలిగించే పార్టీ లోపలి, పార్టీ బయటి ప్రతి అంశంతో పార్టీ సభ్యుడు పోరాడాలి.

పార్టీ సభ్యులు తమ విధులను నిర్వహించడం, వారు విధులు నిర్వహించడానికి అన్ని విధాలా సహకరించడం ఆయా పార్టీ శాఖల కర్తవ్యం అని 11వ అధికరణం చెబుతోంది. ఇది పార్టీ సమిష్టి బాధ్యత.

ప్రతి పార్టీ సభ్యునికీ ఈ క్రింది హక్కులుంటాయని నిబంధనావళిలోని 12వ అధికరణం చెబుతోంది:

1) పార్టీ కమిటీలను ఎన్నుకోవడం, వాటికి ఎన్నిక కావడం
2) చర్చల్లో పాల్గొనడం, పార్టీ విధానాలు, నిర్ణయాల రూపకల్పనలో భాగస్వామి కావడం
3) పార్టీలో ఏ వ్యక్తి పని మీదనైనా ప్రతిపాదనలు చేయడం
4) పార్టీ సమావేశాల్లో పార్టీ కమిటీలపైనా, పార్టీ కార్యకర్తలపైనా విమర్శలు చేయడం. కానీ సభ్యులెవరూ పార్టీ శాఖల బయట పార్టీ పనితీరుపైనగానీ, పార్టీ కార్యకర్తలపైన గానీ విమర్శలు చేయకూడదు
5) పార్టీ సభ్యుని మీద పార్టీ శాఖలో క్రమశిక్షణా చర్యలు తీసుకనేటప్పుడు అతను/ఆమె వాదనను వ్యక్తిగతంగా వినాలి.
6) పార్టీ నిర్మాణం మీద పార్టీ కమిటీ నిర్ణయాన్ని ఒక పార్టీ సభ్యుడు అంగీకరించక పోతే అతను/ఆమెకు తన అభిప్రాయాన్ని పై కమిటీకి తెలియజేసే హక్కు ఉంది. రాజకీయ భేదాభిప్రాయం విషయానికి వస్తే ఒక సభ్యునికి కేంద్ర కమిటీ వరకు తన పైకమిటీకి అతని/ఆమె అభిప్రాయాన్ని తెలియజేసే హక్కు ఉంది. ఈ కేసులన్నిటి విషయంలో పార్టీ సభ్యుడు పార్టీ నిర్ణయాలను అమలు చేయాలి. భేదాభిప్రాయాలను కార్యాచరణ ద్వారా, కామ్రేడ్లీ చర్చల ద్వారా పరిష్కరించుకోడానికి ప్రయత్నించాలి.
7) పార్టీ సభ్యుడు కేంద్ర కమిటీతో సహా తన పై కమిటీలన్నిటికీ ప్రకటనలు, విన్నపాలు లేక ఫిర్యాదులు చేయవచ్చు.

పార్టీ సభ్యులకు సంబంధించిన ఈ హక్కులన్నీ పార్టీలో కింది నుండి పై వరకు అందరిలో కార్యాచరణను ప్రోది చేసేందుకూ, బాధ్యతా భావనను పెంపొం దించేందుకూ ఉద్దేశింపబడ్డాయి. పార్టీ ప్రయోజనాలకు నష్టం కలిగించే ప్రతిదానిపైనా సభ్యులు పోరాడేందుకు ఉద్దేశింపబడ్డాయి. పార్టీ సభ్యుల హక్కులు పరిరక్షించబడేట్లు చూడాల్సిన బాధ్యత పార్టీ శాఖల మీదా, పార్టీ కార్యకర్తల మీద ఉంది.

## కేంద్రీకృత ప్రజాస్వామ్యం

నిబంధనావళిలోని 13వ అధికరణం కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలను వివరిస్తుంది. పార్టీ నిర్మాణం పరిధిలో కేంద్రీకృత ప్రజాస్వామ్య మార్గదర్శక సూత్రాలు కింది విధంగా ఉంటాయి:

(1) పై నుండి క్రింది వరకు పార్టీ సంస్థలన్నీ ఎన్నుకోబడాలి;

(2) మెజారిటీ నిర్ణయాలను మైనారిటీ అమలు చేయాలి; పై స్థాయి పార్టీ సంస్థల నిర్ణయాలను, ఆదేశాలను కింది పార్టీ సంస్థలు అమలు చేయాలి; సమిష్టి నిర్ణయాలకు వ్యక్తి తలొగ్గాలి. పార్టీ మహాసభ, కేంద్ర కమిటీ నిర్ణయాలను అన్ని పార్టీ సంస్థలు అమలు చేయాలి.

(3) పార్టీ కమిటీలన్నీ తన క్రిందినున్న తక్షణ పార్టీ సంస్థలకు క్రమానుగతంగా రిపోర్టు చేయాలి. అదే విధంగా దిగువ స్థాయి కమిటీలన్నీ తమ తక్షణ పైకమిటీలకు రిపోర్టు చేయాలి.

క్రింది కమిటీలకు, పైకమిటీలకు రిపోర్టు చేయడం అనేది పార్టీలో సమిష్టి తత్వాన్ని పెంచేందుకుద్దేశింపబడింది.

(4) అన్ని పార్టీ కమిటీలు, ముఖ్యంగా నాయకత్వ పార్టీ కమిటీలు కింది స్థాయి పార్టీ సంస్థల, పార్టీ సభ్యుల్లో వివిధ శ్రేణుల అభిప్రాయాలను, విమర్శలను వినాలి.

(5) అన్ని పార్టీ కమిటీలు సమిష్టి నిర్ణయాలు, చెక్ – అప్ సూత్రాలను కచ్చితంగా పాటించాలి; వ్యక్తిగత బాధ్యతను కలిగి ఉండాలి.

(6) అంతర్జాతీయ వ్యవహారాలకు సంబంధించిన అన్ని సమస్యలనూ, అఖిల భారత లక్షణం గల సమస్యలనూ, లేక ఒక రాష్ట్రానికి మించిన రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలనూ లేక దేశం మొత్తానికి ఒకే రకమైన నిర్ణయాలు చేయాల్సిన సమస్యలను అఖిల భారత పార్టీ సంస్థ నిర్ణయిస్తుంది. రాష్ట్రం, జిల్లాలకు సంబంధించిన అన్ని సమస్యలనూ ఆయా పార్టీ సంస్థలు నిర్ణయిస్తాయి. కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ నిర్ణయాలు పై కమిటీ నిర్ణయాలకు భిన్నంగా ఉండకూడదు. ఒక రాష్ట్రానికి సంబంధించిన ప్రధానమైన సమస్యపై కేంద్ర పార్టీ నాయకత్వం నిర్ణయం చేయాల్సి వచ్చినప్పుడు అది సాధారణంగా ఆయా రాష్ట్ర పార్టీ సంస్థతో చర్చించి నిర్ణయించాలి. జిల్లాల విషయంలో రాష్ట్ర సంస్థలు కూడా అదే పనిచేయాలి.

(7) అఖిల భారత స్థాయిలో పార్టీ విధానాన్ని ప్రభావితం చేసే సమస్యపై పార్టీ వైఖరిని మొదటి సారిగా వెల్లడించాల్సి వచ్చినప్పుడు పార్టీ కేంద్ర నాయకత్వం మాత్రమే విధాన ప్రకటన చేయాలి. క్రింది కమిటీలు తమ అభిప్రాయాలు, సూచనలను సకాలంలో కేంద్ర నాయకత్వ పరిశీలనకు పంపవచ్చు.

పార్టీ అంతర్గత జీవితానికి ఈ క్రింది కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలు వర్తిస్తాయి:

(అ) పార్టీనీ, దాని విధానాలనూ, పనినీ ప్రభావితం చేసే సమస్యలపై పార్టీ శాఖలో స్వేచ్ఛగా, నిక్కచ్చిగా చర్చ జరగాలి. "పార్టీ కమిటీల్లో స్వేచ్ఛగా, నిక్కచ్చిగా చర్చ జరగడం లేదని కొన్ని కమిటీలు తెలిపాయి. అనేక రాష్ట్రాల్లో వివిధ స్థాయిల్లో ఫెడరల్, ఉదారవాద దోరణులు ఉన్నాయి. ఫెడరల్ ధోరణులకన్నా ఉదారవాద దోరణులు అధికంగా ఉన్నాయి" అని కొల్‌కొతా ప్లీనం తెలిపింది.

(ఆ) పార్టీ సభ్యులు పార్టీ విధానాలను ప్రచారం చేయడానికీ, అమలు చేయడానికీ, వారి సైద్ధాంతిక-రాజకీయ స్థాయిని పెంచడానికీ, వారు పార్టీ జీవితం, పనిలో సమర్ధవంతంగా పాల్గొనేవిధంగా వారి సాధారణ విద్యను పెంపొందించడానికీ నిరంతర కృషి జరగాలి.

(ఇ) పార్టీ కమిటీలో తీవ్రమైన భేదాభిప్రాయాలు తలెత్తినప్పుడు అంగీకారానికి రావడానికి తీవ్రమైన కృషి జరగాలి. అందులో విఫలమైతే, పార్టీకీ, ప్రజా ఉద్యమానికి తక్షణం నిర్ణయం తీసుకోవాలసిన అవసరం వస్తే మినహా ఆ విభేదాలను మరింత చర్చద్వారా పరిష్కరించుకునేందుకు వాయిదా వేయాలి.

(ఉ) అన్ని స్థాయిల్లో పై నుండి క్రింది వరకు ముఖ్యంగా క్రింది నుండి విమర్శ, ఆత్మ - విమర్శను ప్రోత్సహించాలి. "పార్టీలోని వివిధ స్థాయిల్లో విమర్శ, ఆత్మ - విమర్శను ప్రోత్సహిస్తున్నారా అన్న ప్రశ్నకు అత్యధిక రాష్ట్రాలు చెప్పిన సమాధానం ఏమంటే, కమిటీల్లో విమర్శ జరుగుతోంది కానీ ఆత్మ-విమర్శ మాత్రం నిజమైన పద్ధతిలో జరగకుండా పైపైన జరుగుతోంది అని చెప్పాయి" అని కొల్‌కొతా ప్లీనం పేర్కొన్నది.

(ఊ) అన్ని స్థాయిల్లో బ్యూరాక్రాటిక్ ధోరణులకు వ్యతిరేకంగా నిరంతరాయమైన పోరాటం జరగాలి.

(ఎ) పార్టీలోపల ముఠాతత్వం, ముఠాలు కట్టడాన్ని ఏ రూపంలోనూ అనుమతించ కూడదు.

(ఏ) సౌహార్ద్ర సంబంధాలు, పరస్పర సహకారం, కామ్రేడ్స్‌ను సానుభూతితో చూడ్డం ద్వారా తప్పులను సరిచేయడం, వేరువేరుగా జరిగిన పొరపాట్లు

లేక సంఘటనల ద్వారా కాకుండా పార్టీకి వారు చేసిన మొత్తం సేవల రికార్డును దృష్టిలో పెట్టుకుని వారినీ, వారి పనినీ అంచనా వేయడం ద్వారా పార్టీ స్ఫూర్తిని పెంపొందించాలి.

ఈ షరతులను నెరవేర్చడంలో విఫలమైతే కార్మికవర్గ పార్టీ నిజమైన పార్టీగా ఉండబోదు, తన వర్గానికి మార్గదర్శకత్వం వహించే కర్తవ్యాన్ని నెరవేర్చలేదు.

## అఖిల భారత పార్టీ మహాసభ

అఖిల భారత పార్టీ మహాసభ ప్రాముఖ్యత, దాని పనులు, అధికారాల గురించి 14వ అధికరణం వివరిస్తుంది. రెగ్యులర్ పార్టీ మహాసభను కేంద్ర కమిటీ సాధారణంగా మూడేళ్ల కొకసారి నిర్వహిస్తుంది. కానీ కేంద్ర కమిటీ తన స్వంత విచక్షణతోగానీ, లేదా మొత్తం పార్టీ సభ్యత్వంలో మూడింట ఒక వంతుకన్నా తక్కువ కాకుండా ఉన్న రెండు లేక అంతకన్నా ఎక్కువ రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేసినప్పుడు గానీ కేంద్ర కమిటీ అసాధారణ పార్టీ మహాసభ నిర్వహించవచ్చు. పార్టీ మహాసభ లేక అసాధారణ పార్టీ మహాసభ తేదీ, స్థలాన్ని కేంద్ర కమిటీ నిర్ణయిస్తుంది. రెగ్యులర్ పార్టీ మహాసభకు డెలిగేట్లుగా రాష్ట్ర పార్టీ మహాసభల నుండి, అఖిల భారత పార్టీ కేంద్రం క్రింద నేరుగా పనిచేసే శాఖల మహాసభ నుండి ఎన్నుకోబడినవారు ఉంటారు. రెగ్యులర్ పార్టీ మహాసభల ప్రతినిధుల ప్రాతిపదికనూ, అసాధారణ పార్టీ మహాసభల ప్రతినిధుల ప్రాతిపదికనూ, ప్రతినిధుల ఎన్నిక పద్ధతినీ కేంద్ర కమిటీ నిర్ణయిస్తుంది. ఆయా రాష్ట్రాల్లో మొత్తం పార్టీ సభ్యుత్వం, పార్టీ ఉద్యమాల బలం ఆధారంగా కేంద్ర కమిటీ ఈ నిర్ణయం తీసుకుంటుంది. కేంద్ర కమిటీ సభ్యులకు పార్టీ మహాసభలో – రెగ్యులర్ మహాసభ అయినా, అసాధారణ మహాసభ అయినా, పూర్తి స్థాయి ప్రతినిధులుగా పాల్గొనే హక్కు ఉంటుంది.

రెగ్యులర్ పార్టీ మహాసభ విధులు, అధికారాలు ఈ క్రింది విధంగా ఉంటాయి:

(అ) కేంద్ర కమిటీ సమర్పించిన రాజకీయ, నిర్మాణ నివేదికపై చర్చించి, చర్యలు తీసుకోవడం.

(ఆ) పార్టీ కార్యక్రమం, పార్టీ నిబంధనావళిని తాజా పరచడం, మార్చడం

(ఇ) ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ విధానాన్ని నిర్ణయించడం.

(ఈ) రహస్య బాలెట్ ద్వారా కేంద్ర కమిటీని ఎన్నుకోవడం.

పార్టీ మహాసభ ఒక అర్హతల కమిటీని ఎన్నుకుంటుంది. అది ప్రతినిధులందరి

అర్హతలను పరిశీలించి మహాసభకు నివేదికను సమర్పిస్తుంది. మహాసభ నిర్వహణ కోసం అది ఒక అధ్యక్ష వర్గాన్ని కూడా ఎన్నుకుంటుంది.

## కేంద్ర కమిటీ

రెండు అఖిల భారత పార్టీ మహాసభల మధ్య కేంద్ర కమిటీయే అత్యున్నత అధికార సంస్థ అని 15వ అధికరణం చెబుతోంది. పార్టీ నిబంధనావళిని అమలు చేయడం, పార్టీ మహాసభ నిర్ణయించిన రాజకీయ పంథానూ, నిర్ణయాలనూ అమలులో పెట్టడం దీని బాధ్యత. ఇది మొత్తం పార్టీకి ప్రతినిధి, పార్టీ పని మొత్తానికి దిశానిర్దేశం చేసే పనికి బాధ్యత వహిస్తుంది. పార్టీ ఎదుర్కొనే ఏ సమస్యపైన అయినా పూర్తి అధికారంతో నిర్ణయాలు చేసే హక్కు కేంద్ర కమిటీకి ఉంటుంది. కేంద్ర కమిటీ రాజకీయ, నిర్మాణ సమస్యలనూ, ప్రజాఉద్యమాలు ఎదుర్కొంటున్న సమస్యలనూ చర్చించి నిర్ణయాలు చేస్తుంది. రాష్ట్ర కమిటీలకూ, అఖిల భారత పార్టీ ఫ్రాక్షన్లకూ మార్గనిర్దేశం చేయాలి. పార్టీ ఆర్థిక విషయాలకు ఇది బాధ్యత వహించాలి. పొలిట్ బ్యూరో ఏడాదికొకసారి తనకు సమర్పించిన ఎకౌంట్స్‌ను ఆమోదించాలి. పార్టీ మహాసభకు రాజకీయ, నిర్మాణ నివేదికను కేంద్ర కమిటీ సమర్పించాలి. ప్రతిసారీ కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో నిర్దేశించిన ప్రత్యేక ఆదేశాలతో రాష్ట్ర, జిల్లా సంస్థలకు కేంద్ర కమిటీ ప్రతినిధులనూ, ఆర్గనైజర్లనూ పంపవచ్చు. కేంద్ర కమిటీ విస్తృత సమావేశాన్ని, ప్లీనంనూ లేదా మహాసభను నిర్వహించే అధికారం కేంద్ర కమిటీకి ఉంటుంది. హాజరుకు సంబంధించిన ప్రాతిపదికనూ, ప్రతినిధుల ఎన్నిక పద్ధతినీ అది నిర్ణయించాలి.

కేంద్ర కమిటీ తన సభ్యుల నుండి ప్రధాన కార్యదర్శితో సహా పొలిట్ బ్యూరోను ఎన్నుకుంటుంది. పొలిట్ బ్యూరోలో సభ్యుల సంఖ్యను కేంద్ర కమిటీ నిర్ణయిస్తుంది. రెండు కేంద్ర కమిటీ సమావేశాల మధ్య పనిని పొలిట్ బ్యూరో నిర్వహిస్తుంది. రెండు కేంద్ర కమిటీ సమావేశాల మధ్య రాజకీయ, నిర్మాణ నిర్ణయాలను తీసుకునే హక్కు పొలిట్ బ్యూరోకు ఉంటుంది.

కేంద్ర కమిటీ తన సభ్యుల నుండి కార్యదర్శివర్గాన్ని ఎన్నుకోవాలి. ఇందులో ఎంతమంది సభ్యులుండాలన్న దాన్ని కేంద్ర కమిటీ నిర్ణయించాలి. కార్యదర్శివర్గం.. పొలిట్ బ్యూరో మార్గదర్శకత్వంలో పార్టీ కేంద్రంలోని రోజవారీ పనిని చూస్తుంది, కేంద్ర కమిటీ నిర్ణయాల అమలులో పొలిట్ బ్యూరోకు సహకరిస్తుంది.

కేంద్ర కమిటీని పార్టీ మహాసభ ఎన్నుకుంటుంది. పాత కేంద్ర కమిటీ పార్టీ మహా సభలో ప్రతినిధుల ప్యానల్‌ను ప్రతిపాదించాలి. మహాసభలో ఏ ప్రతినిధి అయినా

ప్రతిపాదిత పేర్లలో ఏ పేరునైనా వ్యతిరేకించవచ్చు, అలాగే ఏ కొత్త పేరునైనా, పేర్లనైనా ప్రతిపాదించవచ్చు. కొత్త పేరును ప్రతిపాదించినప్పుడు ప్రతిపాదిత సభ్యుని ముందస్తు అంగీకారం తప్పని సరి. ప్రతిపాదించబడిన వారిలో ఎవరికైనా ఉపసంహరించుకునే హక్కు ఉంటుంది. ప్రతిపాదిత ప్యానల్, దాంతోపాటు అదనంగా వచ్చిన నామినేషన్లతో కలిపి రహస్య బ్యాలెట్ ద్వారా, ఒకే పంపిణీ ఓటింగ్ పద్ధతి ద్వారా ఓటింగ్‌కు పెట్టాలి. అదనపు నామినేషన్లు లేకపోతే చేతులు ఎత్తడం ద్వారా ప్రతినిధుల ఆమోదాన్ని తీసుకోవాలి.

రాష్ట్ర కమిటీల కార్యదర్శులు, రాష్ట్ర పార్టీ పత్రికల ఎడిటర్ల ఎంపికకు కేంద్ర కమిటీ ఆమోదం తీసుకోవాలి.

నిబంధనావళిలోని 15వ అధికరణం ఎమర్జెన్సీ సమయాల్లో కేంద్ర కమిటీలకు ప్రత్యేక హక్కులు కల్పిస్తోంది. కేంద్ర కమిటీలోని ఏ సభ్యుడైనా, లేక సభ్యులైనా అరెస్టు కాబడితే ఇతర సభ్యుడిని లేక సభ్యులను ప్రత్యామ్నాయ సభ్యులుగా కో – ఆప్ట్ చేసుకోవచ్చు. వారికి అసలు సభ్యులకున్న హక్కులుంటాయి. అరెస్టు కాబడిన సభ్యులు విడుదలై తమ విధులను చేపడితే వీరు తమ స్థానాలను ఖాళీ చేయాల్సి ఉంటుంది. ఎమర్జెన్సీ, లేక పెద్ద ఎత్తున అరెస్టులు జరుగుతున్నప్పుడు కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీలను చిన్న ఒద్దికగల గ్రూపులుగా పునర్నిర్మాణం చేస్తారు. ఇటువంటి పునర్వ్యవస్థీకృత కేంద్ర కమిటీలో ఉండే వారి పేర్ల జాబితాను పొలిట్ బ్యూరోలో మిగిలి ఉన్న సభ్యులు తయారు చేస్తారు. దాన్ని లోపలా బయటా ఉన్న కేంద్ర కమిటీ సభ్యులు ఆమోదించాల్సి ఉంటుంది. రాష్ట్ర, జిల్లా పునర్వ్యవస్థీకరణ కమిటీలకు పేర్ల జాబితాను ఆయా కమిటీల్లో మిగిలి ఉన్న సభ్యులు రూపొందించాలి, దాన్ని తదుపరి పైకమిటీ ఆమోదించాలి. తమ పనిచేయడానికీ, బాధ్యతలు నిర్వహించడానికీ అవసరమైతే వాళ్లు సబ్ – కమిటీలను కూడా ఏర్పాటు చేయవచ్చును. పునర్వ్యవస్థీకరించబడిన పార్టీ నిర్మాణాన్ని కాపాడుకునేందుకుగాను పునర్వ్యవస్థీకరించబడిన కేంద్ర కమిటీకి కొత్త నిబంధనలు రూపొందించే అధికారాలుంటాయి. పరిస్థితి తిరిగి సాధారణ స్థితికి వస్తే ఎన్నికైన కమిటీలను పునరుద్ధరిస్తారు.

క్రమశిక్షణా రాహిత్యం, తప్పుడు ప్రవర్తన, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు గాను తన సభ్యుడు ఎవరినైనా తొలగించే అధికారం కేంద్ర కమిటీకి ఉంది. కేంద్ర కమిటీలోని మూడొంతుల మంది హాజరై ఓటింగు జరపాలి, ఏ విధంగా నైనా కేంద్ర కమిటీలోని మొత్తం సభ్యుల్లో సగానికన్నా ఎక్కువ మంది అటువంటి సభ్యుని తొలగింపుకు అనుకూలంగా ఓటు వేయాల్సి ఉంటుంది.

కేంద్ర కమిటీలో ఏర్పడిన ఖాళీని కమిటీ మొత్తం సభ్యుల్లో సాధారణ మెజారిటీతో పూరించవచ్చు.

## రాష్ట్రాలు, జిల్లా పార్టీ సంస్థలు

రాష్ట్ర, జిల్లా పార్టీ సంస్థల పరిధి, నిర్మాణం గురించి నిబంధనావళిలోని 16వ అధికరణం వివరిస్తుంది. రాష్ట్ర, లేక జిల్లాలో అత్యున్నత సంస్థ రాష్ట్ర లేక జిల్లా మహాసభ. ఇది రాష్ట్ర లేక జిల్లా కమిటీని ఎన్నుకుంటుంది. రాష్ట్ర, జిల్లా పార్టీ సంస్థల నిర్మాణం, హక్కులు, పనులు అఖిల భారత స్థాయిలో మాదిరిగానే ఉంటాయి. వాటి పనులు రాష్ట్ర, జిల్లా సమస్యలకు పరిమితమై ఉంటాయి. వాటి నిర్ణయాలు వాటి తక్షణ పైకమిటీలు తీసుకునే నిర్ణయాల పరిధికి లోబడి ఉంటాయి. పార్టీ కమిటీల సంఖ్యను పెంచాల్సి వస్తే ఆయా కమిటీల తక్షణ పైకమిటీల అనుమతితోనే చేయాల్సి ఉంటుంది.

రాష్ట్ర లేక జిల్లాకమిటీ కార్యదర్శితో సహా కార్యదర్శి వర్గాన్ని ఎన్నుకోవచ్చు. కానీ తక్షణ పైకమిటీ అనుమతించకపోతే రాష్ట్ర లేక జిల్లా కమిటీకి కార్యదర్శివర్గం ఉండకపోవచ్చు.

రాష్ట్ర లేక జిల్లా కమిటీ తన సభ్యుడు ఎవరినైనా క్రమశిక్షణ ఉల్లంఘన, తప్పుడు ప్రవర్తన లేక పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు గాను రాష్ట్ర లేక జిల్లా కమిటీలోని మొత్తం సభ్యుల్లో మెజారిటీ నిర్ణయంతో తొలగించవచ్చు.

రాష్ట్ర కమిటీ ఉద్యమ అవసరాలను పరిగణలోకి తీసుకుని జిల్లా కమిటీ ప్రాంతాన్ని నిర్ణయించాలి. అది పరిపాలనా జిల్లా పరిధిలోనే ఉండాలని లేదు. ప్రాథమిక యూనిట్ (శాఖ)కూ జిల్లా లేక ప్రాంతానికి మధ్య పార్టీ సంస్థలను నెలకొల్పి వాటి నిర్మాణం, విధులకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేసే అధికారం రాష్ట్ర కమిటీకి ఉంటుంది. దీన్ని కేంద్ర కమిటీ నిర్దేశించిన నిబంధనల ప్రకారం చేయాలి.

## కార్యదర్శులకు మూడేళ్ల టెర్మ్

కొత్త నాయకత్వాన్ని అభివృద్ధి చేసేందుకూ, సమిష్టి నాయకత్వాన్ని బలపరిచేందుకూ కేంద్ర కమిటీ కార్యదర్శి నుండి స్థానిక కమిటీల కార్యదర్శుల వరకూ కార్యదర్శి పదవీ కాలాన్ని మూడు టెర్మ్‌లకు పరిమితం చేస్తూ పార్టీ నిబంధనావళిలోని 15, 16 అధికరణాలకు 20వ మహాసభ సవరణలు చేసింది. ప్రత్యేక పరిస్థితిలో మూడు టెర్మ్‌లు పూర్తి చేసిన ప్రధాన కార్యదర్శిని నాలుగో సారికి కూడా కొనసాగించ వచ్చు, అయితే దీనికి కేంద్ర కమిటీలో నాలుగింట మూడొంతుల మెజారిటీ ఆమోదం ఉండాలని ఈ సవరణ పేర్కొన్నది. కానీ నాలుగో టెర్మ్ అయిపోయిన తరువాత ఆ వ్యక్తి ఎట్టి పరిస్థితుల్లోనూ మరో టెర్మ్‌కు ఎన్నికవకూడదు. రాష్ట్ర/జిల్లా/మధ్యంతర కమిటీల విషయంలో కూడా ఇటువంటి నిబంధనే విధించడం జరిగింది. ప్రత్యేక

పరిస్థితిలో కార్యదర్శిగా మూడు టెర్మ్‌లు పూర్తి చేసిన వ్యక్తి నాలుగో టెర్మ్‌కు తిరిగి ఎన్నికవవచ్చు. అయితే ఆయా కమిటీ నాలుగింట మూడొంతుల మెజారిటీతో నిర్ణయం తీసుకోవాలి. జిల్లా, మధ్యంతర కమిటీల కార్యదర్శుల విషయంలో రాష్ట్ర కమిటీ ఆమోదం అవసరం. రాష్ట్ర కార్యదర్శి విషయంలో కేంద్ర కమిటీ ఆమోదించాల్సి ఉంది. కాని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ వ్యక్తి నాలుగు టెర్మ్‌లకు మించి మరో టెర్మ్‌కు ఎన్నిక కావడానికి వీల్లేదు.

## పార్టీ శాఖ

ప్రాథమిక శాఖ విధులు, బాధ్యతలను నిబంధనావళిలోని 18వ అధికరణం నిర్వచిస్తోంది. పార్టీ ప్రాథమిక యూనిట్ అనేది వృత్తి లేక ప్రాంత ప్రాతిపదికగా నిర్మించబడిన పార్టీ శాఖ. ఒక ఫాక్టరీ, సంస్థ లేక పరిశ్రమలో పనిచేసే పార్టీ సభ్యులు వారి వృత్తి, లేక పని ఆధారంగా నిర్మాణం చేయబడతారు. అటువంటి శాఖలను నిర్మాణం చేసేటప్పుడు ఆ శాఖల్లోని సభ్యులు వారు నివసించే ప్రాంతంలో అసోసియేట్ సభ్యులుగా ఉంటారు లేక అక్కడ సహాయ కణాలుగా నిర్మించబడతారు. నివాస ప్రాంతాల్లో వారికి కేటాయించే పని వారు పనిచేసే ఫాక్టరీ, సంస్థ లేక వృత్తుల్లోని ప్రాథమిక శాఖల్లో పనికి ఆటంకంగా ఉండకూడదు.

ఒక శాఖలో సభ్యుల సంఖ్య 15కు మించరాదు. శాఖలకు సంబంధించిన పని, ఇతర విషయాలను పార్టీ  రాష్ట్ర కమిటీలు నిర్ణయిస్తాయి.

పార్టీ శాఖ అనేది దాని ప్రాంతం లేక పరిధిలోని కార్మికులు, రైతాంగం, ఇతర ప్రజాబాహుళ్యానికీ దానికి నాయకత్వం వహించే పార్టీ కమిటీకీ మధ్య సజీవ లింకు. పార్టీ శాఖల విధులు:

(1) పార్టీ ఆదేశాలను అమలుచేయడం.

(2) ఫ్యాక్టరీ లేక ప్రాంతంలోని ప్రజాబాహుళ్యపు అభిప్రాయాన్ని పార్టీ రాజకీయ, నిర్మాణ నిర్ణయాలకు అనుగుణంగా మలచడం.

(3) సానుభూతి పరులనూ, చురుకుగా  పనిచేసేవారినీ కార్యకలాపాల్లోకి తీసుకువచ్చి కొత్త సభ్యులను చేర్చడం, వారిని రాజకీయంగా తర్ఫీదు చేయడం.

(4) నిర్మాణ, ఆందోళనా కృషిలో జిల్లా, స్థానిక లేక టౌన్ కమిటీలకు సహకరించడం.

ప్రస్తుత పనిని అమలు చేసేందుకు గాను పార్టీ శాఖ ఒక కార్యదర్శిని ఎన్నుకోవాలి. దాన్ని తదుపరి పైకమిటీ నిర్ధారించాలి.

20వ మహాసభ ఈ క్రింది ఆదేశాలు ఇచ్చింది :

"1) శాఖలు ఏడాదికి కనీసం 12 సమావేశాలు జరపాలి.

2) పార్టీ సభ్యత్వం సందర్భంగా శాఖలపై పైకమిటీ వార్షిక సమీక్షలు జరపాలి.

3) జిల్లా కమిటీలు క్రమానుగతంగా శాఖా కార్యదర్శుల సమావేశాలు నిర్వహించాలి. శాఖా కార్యదర్శులు రాజకీయంగా, నిర్మాణపరంగా తమ బాధ్యతలు నిర్వహించే సామర్థ్యాలను పెంచడం కోసం జిల్లా కమిటీలు వారి శిక్షణకు నిర్ధిష్ట ప్రణాళికలు రూపొందించాలి."

20వ మహాసభ ఇచ్చిన ఆదేశాలు ఇప్పటికీ చెల్లుబాటు అవుతాయి కనుక వాటిని నిక్కచ్చిగా అమలు చేయాలి.

## కేంద్ర, రాష్ట్ర కంట్రోల్ కమిషన్

కేంద్ర, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ నిర్మాణం, అధికారాలను గురించి నిబంధనావళిలోని 18వ అధికరణం వివరిస్తోంది. పార్టీ మహాసభ అయిదుగురు సభ్యులకు మించకుండా ఒక కేంద్ర కంట్రోల్ కమిషన్‌ను నేరుగా ఎన్నుకుంటుంది. కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్‌పెర్సన్‌గా కేంద్ర కమిటీ ఎక్స్ - అఫిషియో సభ్యుడు ఉంటారు.

కేంద్ర కంట్రోల్ కమిషన్ ఈ క్రింది కేసులు చేపడుతుంది: (అ) కేంద్ర కమిటీ లేక పొలిట్ బ్యూరో దానికి నివేదించిన క్రమశిక్షణా చర్యల కేసులు. (ఆ) రాష్ట్ర కమిటీ తీసుకున్న నిర్ణయంపై అపీళ్ల కేసులు (ఇ) పూర్తి పార్టీ సభ్యత్వం నుండి బహిష్కరణ, సస్పెన్షన్. పార్టీ సభ్యత్వం నుండి తొలగించిన సభ్యుడు రాష్ట్ర కమిటీ లేక రాష్ట్ర కంట్రోల్ కమిషన్‌కు అప్పీలు చేసుకుంటే ఆ అప్పీలును తిరస్కరించినప్పుడు.

కేంద్ర కంట్రోల్ కమిషన్ నిర్ణయం తుది నిర్ణయం, దానికి కట్టుబడి ఉండాల్సిందే. అసాధారణ కేసుల్లో కేంద్ర కమిటీ కేంద్ర కంట్రోల్ కమిటీ నిర్ణయాలను నిలుపుదల చేయవచ్చు, మార్చవచ్చు లేక నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవచ్చు. అయితే అటువంటి నిర్ణయాన్ని హాజరై ఓటువేసిన కేంద్ర కమిటీ సభ్యుల్లో మూడింట రెండు వంతులకు తగ్గకుండా సభ్యులు మద్దతు తెలపాలి. అటువంటి నిర్ణయాలన్నిటినీ తదుపరి జరిగే పార్టీ మహాసభకు రిపోర్టు చేయాలి.

కేంద్ర కంట్రోల్ కమిషన్‌లో ఖాళీ ఏర్పడితే దాన్ని భర్తీ చేసే అధికారం కేంద్ర కమిటీకి ఉంది.

రాష్ట్ర కమిటీ క్రమశిక్షణా చర్యలను చూసేందుకు ఒక రాష్ట్ర కంట్రోల్ కమిషన్‌ను ఎన్నుకోవచ్చు. రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఏర్పాటు చేయబడిన ఏ రాష్ట్రంలోనైనా

దాని విధులు, ఆధికారం కేంద్ర కంట్రోల్ కమిషన్ మాదిరిగానే ఉంటాయి, కానీ రాష్ట్రం లోపలకే పరిమితమై ఉంటాయి.

## పార్టీ క్రమశిక్షణ

మన పార్టీకి విశాల ప్రజాబాహుళ్య లక్షణం ఉంది కనుక అది క్రమశిక్షణను పాటించడం, పనిలోనూ, ప్రమాణాల్లోనూ ఆదర్శ ప్రాయంగా ఉండడం అత్యంత కీలకమైన అవసరం. పార్టీ నిబంధనావళినీ, నిర్ణయాలనూ ఉల్లంఘించేవారిపైనా, కమ్యూనిస్టు పార్టీ సభ్యునికుండాల్సిన ప్రవర్తనకు భిన్నమైన పనులకు పాల్పడిన వారిపైనా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పార్టీ నిబంధనావళిలోని 19వ అధికరణం చెబుతోంది. వ్యక్తిగత పార్టీ సభ్యునికి వర్తించే క్రమశిక్షణా చర్యలు: (అ) హెచ్చరిక (ఆ) అభిశంసన (ఇ) బహిరంగ అభిశంసన (ఈ) పార్టీలో పదవి నుండి తొలగింపు (ఉ) ఒక ఏడాదికి మించకుండా ఎంత కాలమైనా పార్టీ పూర్తి సభ్యత్వం నుండి సస్పెన్షన్ (ఊ) బహిష్కరణ.

ఆ కామ్రేడ్‌ను సరిచేయడానికి ఒప్పించే పద్ధతులతో సహా ఇతర అన్ని పద్ధతులూ విఫలమైన తరువాతనే సాధారణంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి. కానీ క్రమశిక్షణా చర్యలు తీసుకున్న తరువాత కూడా ఆ కామ్రేడ్‌కు సహకరించే కృషిని కొనసాధించాలి. క్రమశిక్షణ ఉల్లంఘన తీవ్రస్థాయిలో ఉండి పార్టీ ప్రయోజనాలు, ప్రతిష్టను కాపాడ్డం కోసం తక్షణ క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సి వస్తే వెంటనే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి. పార్టీ నుండి బహిష్కరించడమే అది తీసుకోదగ్గ అత్యంత తీవ్రమైన క్రమశిక్షణా చర్య. పార్టీ అంతకు మించి ఏమీ చేయలేదు.

పార్టీ పదవి నుండి తొలగించడం, ఎంక్వయిరీ పెండింగ్‌లో ఉంచి సస్పెండ్ చేయడం కాకుండా పూర్తి పార్టీ సభ్యత్వం నుండి సస్పెండ్ చేయడం, పార్టీ నుండి బహిష్కరించడం వంటి క్రమశిక్షణా చర్యలను తదుపరి పైకమిటీ నిర్ధారణ లేకుండా అమల్లోకి తీసుకురాకూడదు. బహిష్కరణ సందర్భంలో ఆ సభ్యుణ్ణి నిర్ధారణ వచ్చే వరకు అన్ని పార్టీ కార్యకలాపాల నుండి తొలగించాలి. బహిష్కరించబడిన సభ్యుడు తదుపరి పైకమిటీ నిర్ధారించేవరకు పార్టీ నుండి బహిష్కృతుడుగానే ఉంటాడు. పైకమిటీ ఆరుమాసాల్లోగా తన నిర్ణయాన్ని తెలియజేయాలి.

ఒక సభ్యుడు రెండు పార్టీ సంస్థల్లో ఒకేసారి సభ్యుడుగా ఉంటే కింది కమిటీ అనిపై క్రమశిక్షణా చర్యలను సిఫార్సు చేయవచ్చు కానీ పైకమిటీ ఆమోదించిన తరువాతనే అది అమల్లోకి వస్తుంది.

ఏ కామ్రేడ్‌కు వ్యతిరేకంగానైతే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారో ఆ కామ్రేడ్‌కు అతనిపై వచ్చిన ఆరోపణలు, దానికి సంబంధించిన ఇతర వాస్తవాలను

పూర్తిగా తెలియజేయాలి. సభ్యునికి తను ఉన్న పార్టీ శాఖలో వ్యక్తిగతంగా తన వాదన వినిపించే హక్కు ఉంటుంది. తనపై చర్య తీసుకునే ఏ ఇతర శాఖకైనా తన వివరణను సమర్పించుకునే హక్కు సభ్యునికి ఉంటుంది.

సమ్మె విచ్ఛిన్నకులు, తాగుబోతులు, నైతికంగా దిగజారిపోయినవారు, పార్టీ నమ్మకానికి ద్రోహం చేసినవారు, తీవ్రమైన ఆర్థిక అవినీతికి పాల్పడిన పార్టీ సభ్యులను అతను/ఆమె ఉన్న పార్టీ శాఖ లేక పార్టీ పైస్థాయి సంస్థ చార్జిషీటు జారీచేయడం, వివరణ కోరడం వంటి వాటిని పెండింగులో ఉంచి, ఏకంగా పార్టీ సభ్యత్వం నుండి సస్పెండ్ చేయవచ్చు, అన్ని పార్టీ పదవుల నుండి తొలగించవచ్చు. కానీ ఏకంగా పార్టీ నుండి సస్పెండ్ చేయడం, పార్టీలోని అన్ని బాధ్యతల నుండి తొలగించడం మూడు మాసాలకు మించి ఉండకూడదు. అసాధారణ పరిస్థితుల్లో పార్టీ కమిటీలు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే సభ్యులను బహిష్కరించేందుకు తమ విచక్షణాధికారాలతో నేరుగా చర్య తీసుకోవచ్చు. గూఢచారిగా పనిచేయడం, శత్రువు ఏజెంటుగా ఉండడం, లేక సభ్యుని కార్యకలాపాలు పార్టీకి తీవ్రహాని కలిగించేవిగా ఉండడం వంటి అతి తీవ్రమైన సందర్భాల్లో మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుందని నిబంధనావళిలోని నియమాలు చెబుతున్నాయి.

పార్టీ నిర్ణయాలు, విధానాలను నిరంతరాయంగా ధిక్కరించే, తీవ్రమైన ముఠాతత్వం ప్రబలే, లేక పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే కింది కమిటీని రద్దు చేసి కొత్త కమిటీని నియమించే లేక దానిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారం కేంద్ర, రాష్ట్ర, జిల్లా కమిటీలకు ఉంది. కానీ రాష్ట్ర, జిల్లా కమిటీలు అటువంటి చర్యను తదుపరి పైకమిటీకి నివేదించాలి. పైకమిటీ అవసరమైన చర్యలు తీసుకుంటుంది.

క్రమశిక్షణా చర్యలకు సంబంధించిన అన్ని కేసుల్లోనూ అప్పీలు చేసుకునే హక్కు ఉంటుంది. ఒక సభ్యునిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్న పార్టీ విభాగం పార్టీ సభ్యునికి ఆ క్రమశిక్షణా చర్య గురించి నిర్ణయం తీసుకున్న తరువాత 30 రోజుల్లోగా లేక తదుపరి పైకమిటీ నిర్ధారించిన తరువాత 30 రోజుల్లోగా సభ్యునికి తెలియజేయాలి. క్రమశిక్షణా చర్య గురించి పార్టీ సభ్యునికి తెలియజేసిన ఆరుమాసాల్లోగా ఆయా పార్టీ సభ్యుడు క్రమశిక్షణా చర్యపై అప్పీలు చేసుకోవాలి.

## ప్రజాప్రాతినిధ్య సభల్లో ఎన్నికైన పార్టీ సభ్యులు

ప్రజాప్రాతినిధ్య సభలకు ఎన్నికైన పార్టీ సభ్యుల బాధ్యతల గురించి నిబంధనావళిలోని 20వ అధికరణం వివరిస్తోంది.

పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ లేక పరిపాలనా మండలికి ఎన్నికైన పార్టీ

సభ్యులు పార్టీ గ్రూపుగా ఏర్పడి తగిన పార్టీ కమిటీ కింద పార్టీ వైఖరికీ, విధానాలకూ, ఆదేశాలకూ గట్టిగా కట్టుబడి పనిచేయాలి. కమ్యూనిస్టు చట్ట సభల సభ్యులందరూ ప్రజల ప్రయోజనాలు కాపాడ్డంలో తటపటాయింపులు లేకుండా పనిచేయాలి. చట్టసభల్లో వారి పని ఉద్యమాన్ని ప్రతిబింబించాలి. పార్టీ విధానాలను సమున్నతంగా నిలిపి వాటిని ప్రచారం చేయాలి. కమ్యూనిస్టు సభ్యుల చట్టసభల పని బయట పార్టీ కార్యకలాపాలతోనూ, ప్రజా ఉద్యమాలతోనూ సన్నిహితంగా అల్లుకుని ఉండాలి. పార్టీ నిర్మాణానికీ, ప్రజా సంఘాల నిర్మాణానికీ సహకరించడం కమ్యూనిస్టు చట్టసభల సభ్యులందరి విధి. వారు తమను ఎన్నుకున్న ఓటర్లతోనూ, ప్రజలతోనూ సాధ్యమైనంత సన్నిహిత సంబంధాలు నెరపాలి. వారు చేస్తున్న పనిని గురించి వారికి నిరంతరం తెలియజేస్తుండాలి. నిరంతరం వారి సూచనలు, సలహాలు తీసుకుంటుండాలి. కమ్యూనిస్టు చట్టసభల సభ్యులు వ్యక్తిగతంగా ఉన్నతమైన విలువలు కలిగి ఉండాలి, నిరాడంబరమైన జీవితం గడపాలి. వారు ప్రజలతో వ్యవహరించేటప్పుడు, వారికి పనులు చేసిపెట్టేటప్పుడు నమ్రత పాటించాలి. స్వంతం కన్నా పార్టీకి ఎల్లప్పుడూ అగ్రస్థానం ఇవ్వాలి.

వారు పొందుతున్న జీతాలు, అలవెన్సులను పార్టీ డబ్బుగా పరిగణించాలి. వారికి చెందిన పార్టీ కమిటీ సభ్యుల వేతనాలు, అలవెన్సులను నిర్ణయించాలి.

కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పురపాలక ఏరియా కమిటీలు, జిల్లా పరిషత్‌లు, బ్లాక్ సమితులు, గ్రామ పంచాయితీలు వంటి స్థానిక సంస్థలకు ఎన్నికైన పార్టీ సభ్యులు తగిన పార్టీ కమిటీ కింద పనిచేయాలి. వారు తమ పనిగురించిన నిరంతర నివేదికలను ఓటర్లకూ, ప్రజలకూ ఇవ్వాలి, వారి సూచనలు, సలహాలు తీసుకోవాలి. స్థానిక సంస్థల్లోని పనిని బయట ప్రజల్లో పనితో జత చేయాలి.

పార్లమెంటు, శాసన సభ లేక కౌన్సిల్ లేక కేంద్ర పాలిత ప్రాంతాల ఎన్నికలకు నామినేషన్ వేసే పార్టీ సభ్యులను కేంద్ర కమిటీ అమోదించాల్సి ఉంటుంది. కార్పొరేషన్లల, మున్సిపాలిటీలు వంటి వాటికి పార్టీ సభ్యులు నామినేషన్ వేసే నియమాలను రాష్ట్ర కమిటీలు రూపొందించాలి.

ప్రజా ప్రాతినిధ్య చట్టం నిబంధనల ప్రకారం నిబంధనావళిలోని 20ఎ అధికరణాన్ని రూపొందించడం జరిగింది.

## పార్టీ అంతర్గత చర్చలు

ఈ విషయాన్ని పార్టీ నిబంధనావళిలోని 21వ అధికరణం చర్చిస్తుంది. పార్టీని ఐక్యపరిచేందుకుగాను పార్టీ విధానంపై అవసరమైనప్పుడల్లా స్వేచ్ఛగా

బిజినెస్–లైక్‌గా చర్చలకు ఏర్పాట్లు చేసింది. కానీ పార్టీ ఐక్యతకూ, కార్యాచరణ స్ఫూర్తికీ భంగం కలిగించే నిరంతర చర్చలను అనుమతించకూడదు. ఈ క్రింది పరిస్థితుల్లో అఖిల భారత స్థాయిలో కేంద్ర కమిటీ పార్టీ అంతర్గత చర్చను ఏర్పాటు చేస్తుంది: (అ) కేంద్ర కమిటీ అవసరం అనుకున్నప్పుడు, (ఆ) పార్టీ విధానానికి సంబంధించిన ముఖ్యమైన సమస్యపై కేంద్ర కమిటీ బయట తగిన గట్టి మెజారిటీ లేనప్పుడు, (ఇ) మొత్తం పార్టీ సభ్యత్వంలో మూడింట ఒక వంతు పార్టీ సభ్యత్వానికి ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర కమిటీలు అఖిల భారత స్థాయిలో చర్చ జరగాలని డిమాండ్ చేసినప్పుడు.

## III

(పార్టీ, ప్రజా సంఘాల నిర్మాణ అనుభవాల క్రమాన్ని గురించి ఈ సెక్షన్ చెబుతుంది. ఉన్నత స్థాయి విద్యార్థులకు సాల్కియా, కొల్‌కొతా ప్లీనంలలో ఆమోదించిన తీర్మానాలలో ఉన్న ఆత్మ–విమర్శనా పూర్వక సమీక్షలను ఉపయోగించుకుని వివరించవచ్చు)

విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి సంబంధించిన మార్క్సిస్టు – లెనినిస్టు సూత్రాలపై ఆధారపడిన సిపిఐ(ఎం), 1964లో ఆమోదించిన తన పార్టీ కార్యక్రమంలోనూ, తరువాత 2000 సంవత్సరంలో తాజాపరిచిన కార్యక్రమంలోనూ మన దేశంలో ఇటువంటి కమ్యూనిస్టు పార్టీని నిర్మించాలని పిలుపునిచ్చింది:

“8.4 అన్ని రంగాల్లోనూ పోరాటాలు నిర్వహించి విప్లవోద్యమానికి మార్గనిర్దేశనం చేసే ప్రజాబాహుళ్య విప్లవ పార్టీని నిర్మించడం అవసరం. అటువంటి పార్టీ ప్రజా ఉద్యమాలను అభివృద్ధి చేయడం ద్వారా, దానికనుగుణంగా తన ప్రభావాన్ని రాజకీయంగానూ, సైద్ధాంతికంగానూ సమీకరించుకోవడం ద్వారా ప్రజల్లో తన పునాదిని నిరంతరాయంగా విస్తరించుకోవాలి. దీనికి కేంద్రీకృత ప్రజాస్వామ్యంపై ఆధారపడిన బలమైన, క్రమశిక్షణ గల పార్టీ అవసరం. కార్మికవర్గం పట్ల, అన్ని సెక్షన్ల శ్రామిక ప్రజల పట్ల తన చారిత్రాత్మక బాధ్యతను పార్టీ నిర్వహించాలంటే పార్టీ నిరంతరాయంగా తనను తాను ఎడ్యుకేట్ చేసుకోవాలి, మళ్లీమళ్లీ ఎడ్యుకేట్ చేసుకోవాలి. తన సైద్ధాంతిక స్థాయిని పెంచుకోవాలి. తన నిర్మాణబలాన్ని పటిష్ట పరుచుకోవాలి.”

పార్టీ ఏర్పడినప్పటి నుండీ బలమైన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి కృషి చేస్తోంది. ఈ సంవత్సరాల్లో పార్టీని నాశనం చేయడానికి పూనుకున్న శత్రువుల తీవ్రమైన దాడులను ఎదుర్కొన్నది. పార్టీ దుస్సాహస, రివిజనిస్టు ధోరణులను ఎదుర్కొన్నది. ఇవి ఉద్యమాన్ని బలహీనపరిచాయి. ఈ ప్రమాదాలను పార్టీ జయప్రదరంగా తిప్పికొట్టింది. కమ్యూనిస్టు పార్టీ పాలక వర్గాల నుండి నేరుగా దాడులను ఎదుర్కొనడమే కాదు పార్టీ నిర్మాణంలోకి వివిధ మార్గాల్లో చొచ్చుకు వచ్చే వాటి సైద్ధాంతిక ప్రభావాలను

తట్టుకోవాలి. పార్టీ అంతర్గతంగా ఈ అన్యవర్గ ధోరణులకు వ్యతిరేకంగా విరామం లేని పోరాటం చేసింది.

కాలానుగుణంగా అది తన పనిని సమీక్షించుకుని లోపాలనూ, బలహీనతలనూ సరిదిద్దు కుంది.

## పార్టీ నిర్మాణంపై మన కర్తవ్యం – 1967

1967 అక్టోబర్ 28 నుండి నవంబర్ 2 వరకు కాలికట్‌లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం "పార్టీ నిర్మాణంపై మన కర్తవ్యం" అనే పత్రాన్ని ఆమోదించింది. పార్టీలోపల అన్ని రకాల రివిజనిస్టు, సంస్కరణవాద అవగాహనలను, కార్యాచరణలను పారద్రోలి, పునస్సమీకృతం కావడం కోసం, పార్టీ సభ్యులు, కార్యకర్తల్లో చురుకుదనాన్ని పెంచడం కోసం, ప్రజా, రాజకీయ, నిర్మాణ రంగాల్లో వారు తమ కర్తవ్యాలు నిర్వహించే విధంగా వారిని ఎడ్యుకేట్ చేయడం కోసం ఈ పత్రాన్ని రూపొందించింది.

అది తక్షణం అమలు చేసేందుకు కర్తవ్యాలను సంగ్రహపరిచింది. అవి ఈ క్రింది విధంగా ఉన్నాయి:

"పార్టీ నిర్మాణంలో అన్ని రకాల సంస్కరణవాద, రివిజనిస్టు అవగాహనలను, కార్యాచరణలను వేళ్లతోసహా పెకిలించివేయడం.

"పార్టీ సభ్యులు, కార్యకర్తలను పునస్సమీకరించి, వారిలో చురుకుదనాన్ని పెంచడం, ప్రజా, రాజకీయ, నిర్మాణ రంగాల్లో వారు తమ కర్తవ్యాలు నిర్వహించే విధంగా వారిని ఎడ్యుకేట్ చేయడంతో ప్రారంభించాలి?

"1 (అ) – పార్టీ సభ్యులు – మిలిటెంట్ కార్యకర్తల నుండి సహాయ కణాల, క్యాండిడేట్ సభ్యుల రిక్రూట్‌మెంటును బలపరుచుకోవాలి. (క్యాండిడేట్ సభ్యత్వ కాలాన్ని ఒక ఏడాదికి పొడిగించాలి) – రెగ్యులర్ పార్టీ సభ్యత్వాన్ని కూడా గట్టి పరుచుకోవాలి (నివేదికలో ఉన్న కనీస కర్తవ్యాలపై నొక్కిచెప్పాలి). పార్టీ సభ్యులందరినీ 1967 డిసెంబర్ చివరి నాటికి 9 మందికి మించని చిన్న శాఖల్లో గ్రూపులు చేయాలి.

"(ఆ) – వ్యక్తిగత జీవితంలోనూ, ప్రజా సంఘాలు, పార్టీ జీవితంలోనూ అన్యవర్గ అలవాట్లు, కార్యాచరణలకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం చేయాలి. – సన్నితమైన, సులువైన జీవితానికి స్వస్తి చెప్పాలి – శరీరాన్ని, మనసును గట్టి పరుచుకోవాలి. గూండాలు, విప్లవ – ప్రతీఘాత దాడుల నుండి మిమ్మల్నీ, పార్టీని రక్షించుకోడానికి సిద్ధంగా ఉండాలి.

"2 – మీ కార్యకర్తలను గురించి తెలుసుకో – అన్ని పరిస్థితులు, ప్రభావాల్లో వారి బలమైన, బలహీనమైన పాయింట్లు – వయస్సు, ఎంత కాలంగా పార్టీలో ఉన్నారు – విద్య – వచ్చిన వర్గం, ప్రస్తుత వృత్తి ఉద్యోగం – జీవనం కోసం వచ్చే ఆదాయం – కుటుంబ సభ్యులు – వ్యక్తిగత జీవితంలో సమస్యలు.

"– వివిధ స్థాయిల్లో పూర్తికాలం పనిచేసే క్యాడర్‌ను ఎంపికచేయాలి. వారిని ఎడ్యుకేట్ చేయాలి, శిక్షణ ఇవ్వాలి. వారిని పారిశ్రామిక, విద్యా కేంద్రాల్లోనూ ఈ కేంద్రాలకు చుట్టుపక్కల నున్న రైతాంగంలోనూ మోహరించాలి.

"3 – మొత్తం పార్టీ సభ్యత్వాన్ని ఎడ్యుకేట్ చేయాలి. శాఖా కార్యదర్శులకూ, స్థానిక కార్యకర్తలకూ రాజకీయ పాఠశాలలు పెట్టడం ద్వారా శిక్షణ ఇవ్వాలి. ఈ పాఠశాలల్లో మార్క్సిజం–లెనినిజం ప్రాథమిక సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు గాను మార్క్సిస్టు ఆర్థిక శాస్త్రం, మార్క్సిస్టు రాజకీయ సిద్ధాంతం, భారతీయ పరిస్థితులకు వర్తించే చారిత్రక భౌతికవాదం, గతితార్కిక భౌతికవాదం, అంతర్జాతీయ కార్మికవర్గం, విప్లవోద్యమం, రష్యన్ విప్లవం, చైనా విప్లవం – మన పార్టీ కార్యక్రమం, పార్టీ చరిత్ర, భారత ప్రజల వర్గ పోరాట, విప్లవోద్యమ చరిత్ర – మన ప్రస్తుత సాధారణ రాజకీయ విధానం, కర్తవ్యాలు మొదలైన వాటిని పాఠ్యాంశాలుగా బోధించాలి. 1968 జూన్ చివరికి పార్టీ సభ్యులందరూ ముఖ్యంగా శాఖా కార్యదర్శులకు ఈ క్లాసులు నిర్వహించాలి.

"– కనీస మౌలిక రచనలు, భారత దేశంలోనూ, ప్రపంచంలోనూ ప్రస్తుత రాజకీయ పరిణామాలకు సబంధించిన బుక్‌లెట్స్‌ను తీసుకువచ్చి సభ్యులకు అందుబాటులో ఉంచాలి. వ్యక్తిగత, శాఖా లైబ్రరీల్లో వాటిని ఉంచి నిరంతరం అధ్యయనం చేయాలని పట్టుబట్టాలి.

"– మన ప్రజాసంఘాల మిలిటెంట్స్‌నూ, పార్టీ సభ్యులు, కార్యకర్తలనూ ఎడ్యుకేట్ చేయడం కోసం పార్టీ వారపత్రికలు, దినపత్రికలనూ ఒక కేంద్ర సైద్ధాంతిక పత్రికనూ ప్రచురించాలి.

"4– బలమైన ట్రేడ్ యూనియన్లనూ, గ్రామీణ పేదల (వ్యవసాయ కార్మికులు, కిసాన్ సభలు) సంస్థలను సరైన మార్క్సిస్టు–లెనినిస్టు పంథాలో నిర్మించాలి. కార్మికవర్గం, గ్రామీణ పేదల వర్గపోరాటాల నుండి సహాయ కణాల్లోకి రిక్రూట్ చేసుకోవడం, మిలిటెంట్లను ఎడ్యుకేట్ చేయడానికి ప్రత్యేక కృషి జరపడం ద్వారా పార్టీ సభ్యత్వ వర్గ పొందికను మార్చడానికి ప్రయత్నించాలి.

"– యువతపైన ముఖ్యంగా విద్యార్థులపైన ప్రత్యేక దృష్టి పెట్టాలి. 18–30 ఏళ్ల మధ్య యువకులు నిరంతరాయంగా పెరిగే విధంగా పార్టీ పొందికను మెరుగుపరచాలి.

"– ట్రేడ్ యూనియన్, కిసాన్, మధ్యతరగతి ఉద్యోగ సంఘాలకు అనుబంధంగా మహిళల్లో పనిచేసి వారిని పార్టీలోకి రిక్రూట్ చేసుకోవాలి.

"5 – పార్టీ నిర్మాణాన్ని క్రమపద్ధతిలో పెట్టాలి. – మిలిటెంట్లతో సహాయ కణాలు – పార్టీ సభ్యులు, క్యాండిడేట్లతో శాఖలు (ఫాక్టరీ, గ్రామం, వార్డు, టౌను), స్థానిక (థాణా లేక తహసిల్) లేక జిల్లా కమిటీలు ఇలా వరుసక్రమంలో రావాలి.

వీటిని పని సమన్వయం కోసం ఏర్పాటు చేయాలే మినహా ప్రభుత్వం సృష్టించిన పరిపాలనా యూనిట్లన్న కోణం నుండి ఏర్పాటు చేయకూడదు. ప్రస్తుతం మన ఉద్యమం ఉన్న ప్రాంతాలను బలపరుచుకుంటూనే ఈ ప్రాంతాలన్నిటినీ లింకు చేసి ఒకే పెద్ద ఉద్యమ ప్రాంతంగా మార్చే దిశగా మన కృషి సాగాలి.”

### నిర్మాణంపై సాల్కియా ప్లీనం 1979

మారిన జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్లీనం పార్టీ నిర్మాణ కర్తవ్యాలను రూపొందించింది.

సాల్కియా కర్తవ్యాల సారాన్ని ఈ క్రింది విధంగా చెప్పవచ్చు:

(1) బలహీన రాష్ట్రాల్లో పార్టీని అభివృద్ధి చేయడం ద్వారా, బలమైన, సమర్థవంతమైన అఖిలభారత కేంద్రాన్ని నిర్మించడం ద్వారా ప్రజాబాహుళ్య విప్లవ పార్టీని నిర్మించడం.

(2) అఖిల భారత ప్రజాసంఘాలను ప్రజాతంత్రయుతంగా పనిచేయించడం ద్వారా అభివృద్ధి చేయడం.

(3) పార్టీ నిర్మాణ పనిలో కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం.

(4) హిందీ ప్రాంతాల్లో పార్టీ అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేయడం.

(5) రాజకీయ క్యాంపెయిన్లను, సైద్ధాంతిక కృషిని పెద్ద ఎత్తున చేపట్టడం. (సాల్కియా ప్లీనం తరువాత నుండి)

### ప్రజా సంఘాలపై మార్గదర్శనం – (1981, 2004)

పార్టీకి ప్రజాసంఘాలకూ మధ్య సంబంధాలపై పార్టీ లోపల ఉన్న కొన్ని తప్పుడు ధోరణులపై రెండు పత్రాలలో పార్టీ వివరణ ఇచ్చింది. అవి: 1) ప్రజాసంఘాలపై –1981. 2) ప్రజాసంఘాలపై వైఖరి – 2004.

వివిధ పత్రాలను అధ్యయనం చేస్తే పార్టీ జీవితంలోని వివిధ సందర్భాల్లో నిర్మాణం మీద పార్టీ అవగాహన ఏ విధంగా పరిణామం చెందుతూ వచ్చిందో అర్థమవతుంది.

### కొల్‌కొతా ప్లీనం

కొల్‌కొతా ప్లీనంలో పార్టీ ప్రస్తుతం నిర్మాణ పరిస్థితిని తీవ్రంగా సమీక్షించి లోపాలు, బలహీనతలను గుర్తించి నిర్మాణపరమైన కర్తవ్యాలను రూపొందించింది.

## ప్రధాన దిశానిర్దేశం

"1.216 పార్టీ నిర్మాణ పరిస్థితిపై మొత్తం సమీక్షను పైన పేర్కొనడం జరిగింది. ఇది లోపాలు, పొరపాట్లను గుర్తించడానికి తోడ్పడింది. నిర్మాణపరంగా ఎక్కడ ప్రయోజనాలు పొందామో అవగాహన చేసుకుని ఆ అనుభవాలను సాధారణీ కరించడానికి ఇది మనకు సహాయపడింది. పార్టీ నిర్మాణాన్ని క్రమపద్ధతిలో పెట్టుకోవాలి. పార్టీ స్వతంత్ర బలాన్ని నిరంతరాయంగా పెంచుకునే విధంగా తీర్చిదిద్దుకోవాలి. వర్గ, ప్రజా పోరాటాల ద్వారా వామపక్ష ప్రజాతంత్ర సంఘటనను ఏర్పరచాలి. ఇది వర్గ బలాబలాల పొందికలో మార్పు తీసుకురావడానికి తోడ్పడుతుంది.

"1.217 దేశ వ్యాపితంగా ప్రజా పునాది ఉన్న కమ్యూనిస్టు పార్టీని నిర్మించే లక్ష్యాన్ని సాధించేందుకుగాను ప్లీనం ఈ క్రింది మార్గదర్శకాలనూ, కర్తవ్యాలనూ రూపొందించింది:

1. పార్టీ ప్రభావాన్ని విస్తృత పరిచేందుకూ, వామపక్ష ప్రజాతంత్ర శక్తులను సమీకరించేందుకూ ఆర్థిక, సామాజిక సమస్యలపై వర్గ, ప్రజా ఉద్యమాలను నిర్వహించాలి.
2. ప్రజాపంథాను అనుసరించి ప్రజలతో సజీవ సంబంధాలను ఏర్పాటు చేసుకోవాలి.
3. నాణ్యతగల సభ్యత్వంతో కూడిన విప్లవ పార్టీని నిర్మించడం కోసం నిర్మాణాన్ని క్రమపద్ధతిలో పెట్టుకోవాలి.
4. పార్టీలోకి యువతను ఆకర్షించేందుకు ప్రత్యేక కృషి చేయాలి.
5. మతతత్వం, నయా–ఉదారవాదం, అభివృద్ధి నిరోధక సిద్ధాంతాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం చేయాలి."

♦

# పార్టీ నిర్మాణంపై ప్రస్తుత కర్తవ్యాలు

**2022** ఏప్రిల్‌లో జరిగిన 23వ పార్టీ మహాసభ పార్టీ నిర్మాణంపై తక్షణ కర్తవ్యాలను రూపొందించింది.

దాని గురించి చర్చించే ముందు, మనం ఇప్పుడు పార్టీ నిర్మాణంపై ఏ సమస్యలనైతే చర్చిస్తున్నామో ఆ సమస్యలు 2015 డిసెంబర్‌లో నిర్మాణంపై జరిగిన కొల్‌కొతా ప్లీనం ఆమోదించిన 'నిర్మాణంపై నివేదిక, తీర్మానం' లో ఉన్నాయి. పార్టీ నిర్మాణ పరిస్థితిపై ఈ సమగ్ర సమీక్షలో పేర్కొన్న అంశాలే తరువాత 22వ, 23వ మహాసభల్లో నిర్మాణంపై రూపొందిచిన కర్తవ్యాలకు ఆధారంగా ఉన్నాయి.

కొల్‌కొతా ప్లీనం ఇచ్చిన ప్రధానమైన దిశానిర్దేశం ఈ క్రింది విధంగా ఉంది:

"1.216 పార్టీ నిర్మాణ పరిస్థితిపై పైన పేర్కొన్న సంపూర్ణ సమీక్ష మనకు లోపాలు, తప్పిదాలను గుర్తించడానికి తోడ్పడుతుంది. ఇది మనకు మనం నిర్మాణ పరంగా ఎక్కడ పెరిగామో కూడా తెలియజేస్తోంది. దాని అనుభవాలను సాధారణీ కరించడానికి తోడ్పడుతుంది. పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకునే దిశగా పార్టీ నిర్మాణాన్ని సరిచేసుకోవాలి. వర్గ, ప్రజా పోరాటాల ద్వారా వామపక్ష ప్రజాతంత్ర సంఘటనను నిర్మించాలి. ఇది వర్గ బలాబలాల పొందికలో మార్పు తెస్తుంది.

"1.217 దేశవ్యాపితంగా ప్రజాపునాది గల బలమైన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి గాను ప్లీనం ఈ క్రింది మార్గదర్శకాలనూ, కర్తవ్యాలనూ నిర్దేశించింది:

"1. పార్టీ ప్రభావాన్ని విస్తరించేందుకూ, వామపక్ష ప్రజాతంత్ర శక్తులను సమీకరించేందుకూ ఆర్థిక, సామాజిక సమస్యలపై వర్గ, ప్రజా పోరాటాలను నిర్మించాలి.

"2. ప్రజాపంథాను అనుసరించి ప్రజలతో సంబంధాలను ఏర్పరుచుకోవాలి.

"3. నాణ్యమైన సభ్యత్వం కలిగిన విప్లవ పార్టీని నిర్మించేందుకు గాను నిర్మాణాన్ని సరిచేసుకోవాలి.

"4. పార్టీలోకి యువతను ఆకర్షించేందుకు ప్రత్యేక కృషి చేయాలి.

"5. మతతత్వం, నయా-ఉదారవదం, అభివృద్ధి నిరోధక సిద్ధాంతాలపై సైద్ధాంతిక పోరాటం చేయాలి."

"ప్రజాపంథాతో కూడిన విప్లవ పార్టీ"ని నిర్మించాలని కొల్‌కొతా ప్లీనం పిలుపునిచ్చింది. ఈ నినాదానికీ, 1978 డిసెంబర్‌లో సాల్కియాలో జరిగిన ప్లీనం ఇచ్చిన పిలుపుకూ తేడా ఏమిటి? అప్పట్లో మన నినాదం "ప్రజా విప్లవ పార్టీ"ని నిర్మించాలని.

సాల్కియా ప్లీనం సమయంలో 1977 ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత సిపిఐ(ఎం), వామపక్ష శక్తుల విస్తరణకు సానుకూల రాజకీయ పరిస్థితి ఉండేది. ఒక అఖిల భారత శక్తిగా పార్టీని ఎంత త్వరగా విస్తరించాలన్న దానిపై నాడు పార్టీ ప్రధానంగా దృష్టి పెట్టింది. అందువల్ల బలహీన ప్రాంతాల్లో, నిర్దిష్టంగా హిందీ-మాట్లాడే ప్రాంతాల్లో పార్టీని అభివృద్ధి చేసే లక్ష్యంతో నాడు ప్రజా విప్లవ పార్టీ నిర్మాణానికి పిలుపు ఇవ్వడం జరిగింది. ఆ కాలంలో పశ్చిమ బెంగాల్, త్రిపురలోనూ తరువాత కేరళలలోనూ వామపక్షాల నాయకత్వంలో ప్రభుత్వాలు ఏర్పడ్డాయి.

2015లో కొల్‌కొతా ప్లీనం పూర్తిగా భిన్నమైన రాజకీయ పరిస్థితిలో జరిగింది. అంతర్జాతీయంగానూ, జాతీయంగానూ పెద్ద మార్పులు జరిగాయి. అంతర్జాతీయ స్థాయిలో సోవియట్ యూనియన్ పతనం, సోషలిజానికి ఎదురు దెబ్బలు తగలడంతో వర్గశక్తుల బలాబలాలు సామ్రాజ్యవాదానికి అనుకూలంగా మారాయి. జాతీయంగా 2014 ఎన్నికలతో మితవాద మొగ్గు ఏర్పడింది. మోడీ ప్రభుత్వం రావడంతో భారత రాజకీయాల్లో గుణాత్మక మార్పు వచ్చింది. 2019 ఎన్నికల్లో హిందూత్వ-కార్పొరేట్ ప్రభుత్వం మరింత పెద్ద మెజారిటీతో మళ్లీ ఎన్నిక కావడంతో మితవాద శక్తులు మరింత బలం పుంజుకున్నాయి. హిందూత్వ-కార్పొరేట్ శక్తులు, దుందుడుకు నయా-ఉదారవాద విధానాల ద్వంద్వ దాడి జరుగుతోంది. ఫాసిస్టు ధోరణుల పెరుగుదలతో పూర్తి స్థాయి నియంతృత్వం నెలకొంది.

ఈ కాలంలో సిపిఐ(ఎం), వామపక్షాల స్వతంత్ర బలం తగ్గిపోయింది.

ఈ అంశాలన్నిటినీ మనసులో పెట్టుకునే కొల్‌కొతా ప్లీనం పార్టీ నిర్మాణ పరిస్థితిని రివ్యూ చేసి భవిష్యత్ కర్తవ్యాలు నిర్ణయించింది. సాల్కియా ప్లీనం తరువాత పార్టీ సభ్యత్వం పెరిగింది, కానీ పార్టీ ప్రజా విప్లవ పార్టీగా కాకుండా ప్రజా పార్టీగా

మారింది. ఇప్పుడు మన దృష్టి అంతా ప్రజా పునాది కలిగిన అఖిల భారత విప్లవ పార్టీని ఎలా నిర్మించాలి అన్నదానిపైనే ఉండాలి.

ప్లీనం నిర్ణయించిన ప్రధాన కర్తవ్యాలు: ప్రజా పంథా విధానంతో పార్టీకి తిరిగి దిశానిర్దేశం చేయడం. దీనికి పై నుండి క్రింది వరకు పని విధానంలో మార్పు రావాలి. పార్టీ సభ్యుల రాజకీయ–సైద్ధాంతిక స్థాయిని పెంపొందించే విధంగా పార్టీ సభ్యత్వ నాణ్యత పెంచడం. హిందూత్వ మతతత్వం, నయా–ఉదారవాదం, నియంతృత్వ శక్తులతో పోరాడేందుకు ఇది అవసరం.

## సభ్యత్వ నాణ్యత

పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ సమయంలో పార్టీ సభ్యత్వాన్ని సరైన విధంగా స్క్రూటినీ చేయడం ముఖ్యమైన చర్యల్లో ఒకటి అని ప్లీనం సూచించింది. క్రింద పేర్కొన్న 5 పాయింట్లను పరిపూర్తి చేస్తేనే పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలి.

"1) పార్టీ సభ్యత్వ రుసుం, లెవీ చెల్లింపు

"2) శాఖా సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరు కావడం.

"3) పార్టీ తరగతుల్లోనూ, రాజకీయ క్యాంపెయిన్లలోనూ ఆందోళనలు, పోరాటాల్లోనూ సంతృప్తి కరంగా పాల్గొనడం.

"4) పార్టీ మినహాయిస్తే తప్ప ప్రజా సంఘంలో సభ్యునిగా ఉంటూ చురుకుగా పాల్గొనడం.

"5) పార్టీ పత్రికలను నిత్యం చదవడం, వాటికి చందాదారులుగా చేరడం."

## మహిళలు, యువకుల పొందిక

తరచూ నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ పార్టీలో మహిళల సభ్యత్వాన్ని పెంచడంలో గణనీయమైన పురోగతి లేదు. ఇది మన పార్టీ నాణ్యత, పొందికను ప్రభావితం చేస్తున్న తీవ్రమైన బలహీనత. సభ్యత్వంలో యువకుల పొందిక క్రమంగా తగ్గిపోతున్నదని గుర్తించడం జరిగింది. దీనర్థం పార్టీ యువతను తగిన విధంగా ఆకర్షించడం లేదన్నమాట.

పార్టీలో మహిళలు, యువకుల పొందికలో లోపం ఉన్నదని గుర్తించిన ప్లీనం, మహిళల సభ్యత్వం (మొత్తం సభ్యత్వంలో 25 శాతానికీ) యువకుల సభ్యత్వం (మొత్తం సభ్యత్వంలో 20 శాతానికి) పెంచాడానికి ప్రత్యేక కృషి చేయాలని ఆదేశించింది.

## కేంద్రీకృత ప్రజాస్వామ్యం

పార్టీ నిర్మాణం, దాని అంతర్గత జీవితం కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలతో నడపబడుతుంది. కేంద్రీకృత ప్రజాస్వామ్యం అంటే కేంద్రీకృతం, ప్రజాసామ్యాల కలయిక అన్న మాట. పార్టీ కమిటీలకు మార్గదర్శకత్వం వహించే కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలను పార్టీ నిబంధనావళి రూపొందించింది. ప్రతి స్థాయిలోనూ కేంద్రీకృత ప్రజాస్వామ్య పరిస్థితిని గురించి తీవ్రంగా సమీక్షించాలని ప్లీనం పిలుపు నిచ్చింది. దానివల్ల పార్టీలోని ప్రతి స్థాయిలోనూ కేంద్రీకృత ప్రజాస్వామ్మం అమలులో లోపాలు, ఉల్లంఘనలను గుర్తించి కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి సరైన దిద్దుబాటు చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

పార్టీలో ప్రాథమిక యూనిట్ అయిన పార్టీ శాఖ కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఇది ప్రజలతో నేరుగా వ్యవహరించే విభాగం. శాఖల పనిలో బలహీనతలు దీర్ఘకాలం నుండి ఉన్నాయి. అందువల్ల ప్లీనం ఈ క్రింది విధంగా పేర్కొంది: “శాఖలను చురుకుగా పనిచేయించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. దానివల్ల అవి ప్రజల్లో రాజకీయ, నిర్మాణ పనిని నిర్వహించగలుగుతాయి. సభ్యత్వ పునరుద్ధరణ, చేసిన పనిపై సమీక్షను శాఖలు చేయాలి. జిల్లా కమిటీలు శాఖా కార్యదర్శులకు శిక్షణ ఇచ్చి వారితో నిత్యం సమావేశాలు జరపాలి.”

## పార్టీ కార్యకర్తలు (క్యాడర్స్)

పార్టీ నిర్మాణంలో కార్యకర్తల అభివృద్ధి, వారి పని ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తుంది. కార్యకర్తలంటే వివిధ స్థాయిల్లోని పార్టీ కమిటీల సభ్యులు, ప్రజా సంఘాల్లో నిర్ధిష్ట స్థాయిలో పనిచేయడానికి నియమించిన, కొన్ని రంగాల్లో నిర్ధిష్ట పనికి కేటాయించిన వారు. పూర్తి కాలం కార్యకర్తలంటే పార్టీ కార్యకర్తల్లో పూర్తి కాలం పార్టీ కోసం పనిచేసేవారు.

పార్టీ కార్యకర్తల వయసు మీరిపోవడం తీవ్ర సమస్యగా ఉందని కొల్‌కొతా ప్లీనం గుర్తించింది. అందువల్ల పార్టీలోకి యువ కార్యకర్తలను ప్రమోట్ చేసుకోవడం, పూర్తికాలం యువ కార్యకర్తలను రిక్రూట్ చేసుకోవడం అవసరం.

## దిద్దుబాటు ఉద్యమం

పార్టీలోపల పుడుతున్న పార్లమెంటరీ తత్వం, ఉదారవాదం, స్వీయమానసిక ధోరణి, ఫెడరలిజం వంటి తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా నిత్యం దిద్దుబాటు

ఉద్యమం చేయడం అవసరమని కూడా ప్లీనం నొక్కి చెప్పింది. కమ్యూనిస్టు నియమాలను వదిలిపెట్టినవారు, అవినీతి చర్యలకు పాల్పడేవారికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలి.

## హిందూత్వ సిద్ధాంతాన్ని ఎదుర్కోవడం

బిజెపి/ఆర్ఎస్ఎస్ కూటమి అధిపత్య రాజకీయ పార్టీగా ఎదగడం, హిందూత్వ సిద్ధాంతం ప్రజల్లోకి చొచ్చుకుపోవడం, పార్టీలోని గణనీయమైన సెక్షన్ చైతన్యం తక్కువ స్థాయిలో ఉండడం దృష్ట్యా పార్టీ ప్రభావం పెంచుకోవాలంటే పాలక వర్గాల సిద్ధాంతాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం జరపడం కీలకమైంది. హిందూత్వను రాజకీయ, సైద్ధాంతిక, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో ఎలా ప్రతిఘటించాలో 21వ మహాసభ నుండి 23వ మహాసభ వరకు రాజకీయ తీర్మానాలు మార్గనిర్దేశం చేశాయి.

## సోషల్ మీడియా

సోషల్ మీడియాలో మన జోక్యం ఎంత అవసరమో ప్లీనం నివేదిక నొక్కి చెప్పింది. రాష్ట్ర, జిల్లా, ఇంకా క్రింది స్థాయిల్లో సోషల్ మీడియా గ్రూపులతో విస్తృత నెట్ వర్క్ నిర్మించాలని అది ఆదేశించింది. దీనికిగాను ఫేస్‌బుక్, వాట్సాప్ వినియోగదారుల విస్తృత నెట్‌వర్క్ నిర్మించాల్సి ఉంది.

## కొత్త సంస్థలు

కొత్త ప్రజా సంఘాల అభివృద్ధి, కొత్త రంగాల్లో పని గురించి కూడా కొల్‌కొతా ప్లీనం చెప్పింది. వాటిలో భాగంగా బాలసంఘాలను ఏర్పాటు చేయడం, నివాస/పట్టణ ప్రాంతాల్లో పని, వ్యవసాయేతర గ్రామీణ కార్మికులను గుర్తించడం, అటువంటి గ్రామీణ కార్మికులను సమీకరించడం వంటి పనులు చేయాలని సూచించింది.

## పార్టీ, ప్రజా సంఘాలు

ప్రజా సంఘాల్లో మన పని పద్ధతిని సరిదిద్దుకోవాలని ప్లీనం పిలుపునిచ్చింది. దీని వల్ల అవి స్వతంత్ర, ప్రజాతంత్ర పనిని కొనసాగించగలవని పేర్కొంది. ఈ కృషి చైతన్యపూర్వకమైన క్రమం. ట్రేడ్ యూనియన్లు, కిసాన్ సభలు, వ్యవసాయ కార్మిక సంఘాల పని మొత్తం మౌలిక వర్గాల్లో ఇంకా చాలా చిన్న సెక్షన్‌కు మాత్రమే పరిమితమై ఉందన్న విషయాన్ని మనం మనసులో ఉంచుకోవాలి. అదే సమయంలో సబ్–కమిటీలనూ, ఫ్రాక్షన్ కమిటీలనూ సరైన పద్ధతిలో పనిచేయించాలి. అవి పార్టీ సభ్యుల రాజకీయ కృషి మీద, పార్టీ నిర్మాణం మీద కేంద్రీకరించాలి.

## ప్రస్తుత, రాజకీయ-నిర్మాణ కర్తవ్యాలు

23వ మహాసభ రాజకీయ నిర్మాణ నివేదిక.. రాష్ట్రాల్లో పార్టీ సంస్థను సమీక్షించి, నిర్మాణ కర్తవ్యాలను అమలు చేయడానికి తీసుకోవలసిన చర్యలను సూచించింది. వీటిని 22వ మహాసభలోనే రూపొందించడం జరిగింది. అంతకు ముందు 2019 అక్టోబర్‌లో కేంద్ర కమిటీ, కొల్‌కొతా ప్లీనం, 22వ మహాసభ నిర్దేశించిన నిర్మాణ కర్తవ్యాల అమలుపై ఒక మధ్యంతర సమీక్ష జరిపింది. అయితే ఇది జరిగిన కొద్ది మాసాల్లోనే 2020, 2021 సంవత్సరాల్లో కరోనా మహమ్మారి రావడం, లాక్‌డౌన్లు విధించడం జరిగింది. ఈ ప్రభావం పార్టీ నిర్మాణ, ప్రజా సంఘాల కృషి మీద పడింది.

వీటన్నిటినీ పరిగణనలోకి తీసకుని 23వ మహాసభ రాజకీయ నిర్మాణ నివేదిక నిర్మాణంపై తక్షణ కర్తవ్యాలను నిర్ణయించింది.

23వ మహాసభ నిర్దేశించిన ముఖ్యమైన రాజకీయ నిర్మాణ కర్తవ్యాలను గురించి 2022 జూన్‌లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం చర్చించి, వాటిని నిర్ధిష్ట పరిచింది. దీనిపై ఆధారపడి రాష్ట్ర కమిటీలు తమ స్వంత నిర్ధిష్ట కర్తవ్యాలను రూపొందించుకోవాలని కోరడం జరిగింది. ఈ క్రింది కర్తవ్యాలను నిర్ణయించడం జరిగింది:

## రాజకీయ తీర్మానం నుండి కొన్ని కర్తవ్యాలు

**వామపక్ష ప్రజాతంత్ర సంఘటన:** రాష్ట్ర కమిటీలన్నీ ఒక వామపక్ష ప్రజాతంత్ర కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి, అటువంటి వేదిక నుండి పనిచేసే శక్తులను గుర్తించాలి. ఈ ఏడాది చివరికి ఈ పని పూర్తి కావాలి. అదే సమయంలో అటువంటి వామపక్ష ప్రజాతంత్ర వేదికను ఎలా నిర్మించాలన్న దానిపై సిపిఐతో అఖిలభారత స్థాయిలో చర్చలు జరగాలి. కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపురకు సంబంధించినంత వరకు వాళ్లు ప్రస్తుతం ఉన్న సంఘటనలను ఎలా బలపరుచుకోవాలి అన్నదానిపై చర్చించవచ్చు.

**స్థానిక పోరాటాలు:** స్థానిక సమస్యలను గుర్తించి, వాటిపై స్థానిక పోరాటాలను నిరంతరాయంగా జరపడానికి చొరవ చూపే విషయంలో జిల్లా, మధ్యంతర కమిటీలకు రాష్ట్ర కమిటీలు నిర్ధిష్టమైన మార్గదర్శకత్వం వహించాలి. ఏదైనా నిర్ధిష్ట ప్రాంతం/ జిల్లాలో అటువంటి పోరాటాలు జరిగితే వాటి అనుభవాలను ఇతర జిల్లాలకు, ప్రాంతీయ కమిటీలకు అందజేయాలి. ఈ విషయంలో జీవన భుక్తి, పౌర సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సామాజిక సమస్యలకు కూడా సముచిత ప్రాధాన్యం ఇవ్వాలి.

**మతతత్వానికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యంపై దాడులు, నియంతృత్వానికి వ్యతిరేకంగా విస్తృత వేదిక నిర్మాణం:** గత మహాసభలో కూడా దీన్ని గురించి నొక్కి చెప్పడం జరిగింది. మనం మతతత్వానికి వ్యతిరేకంగా, లేక రాజ్యాంగ పరిరక్షణ కోసం విస్తృత వేదిక/కమిటీ ఏర్పాటు చేయని చోట ఆ పని వెంటనే చేయాలి. అటువంటి వేదికలున్న చోట వాటి పనిని పునరుద్ధరించాలి. వాటిని మరింత విస్తృతం గావించడానికి ప్రయత్నించాలి.

**హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం:**

1) పార్టీ నెలకొల్పిన అంకితమైన గ్రూపులు నిరంతరం సైద్ధాంతిక, రాజకీయ సామగ్రిని సిద్ధం చేస్తుండాలి. ఇవి ప్రజలకు అర్ధమయ్యే విధంగా ఉండాలి. హిందూత్వ, మతతత్వ శక్తుల అభివృద్ధి నిరోధక తత్వాన్ని ప్రజల్లో ఎండగట్టే విధంగా వారికి అర్ధమయ్యే పద్ధతిలో రాయాలి.

2) పెరుగుతున్న ఛాందసవాదం, మూఢనమ్మకాలు, అహేతుకత, పితృస్వామిక విలువలను ఎదుర్కొనేందుకు గాను సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాలను, ప్రజా సైన్సు ఉద్యమాన్ని ప్రోత్సహించాలి. హేతువాదంపై ఆధారపడిన లౌకిక, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడం ద్వారా పై సంస్థలను ప్రోత్సహించాలి. హిందూత్వ బ్రిగేడ్ విస్తరింపజేస్తున్న అహేతుకత, తర్కరాహిత్యాలను ఎదుర్కొనేందుకు ఇది అవసరం.

3) కార్మికవర్గంలోనూ, కార్మికులు నివసించే ప్రాంతాల్లోనూ పార్టీ, ట్రేడ్‌యూనియన్లు లౌకిక, శాస్త్రీయ ధోరణి పెంపొందించేందుకు సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

4) ఆర్‌ఎస్‌ఎస్ సంస్థలు చేస్తున్న వివిధ రకాల కార్యకలాపాలను ఎదుర్కొనేందుకు ఆదివాసీ ప్రాంతాల్లోనూ, దళితుల్లోనూ సంస్థాగత కృషి పెంపొందించాలి.

5) సాంఘిక సేవా కార్యక్రమాలను పెంపొందించాలి. కరోనా మహమ్మారి సందర్భంగా చేసిన పనిని ఆరోగ్య కేంద్రాలు నడపడం ద్వారా కొనసాగించాలి. లైబ్రరీలు, రీడింగ్ రూమ్‌లు, ఎడ్యుకేషనల్ కోచింగ్ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు మొదలైన కార్యకలాపాలను చేపట్టాలి.

## నిర్మాణ కర్తవ్యాలు

1) **పార్టీ సభ్యత్వ నాణ్యత పెంచడం:** దీనికి గాను 2023లో చేపట్టే తదుపరి పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ నుండి పార్టీ సభ్యత్వ అర్హతకు అయిదారు పాయింట్ల ప్రమాణాలను నిక్కచ్చిగా పాటించాలి.
2) **పార్టీ శాఖల కార్యకలాపాలు:** ఆరుమాసాల కాల పరిమితిలో క్రియాశీలం చేసే శాఖల సంఖ్యను లక్ష్యంగా ప్రతి రాష్ట్ర కమిటీ నిర్దేశించుకోవాలి. దాంతోపాటు శాఖా కార్యదర్శుల శిక్షణకు కూడా ప్రణాళిక తయారు చేయాలి.
3) 2023, 2024 సభ్యత్వ పునరుద్ధరణ సందర్భంగా పార్టీలోకి యువకులు, మహిళల సంఖ్యను పెంచడానికి ప్రణాళికా బద్ధమైన కృషి చేయాలి.
4) కొత్త యువ పూర్తికాలం కార్యకర్తలను రిక్రూట్ చేసుకోడానికి ప్రణాళికాబద్ధమైన కృషి జరగాలి.
5) సూర్జిత్ భవన్‌లోని శాశ్వత పాఠశాలలో కేంద్ర పాఠశాలలకు ప్రణాళిక వేయాలి. ఏడాది చివరి వరకు పాఠశాలలు నిర్వహించేందుకు ఎడ్యుకేషన్ సబ్ – కమిటీ ప్రణాళిక రూపొందించాలి. ఆర్‌ఎస్‌ఎస్, హిందూత్వ సిద్ధాంతం, కార్యకలాపాల మీద పార్టీ కేంద్రం వచ్చే మూడు మాసాల్లో నోట్‌ను ఖరారు చేయాలి.
6) దిద్దుబాటు ఉద్యమానికీ, దానికి ఒక కాలపరిమితి ఏర్పాటుకూ కేంద్ర కమిటీ ఒక ప్రణాళిక రూపొందించాలి.
7) మొత్తం గ్రామీణ కార్మికులను కవర్ చేస్తూ గ్రామీణ కార్మిక యూనియన్/ ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయాలి. దీనికి గాను గ్రామీణ వ్యవసాయేతర కార్మికులు చేస్తున్న వివిధ రకాల పనులను గురించి తెలుసుకునేందుకు రాష్ట్ర కమిటీలు సర్వేలు నిర్వహించాలి. అటువంటి సర్వేలను ఈ ఏడాది చివరికి ఒక నిర్ధిష్ట కాల పరిమితిలోపు పూర్తిచేయాలి.
8) ఈ సర్వేల ఆధారంగా రాష్ట్ర కమిటీలు గ్రామీణ కార్మికుల్లోని వివిధ సెక్షన్లను ఎలా ఆర్గనైజ్ చేయాలన్న విషయాన్ని చర్చించాలి. ఆ నివేదికను పార్టీ కేంద్రానికి పంపాలి.
9) సోషల్‌మీడియా ఉపయోగాన్ని పార్టీ నిర్మాణంతో సమైక్య పరిచే ప్రణాళికలను రాష్ట్ర కమిటీలు రూపొందిచాలి. రూపొందించిన మార్గదర్శకాలను అమలు చేసేందుకు వర్క్‌షాపులు నిర్వహించాలి. ఈ పనులను ఈ ఏడాదిలోపే చేయాలి.

10)ప్రజా సంఘాల పనిని కేంద్ర కమిటీ సమీక్షించేందుకు ఏడాది పొడవు ప్రణాళిక తయారు చేయాలి. ప్రజా సంఘాలు స్వతంత్రంగా పనిచేసేందుకు రూపొందిం చిన మార్గదర్శకాలు అమలయ్యేట్లు చూడాలి. పార్టీ నిర్మాణం, ప్రాక్షన్లను పర్యవేక్షించాలి.

11)బాల సంఘాల ఏర్పాటు గురించి రాష్ట్ర కమిటీలు చర్చించాలి. ఈ పని ప్రారంభించేందుకూ, సమన్వయం చేసేందుకూ కేంద్ర స్థాయిలో ఒక సమావేశం/వర్క్‌షాప్ నిర్వహించాలి.

12) కేంద్రంలోని పట్టణ వ్యవహారాల కమిటీ సహాయం/సమన్వయంతో రాష్ట్ర కమిటీలు పట్టణ ప్రాంతాల్లో పనిచేయడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలి.

**చదవాల్సిన పుస్తకాల జాబితా:**


1. సిపిఐ(ఎం) 23వ మహాసభ రాజకీయ నిర్మాణ నివేదిక, ఏప్రిల్ 2022
2. నిర్మాణంపై నివేదిక, తీర్మానం; కొల్‌కొతా ప్లీనం, డిసెంబర్ 2015
3. నిర్మాణంపై నివేదిక, సాల్కియా ప్లీనం, డిసెంబర్ 1978
4. నిర్మాణంపై తీర్మానం, సాల్కియా ప్లీనం, డిసెంబర్ 1978
5. పార్టీ నిర్మాణంపై మన కర్తవ్యాలు, 1967 అక్టోబర్‌లో కేంద్ర కమిటీ ఆమోదించినది


♦

# పార్టీ, ప్రజా సంఘాలు

## I

## ప్రవేశిక

**దే**శంలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం పార్టీ ప్రాథమిక కర్తవ్యం. "ఈ సంఘటన నిర్మాణం కోసం జరిపే పోరాటం వర్గబలాబలాల పొందికలో మార్పుకోసం మనం చేసే కృషిలో భాగం. ప్రజలు రెండు బూర్జువా-భూస్వామ్య పార్టీల మధ్య ఏదో ఒకదాన్ని ఎన్నుకునే పరిస్థితి నుండి బయటపడేయడానికీ, ప్రస్తుత వ్యవస్థలోపల బందీగా ఉండే పరిస్థితి నుండి విముక్తి చెందడానికీ ఈ సంఘటన నిర్మాణం అవసరం." ఇది సాధించాలంటే 'ప్రజాపోరాటాలను పెద్ద ఎత్తున నడపడం, ప్రజా సంఘాలు ముఖ్యమైన పాత్ర నిర్వహించడం అవసరం' అనే విషయాన్ని పార్టీ నిత్యం నొక్కిచెబుతున్నది. "వామపక్ష ప్రజాస్వామిక పార్టీలు ఈ ప్రజా సంఘాలను ఉమ్మడి పోరాటాల్లోకి తీసుకువచ్చినప్పుడు మాత్రమే స్థిరమైన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం జరిగే అవకాశం ఉంటుంది."

విప్లవోద్యమానికి ప్రజా సంఘాల ప్రాముఖ్యత దృష్ట్యా, రివిజనిస్టులతో విడిపోయిన తరువాత మనం వివిధ ప్రజా సంఘాలను సరైన రీతిలో పునర్నిర్మాణం చేయడానికి ప్రయత్నించాము. 1979లో కిసాన్ సభను పునర్నిర్మించాం. ట్రేడ్ యూనియన్ రంగాన్ని 1970లో, విద్యార్థి రంగాన్ని 1970లో పునర్నిర్మించాం. అఖిల భారత స్థాయిలో మనం పనిచేస్తున్న ప్రజాసంఘాలు ఇవి. 1978లో జలంధర్‌లో జరిగిన 10వ మహాసభ ఈ సమస్యను చర్చించి కొత్త ప్రజాసంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మనం మహిళా, యువజన రంగాలను 1980లో ఏర్పాటు చేశాం. తదుపరి 1981లో వ్యసాయ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశాం.

తరువాత, సామాజిక సమస్యలపై దృష్టి సారించాల్సిన ప్రాముఖ్యతను పార్టీ గుర్తించి వివిధ సామాజిక గ్రూపుల సమస్యలపై పని చేయడానికి వేదికలను నెలకొల్పింది.

2010లో ఆదివాసీ వేదిక ఏర్పాటు చేయడం జరిగింది. 2014లో దళిత్ మంచ్‌ను ఏర్పాటు చేశాం. ముస్లిం మైనారిటీల్లో పనికోసం కొన్ని రాష్ట్రాల్లో వేదికలు నడుస్తున్నాయి. 2010లో వికలాంగులకు కూడా వేదిక ఏర్పాటు చేయడం జరిగింది.

ఇటీవల బాలల సంఘాలను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని గుర్తించి, బాలసంఘాల ఏర్పాటుకు కొన్ని ప్రాథమిక చర్యలు తీసుకున్నాం. కేరళ రాజధాని తిరువనంతపురంలో జాతీయ స్థాయి వర్క్‌షాపు నిర్వహించాం. రాష్ట్రాల స్థాయిలో సాంస్కృతిక వేదికలు/ సంస్థలు చాలా కాలంగా పనిచేస్తున్నాయి. విభిన్న సెక్షన్ల అవసరాలు తీర్చే వివిధ రకాల సంస్థలు, వేదికలు రాష్ట్రాల స్థాయిలోనూ, స్థానికంగానూ సామాజిక సేవా కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలు, సామాజిక సంస్కరణ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.

భవిష్యత్తులో కూడా మన లక్ష్యం ఒకటే..ఎక్కడ ప్రజలు ఉంటే వారిలో పనిచేయాలి. మనం వారిని సమీకరించి, నిర్మించాలి. దానికోసం మనం సంస్థలు, వేదికలు, ఫోరమ్‌లు తగిన ఇతర సంస్థలు నెలకొల్పాలి. మనం ఇప్పటికే ఉన్న సంస్థల్లో కూడా పనిచేయవచ్చు. ఒకే విషయం ఏమంటే, ఈ సంస్థలు ప్రజలను ఐక్య పరచాలి. అంతిమంగా వామపక్ష ప్రజాస్వామ్య శక్తులను కూడదీయడానికి ఉపకరించాలి.

ప్రజాసంఘాల ఏర్పాటుకు సన్నాహాలు చేసే సమయంలోనూ, వాటి పని కాలంలోనూ అనేక సమస్యలు, తప్పుడు అభిప్రాయాలు చొచ్చుకు వచ్చాయి. అవి తలెత్తినప్పుడు పార్టీ ఆ సమస్యలను చర్చించి, ప్రజాసంఘాల పనికి సంబంధించి సరైన అవగాహనకు వచ్చింది. తద్వారా వాటి స్వతంత్ర, ప్రజాస్వామిక పనికీ, ఫ్రాక్షన్ కమిటీలపై సమర్ధవంతమైన పర్యవేక్షణకూ, వాటికి సరైన మార్గదర్శకం చేయడానికీ దోహదపడింది. ఈ అంశాలను మన సమీక్షా నివేదికల్లోనూ, తీర్మానాల్లోనూ చేర్చడం జరిగింది. 1967లో, పార్టీ తన నిర్మాణ నివేదికలో, టియు, కిసాన్ రంగాల్లో పెరిగిపోతున్న రివిజనిస్టు ప్రభావాలను తప్పుపట్టింది. ప్రజాసంఘాల నిర్మాణానికి సరైన మార్గనిర్దేశం చేసింది. 1974లో ఫ్రాక్షన్లు, సబ్-కమిటీల పనివిధానానికి సంబంధించిన మార్గదర్శకాలను పార్టీ ఇచ్చింది. తరువాతి కాలంలో 1979లో సాల్కియా ప్లీనం, కొల్‌కొతా ప్లీనం కూడా ప్రజా సంఘాల పని నుండి వచ్చిన అనుభవాల ఆధారంగా మార్గదర్శకాలను రూపొందించాయి. ఈ విషయంలో పార్టీ వెలువరించిన అత్యంత ముఖ్యమైన పత్రాల్లో ఒకటి 1981లో వెలువడిన 'ప్రజా సంఘాలపై' అనేది, రెండోది 'ప్రజాసంఘాల పట్ల దృక్పథం' (2004) అనే కేంద్ర కమిటీ పత్రం. పార్టీలోని వివిధ స్థాయిల్లో నిర్ధిష్టంగా నెలకొన్న కొన్ని తప్పుడు ధోరణులు, కార్యాచరణలను సరిచేసి, సరైన అవగాహన కల్పించేందుకు కేంద్ర కమిటీ ఈ పత్రాలను రూపొందించింది.

మన రాజకీయ లక్ష్యం సాధించడంలో వర్గ, ప్రజాసంఘాల ప్రాముఖ్యత దృష్ట్యా మనకు ప్రజాసంఘాల లక్షణం, పాత్ర, పనిపైనా, పార్టీ, ప్రజాసంఘాల మధ్య సంబంధాలపైనా సరైన మార్క్సిస్టు–లెనినిస్టు అవగాహన ఉండాలి. లేకపోతే తప్పుడు భావాలు, పద్ధతుల వల్ల పజాసంఘాల పెరుగుదల మందగిస్తుంది. దానివల్ల ప్రజా ఉద్యమాల అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అందువల్ల పార్టీలోని అన్ని స్థాయిల్లోని పార్టీ కామ్రేడ్స్ పార్టీ పత్రాలను ముఖ్యంగా పైన పేర్కొన్న పత్రాలను చదవడం ద్వారా సరైన అవగాహన ఏర్పరుచుకోవాలి.

ఇప్పుడు మనం ప్రజా సంఘాలపై పార్టీ అవగాహనకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను పునఃశ్చరణ చేసుకుందాం.

## II

## ప్రజాసంఘం లక్షణం ఏమిటి?

ప్రజాసంఘం సాధ్యమైనంత విస్తృతంగా ఉండాలి. ఆయా సెక్షన్ల ప్రజలను రాజకీయ, సామాజిక ఇతర బేధాలతో నిమిత్తం లేకుండా గరిష్ట సంఖ్యలో ఆకర్షించగలగాలి. ఆ సంస్థకు అటువంటి విస్తృత లక్షణాన్ని నివారించే ఏ అంశాన్నీ అనుమతించకూడదు. ప్రజలకు ప్రస్తుతం ఉన్న చైతన్యం ఆధారంగా అది పనిచేస్తూ వారి చైతన్యాన్ని మరింత ఉన్నత స్థాయికి పెంచడానికి క్షేత్రాన్ని సన్నద్ధం చేయాలి.

### ప్రజా సంఘాలు ఎందుకు అవసరం?

అ) పార్టీ నేరుగా ఇచ్చే రాజకీయ నినాదాలు ప్రజలను వెనువెంటనే ఉత్తేజ పరచలేవు గనుక ప్రజా సంఘాల అవసరం ఏర్పడింది. పాక్షిక డిమాండ్ల కోసం ప్రజాసంఘాలు చేసే పోరాటాలు, ఈ పోరాటాల్లో ప్రజలు గ్రహించే అనుభవాల ద్వారానే ప్రజల చైతన్యాన్ని పెంచవచ్చు.

ప్రజా సంఘం అనేది పార్టీకీ, విశాల ప్రజా బాహుళ్యానికీ మధ్య లింకు. ఈ ప్రజా బాహుళ్యంలో చాలా మంది చైతన్యం రీత్యా వెనుకబడి ఉంటారు. వీరు పార్టీ కింద గానీ లేక పార్టీ రాజకీయ ప్రభావం కిందగానీ ఉండరు.

ఆ) ప్రజా సంఘాలు రానురాను మరింత మంది కొత్త ప్రజానీకాన్ని తమ సంఘాల్లోకి ఆకర్షించి వారిని అభివృద్ధి చేయడం ద్వారా పార్టీ రాజకీయ ప్రభావంలోకి తీసుకువస్తాయి.

ఇ) అవి తమ కార్యకలాపాల ద్వారా వెనుకబడిన ప్రజల్లోని ప్రాథమిక చైతన్యాన్ని ఉన్నత స్థాయికి తీసుకుపోయి వారిని పార్టీ ప్రభావం క్రిందకు తీసుకు రావడానికి తోడ్పడతాయి.

ఈ) విభిన్న స్థాయిల్లోని చైతన్యం కలిగి అనేక రకాల రాజకీయ, రాజకీయేతర ప్రభావాల క్రిందనున్న మెజారిటీ ప్రజలను ఐక్యపరిచి వారి మనసులు గెలుచుకోడానికి ప్రజా సంఘాలు అవసరం.

## ఒక ప్రజా సంఘం ఎందుకు విశాలంగా ఉండాలి?

ప్రజా సంఘాలు విశాలంగా ఉండాలి. ప్రజా సంఘం ఎంత విశాలంగా ఉంటే దానిపై మన ప్రభావం అంత విశాలంగా ఉంటుంది. అలా విశాలంగా ఉంచాలంటే, ఆ సంఘం క్రింద మనం సమీకరించే సెక్షన్ల ప్రజల లక్షణంపైనా, ప్రస్తుత విప్లవ దశ.. అంటే జనతా ప్రజాస్వామిక విప్లవ దశలో వారి స్థానం, వారు నిర్వహించే పాత్రపైనా, ప్రస్తుతం వారి చైతన్య స్థాయిపైనా, పోరాటాల్లో పాల్గొనేందుకు వారి సంసిద్ధతపైనా మనకు స్పష్టమైన అవగాహన ఉండాలి.

1981 పత్రం ఈ విధంగా పేర్కొంది: "ప్రజా సంఘాలు, వాటి కార్యక్రమం, వాటి నిబంధనావళి, వాటి ప్రభావం ఇవన్నీ కూడా అది ఏ ప్రజల సంఘమో ఆ ప్రజల లక్షణం ఏమిటి, పిడిఎఫ్ నిర్మాణంలో ఆ ప్రజలు ఆక్రమించే స్థానం ఏమిటి, అవి ఉద్యమాల్లోకి వచ్చే తక్షణ ప్రయోజనాలు ఏమిటి, ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, గుత్తాధిపత్య వ్యతిరేక పోరాటంలోకి ఈ ప్రజలు ఎలా వస్తారు అన్న అంశాలచేత నిర్ణయించబడతాయి."

## కొన్ని తప్పుడు అభిప్రాయాలు

మనమంతా సూత్రరీత్యా పైన చెప్పిన అవగాహనతో ఏకీభవిస్తాం. కానీ ఆచరణలో అనేక సార్లు ప్రజా సంఘాలతో వ్యవహరించేటప్పుడు దీనికి భిన్నంగా ఆలోచిస్తాం, ఆచరిస్తాం.

ఈ ఆలోచన సారాంశం ఏమంటే, మనం ప్రజా సంఘాన్ని పార్టీ ప్రతి రూపాలుగానూ, కేవలం పార్టీ వేదికలుగానూ చూడ్డమే.

1. ప్రజా సంఘాల నిబంధనావళులనుగానీ, వాటి లక్ష్యాలు, కర్తవ్యాలు, నినాదాలనుగానీ ఎలా రూపొందించాలంటే అవి ఆయా సంఘాల పార్టీయేతర లక్షణానికి భంగం కలగకుండా ఉండాలి.

   1981 కేంద్ర కమిటీ పత్రం కొన్ని ప్రజా సంఘాల కార్యక్రమాలనూ, ప్రకటనలనూ విమర్శించింది. అవి ప్రజా సంఘాల లక్షణానికి తగ్గట్టు లేవని చెప్పింది. చాలా ప్రజా సంఘాల కార్యక్రమాలు, లక్ష్యాలను నిజంగా అమలు చేయడానికి పూనుకుంటే అవి ఆయా సంఘాల విస్తరణ క్రమాన్ని అడ్డుకుంటాయి. కానీ వాస్తవంగా ఆచరణలో అవి ఆయా సంఘాలకు చెందిన ప్రజానీకం నేరుగా, తక్షణం ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్రీకరిస్తున్నాయి.

దానర్థం వాటి అవాస్తవికమైన నినాదాలు, కార్యక్రమాలు సరైనవని కాదు.

ఈ సందర్భంగా ఈ పత్రం విద్యార్థి విభాగం ఆమోదించిన పత్రంలోని పిలుపు, దాని పీఠికను గురించి ఉదహరించింది. విద్యార్థి విభాగం పిలుపు, పీఠికలో... అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులపై పార్టీ అభిప్రాయాలనే పునరుద్ఘాటించారు. ఇది సగటు విద్యార్థి చైతన్యానికి మించిపోయింది. విద్యార్థి బాహుళ్య విభాగాన్ని నిర్మించడానికి ఇది ఒక ఆయుధం ఎంతమాత్రం కాబోదు. 1981 పత్రం ఈ విధంగా చెప్పింది: "కానీ అదృష్ట వశాత్తు సంఘం ప్రధాన కార్యకలాపాలన్నీ విద్యార్థుల విద్యా, రాజకీయ డిమాండ్ల మీద కేంద్రీకరించ బడ్డాయి. పత్రంలో ఊడా వీటికే ప్రాముఖ్యత ఇవ్వడం జరిగింది. పత్రంలో శాస్త్రీయ సోషలిజం గురించి చప్పారు. శాస్త్రీయ సోషలిజాన్ని అంగీకరించేవారే సంఘంలో చేరాలని షరతు పెడితే అప్పుడు సిపిఐ(ఎం) పార్టీ సభ్యులు మాత్రమే అర్హులయ్యేవారు. శాస్త్రీయ సోషలిజాన్ని ప్రచారాందోళనా నినాదంగానే సక్రమంగా అర్థం చేసుకుని రోజువారీ కార్యకలాపాల్లో అలాగే వ్యవహరించినా కూడా, అంటే సంఘాన్ని శాస్త్రీయ సోషలిజంతో ముడివేసినా కూడా...అప్పుడు కూడా విద్యార్థి సంఘం ఒక ప్రజా సంఘం లక్షణం కోల్పోయేది. శాస్త్రీయం సోషలిజం గురించి వివరిస్తూనే ఏదో ఒక పార్టీ రాజకీయాలను సంఘం మీద రుద్దడానికి ఆమోదించకూడదని పత్రంలో పెట్టిన ఒక నిబంధన కొంతవరకు ఊరటనిస్తోంది."

2. 1981 కేంద్ర కమిటీ పత్రంలోని మరో ముఖ్యమైన విషయం ఏమంటే, ప్రజా సంఘాల కార్యకలాపాలు విప్లవంలోని ఒకానొక దశతో లింకుచేయ బడ్డాయి. ప్రజాతంత్ర లేక జనతా ప్రజాతంత్ర విప్లవ దశలో ప్రజా సంఘాల లక్ష్యం, కార్యక్రమం సోషలిస్టు దశకు భిన్నంగా ఉంటుంది. ప్రజాతంత్ర దశలో మన ప్రజాసంఘాల్లో ఉన్నవారంతా విప్లవ తదుపరి దశలో ఉండాలని లేదు.

3. చాలా సార్లు మన ప్రజా సంఘాలు పార్టీ నినాదాలనే తమ నినాదాలుగా స్వీకరించి, ముందుకు తీసుకుపోతుంటాయి. అవి ఆయా సెక్షన్ ప్రజలకు వర్తిస్తాయా లేదా, లేక వారి అవగాహనా స్థాయి, వారి సంసిద్ధత స్థాయికి సరిపోతాయా లేదా అన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవు.

ప్రజలను సమీకరించడం కోసం ప్రజా సంఘాలు వారికి సంబంధించిన విభిన్న సమస్యలను చేపట్టాలి. ఆయా ప్రజల రాజకీయ అభిప్రాయాలతో సంబంధం లేకుండా వారిని సమీకరించి వారి సమస్యలను ముందుకు తెచ్చి వాటిపై ఎలా పోరాడతాయి అన్న దానిపై ఆయా ప్రజా సంఘాల బలం, ప్రభావం అధారపడి ఉంటుంది. అటువంటి కార్యకలాపాల ద్వారా

ప్రజలను సమీకరించడంలోనే ప్రజా సంఘాల విస్తృతి ఆధారపడి ఉంటుంది.

4. మనం ప్రజా సంఘాలను మన పార్టీ సంఘాలుగా నడపకూడదు. ఈ విషయాన్ని మనలో చాలా మందిమి అంగీకరిస్తాం, కానీ ఆచరణలో మాత్రం అవి మన పార్టీ అనుబంధ సంఘాలన్నట్లు వ్యవహరిస్తాం. ఈ దేశంలో ప్రతి రాజకీయ పార్టీకీ స్వంత ప్రజా సంఘాలున్నప్పుడు మనం మన ప్రజా సంఘాలను మన పార్టీ సంఘాల్లాగా నడిపితే నష్టమేమిటి అని గతంలో కొంతమంది కామ్రేడ్స్ వాదించేవారు. కేంద్ర కమిటీ పత్రం ఈ వాదనలోని డొల్లతనాన్ని వెల్లడిస్తూ...ఇటువంటి వాదనలు చేసే కామ్రేడ్స్ పార్టీ లక్ష్యాలనూ, కర్తవ్యాలనూ, అవగాహననూ, వర్గ ఎత్తుగడలనూ విప్లవేతర పార్టీల స్థాయికి దిగజారుస్తున్నారన్న మాట అని చెప్పింది. ఈ రాజకీయ పార్టీలు ఆయా ప్రజా సంఘాలను రాజకీయ ఓటు బ్యాంకులుగా పరిగణిస్తాయి. అందువల్ల అవి ఆ సంఘాల్లో ఇతరుల జోక్యాన్ని అనుమతించవు. ఆయా సంఘాల్లోని వారి సాధారణ ప్రజా పోరాటాలకు సాధ్యమైనంత దూరంగా ఉంచడానికి ప్రయత్నిస్తాయి. ఆ సంఘాలను పార్టీ సొమ్ములాగా నడిపిస్తాయి. వారి ఎత్తుగడలు ప్రజల ప్రయోజనాలకు భిన్నమైనవి.

ఇక్కడ మనం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోని ప్రజా సంఘాల భావనకూ ఇతర రాజకీయ పార్టీలు నడిపే ప్రజా సంఘాల భావనకూ మధ్య తేడాను చూడాలి. ఇతర పార్టీలకు సంబంధించినంత వరకు ప్రజా సంఘాలనేవి వాటి తల్లి పార్టీలకు కొనసాగింపు మాత్రమే. వాటిని అవి మరిన్ని ఓట్లు సంపాదించుకోడానికి ఉపయోగించుకుంటాయి. కానీ సిపిఐ(ఎం)కు ప్రజా సంఘాలపట్ల పూర్తిగా దానికి భిన్నమైన అవగాహన ఉంది. 1981 కేంద్ర కమిటీ పత్రం 'ప్రజా సంఘాలపై' లోనూ, తదుపరి 2004 కేంద్ర కమిటీ పత్రం 'ప్రజా సంఘాలపట్ల అవగాహనపై' లోనూ దీని గురించి వివరించడం జరిగింది.

"మనం వేరుగా ఒక సంఘాన్ని నడపాల్సి వస్తున్నదంటే అర్థం, దాన్ని విస్తృత స్థాయి ప్రజా సంఘంగా నడిపించే బాధ్యత మనమీద లేకుండా పోయిందని కాదు. దానికి మారుగా ఆ బాధ్యత మరింత పెరుగుతుంది. సరిగ్గా ఈ బాధ్యతను దృష్టిలో ఉంచుకునే మనం ఇతర పార్టీల నాయకత్వంలో ఉన్న ప్రజా సంఘాలతో ఐక్య కార్యాచరణ జరపాలని నొక్కి చెబుతున్నాం. మెజారిటీ ప్రజల మనసులు గెలిచే ఎత్తుగడల్లో భాగంగానే మనం ఈ ఉమ్మడి కార్యాచరణకు పిలుపులిస్తున్నాం. దానర్థం ఏమంటే, మన సంఘం ఒక నిజమైన ప్రజా సంఘంగా కొనసాగుతూనే ఆయా ప్రజా సమూహాల ప్రాథమిక పోరాటాల్లో పాల్గొనడానికి ఆసక్తి గలవారందరికీ తలుపులు తెరిచి

ఉంచుతాం.”

5. బహుళ వర్గ ప్రజా సంఘాలకు సంబంధించి కొంతమంది కామ్రేడ్స్ పిడివాద ధోరణి ప్రదర్శిస్తారు. మనం ఆయా సెక్షన్లలో పేదలను మాత్రమే సమీకరించాలంటారు. దీని వల్ల మన పరిధి కుదించుకుపోయి మనల్ని ఒంటరిపాటు చేయగలదు.

   1980లో మహిళా సంఘం ఏర్పాటు గురించి చర్చించేటప్పుడు కొందరు కామ్రేడ్స్ ఈ దృక్పథాన్ని వ్యక్తం చేశారు. వర్గేతర, ఫెమినిస్ట్, ఉదారవాద అవగాహనపై ఆధారపడిన విస్తృత స్థాయి సంఘనిర్మాణం జరగాలని ఆరోజున వాదించడం జరిగింది.

   ఒక సంఘాన్ని విస్తృత స్థాయిలో నిర్మిస్తే అది మన సంఘపు వర్గ పునాదిని దెబ్బతీస్తుందన్న ఆపోహ తప్పు. ధరల పెరుగుదల, మత సామరస్యం, పౌర హక్కులు అనేవి వర్గేతర సమస్యలు కావు. కానీ వాటి ఆధారంగా మనం విస్తృత జన సమీకరణ చేయవచ్చు. అయితే ఒక ఉద్యమ విజయం అనేది మన స్వంత వర్గం సమీకరణమీద అదారఫడుతుందనేది వాస్తవం. మహిళలకు సంబంధించి మనం దిగువ విషయాలు గుర్తుంచుకోవాలి. (1) మహిళలు పౌరులుగా జనాభాలో భాగం, (2) మహిళలు విభిన్న వర్గాలకు చెందిన వారు, (3) మహిళలుగా మహిళలు. మనం మహిళలు ఏ వర్గానికి చెందిన వారైన్పటికీ మహిళలుగా వారికున్న అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. అంటే మహిళా హక్కులు, సమానత్వం, మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, వరకట్నం సమస్య మొదలైనవి.

   “నేటి పరిస్థితుల్లో ఫ్యూడల్ పరిస్థితులు, అసమానతల నుండి విముక్తి కోసం మహిళలు జరిపే పోరాటం కేవలం పీడిత సెక్షన్లకు మాత్రమే పరిమితం కాదు. జనతా ప్రజాతంత్ర విప్లవానికి సంబంధించిగానీ అంతకన్నా తక్కువ స్థాయిలోని మహిళా ఉద్యమానికి సంబంధించి గానీ ఇది వాస్తవం కాదు.

   “పార్టీ కార్యక్రమం జాతీయ బూర్జువా వర్గాన్ని కూడా పిడిఎఫ్‌లో భాగం అని చెబుతుంటే, ఇక్కడ మహిళలను ఫ్యూడల్ పీడన నుండి విముక్తి చేయాలనుకునే ఒక ప్రజా సంఘం మాత్రం పీడిత ప్రజలకే కట్టుబడి ఉండాలని చెప్పడం జరుగుతోంది.

6. స్వచ్ఛత పేరుతో కొంతమంది కామ్రేడ్స్ ఉమ్మడి కార్యాచరణనూ, సంయుక్త కార్యాచరణనూ వ్యతిరేకిస్తున్నారు. ఆ విధంగా విస్తృత ప్రజానీకంలోకి వెళ్లడానికి వచ్చే అవకాశాలను కోల్పోతున్నారు.

   వర్గ ధోరణి స్వచ్ఛతను కొనసాగించాలనే పేరుతో ఉమ్మడి సంఘటనలన్నా,

విస్తృత స్థాయి సంయుక్త సమీకరణలన్నా భయపడ్డం అనేది ప్రజా సంఘాల పట్ల మార్క్సిస్టు – లెనినిస్టు అవగాహనకు విరుద్ధం.

ఈ ధోరణిని కేంద్ర కమిటీ పత్రం తీవ్రంగా విమర్శిస్తూ కింది విధంగా పేర్కొన్నాది. "ఇది కమ్యూనిస్టు ఉద్యమం పుట్టినప్పటి నుండి ఉన్న జబ్బు. ఈ పిడివాద ధోరణి మన సంఘాలను "బూర్జువా" సంఘాలకన్నా భిన్నంగా ఉంచాలనీ, "విప్లవ" సంఘాలుగా, సోషలిస్టు వగైరా సంఘాలుగా ఉంచాలనీ నినాదాల మాదిరిగా పేర్కొంటుంది. నిజమైన విభజన పోరాట క్రమంలోనే ఆవిర్భవిస్తుందిగానీ ఉద్యమం పురోగమిస్తున్న కొద్దీ అనివార్యంగా బూర్జువాలు కూడా లేవనెత్తే కార్యక్రమాలు, నినాదాలను నిర్లక్ష్యం చేయడం వల్ల కాదనే విషయాన్ని ఈ పిడివాదం తెలుసుకోదు.

"రివిజనిస్టులు, బూర్జువాలూ మహిళలకు సమాన హక్కులు, రాజ్యాంగ రక్షణలు వంటి డిమాండ్లను లేవనెత్తితే, ఫ్యూడల్ బానిసత్వానికి వ్యతిరేకంగా వారు డిమాండ్లు లేవనెత్తితే ఆ డిమాండ్లు రివిజనిస్టు డిమాండ్లయిపోతాయా? వాటిని ప్రజల్లోకి ఎవరు తీసుకుపోతారు, ఎవరు వాటిని లేవనెత్తి వాటికోసం పోరాడతారు అనేదే సమస్య. సంస్కరణలు అనేవి విప్లవ పోరాట ఉప–ఉత్పత్తులని మనం నమ్ముతాం.

7. సంస్కరణవాదులు, అభివృద్ధి నిరోధకులు నడిపే ప్రజా సంఘాలతో మనం కలిసి పనిచేయకూడదని కొందరు భావిస్తారు. ఈ ధోరణి కొత్తది కాదు. ఈ ధోరణిని లెనిన్ తీవ్రంగా విమర్శించాడు : "అభివృద్ధి నిరోధక ట్రేడ్ యూనియన్లలో కమ్యూనిస్టులు పనిచేయకూడదు అన్న ఈ హాస్యాస్పదమైన 'సిద్ధాంతం', 'ప్రజలను ప్రభావితం చేయడం అనే ప్రశ్న పట్ల అతివాద–కమ్యూనిస్టుల పనికిమాలిన ధోరణినీ, 'ప్రజలు' అనే పేరును వారు దుర్వినియోగం చేసే తీరునూ అత్యంత స్పష్టంగా వెల్లడిస్తోంది.' నీవు గనుక 'ప్రజలకు' సేవచేయాలనుకుంటే, వారి సానుభూతి పొందాలనుకుంటే, 'ప్రజలకు' మద్దతివ్వాలనుకుంటే నీవు కష్టాలను చూసి భయపడకూడదు.... ప్రచారాందోళనను ఒక పద్ధతి ప్రకారం ముందుకు తీసుకుపోవడం కోసం మహామహా అడ్డంకులను అధిగమించాలి..... అటువంటి సామర్థ్యం నీకుండాలి..... కార్మికవర్గ, పాక్షిక కార్మికవర్గ ప్రజానీకం ఉన్న సంఘాల్లోనూ, సొసైటీల్లోనూ, సంస్థల్లోనూ చివరికి అత్యంత అభివృద్ధి నిరోధక సంస్థల్లోనూ పనిచేయాలి. (లెనిన్ ఏరిన రచనలు, వాల్యూమ్ 31, పేజీ 46–56, 'ట్రేడ్‌యూనియన్లపై లెనిన్' పేజీ 352)

ట్రేడ్ యూనియన్ ఫ్రంట్‌పై 1983, 2002లో వచ్చిన కేంద్ర కమిటీ పత్రాలు కూడా సంస్కరణవాద యూనియన్లలో పనిని చేపట్టడంలో మన బలహీనతలను

సూటిగా చూపిస్తూ మళ్లీ మన అవగాహనను మరోసారి ఇలా చెప్పింది: "ఈ అంశం ప్రాముఖ్య తను గురించి మనం మన క్యాడర్‌ను ఎడ్యుకేట్ చేసుకోవాలి. మన కామ్రేడ్స్ పనిచేయా ల్సిన సంస్కరణవాద యూనియన్లను గుర్తించాలి."

ప్రజలు ఎక్కడ సమీకరించబడుతున్నా అక్కడల్లా వారిలో కలిసి పనిచేయడానికి ఉన్న మార్గాలను పార్టీ కనుగొనాలి. మనం నాయకత్వంలో ఉన్న సంఘాల్లో మాత్రమే పార్టీ సభ్యులు పనిచేయాలన్న తప్పుడు అవగాహనను మార్చుకోవాలి. మనం ఇప్పుడు నడుపుతున్న వర్గ, ప్రజాసంఘాల్లోకి రాని అనేక ప్రజా సంఘాలున్నాయి. అటువంటి సంఘాల్లో పార్టీ సభ్యులు పనిచేయాలి, ఎక్కడ అవసరమైతే అక్కడ కొత్త సంఘాలను నెలకొల్పాలి. ప్రజల దైనందిన జీవితంతోనూ, వారి సంమస్యలతోనూ సంబంధం ఉన్న అన్ని సంఘాలు, సంస్థల్లో కమ్యూనిస్టు పనిచేయాలనేది అతి ముఖ్యమైన సూత్రం.

## III

## ప్రజా సంఘాలకు పనిలో స్వతంత్రత ఎందుకు అవసరం?

స్వతంత్ర పనివిధానం వల్ల, ప్రజా సంఘాలు తమ విస్తృత లక్షణాన్ని కొనసాగించడం వల్ల కొత్త సెక్షన్ల ప్రజలకు చేరువ కాగలుగుతాయి. ఈ సూత్రాన్ని ఏమాత్రం ఉల్లంఘించినా పార్టీ సాధారణ ప్రజలకు చేరువయ్యే తలుపులు మూసుకు పోతాయి. తద్వారా పార్టీ ఎదుగుదల నిరోధించబడుతుంది.

ప్రజా సంఘాలను పార్టీ అనుబంధ విభాగాలుగా పరిగణించే బలహీనత ఇప్పటికీ కొనసాగుతోంది. అనేక రాష్ట్రాల్లో ముఖ్యంగా కిసాన్, మహిళా, యువజన రంగాల్లో జిల్లా, అంతకన్నా దిగువస్థాయిలో పార్టీకీ, ప్రజాసంఘాలకూ మధ్య తేడా చూపడం లేదు.

ప్రజా సంఘాల కమిటీలు, ఆఫీసు–బేరర్లలో అత్యధికులు పార్టీ సభ్యులే. పార్టీయేతరులను నాయకత్వ స్థానాల్లోకి పంపడానికీ, ఆఫీసు బేరర్లుగా వారిని ప్రవేశపెట్టడానికీ కృషి జరగడం లేదు. అటువంటి శక్తులు ఆయా సంస్థలపై అదుపు సాధిస్తాయన్న భయం కొందరిని వెన్నాడుతోంది. ఇది మనపై మనకూ, విస్తృత స్థాయి సభ్యత్వంపై మనం ప్రభావం చూపగలమన్న విశ్వాసం లేదన్న విషయాన్ని వెల్లడిస్తోంది.

ఈ తప్పుడు ధోరణిని సరిచేసుకునేందుకుగాను నాయకత్వ పార్టీ కమిటీలు, అన్ని స్థాయిల్లోని క్యాడర్లు ఈ క్రింది మార్పులు చేయాలి:

1) ప్రజా సంఘాల్లోనూ, పార్టీ వేదికల మీదా ఒకే రకమైన నినాదాలు చేయడం. పార్టీ నేరుగా ఇచ్చే నినాదాలను ప్రజా సంఘాల వేదికల మీద ఇవ్వకూడదు. సాధారనణ సభ్యుల చైతన్యాన్ని మనసులో ఉంచుకుని నినాదాలు, డిమాండ్లు రూపొందించాలి.

ప్రజా సంఘాల మౌలిక కృషి అంతా కూడా ఆయా సెక్షన్ ప్రజల తక్షణ, స్థానిక సమస్యలపైనా, వారిని వేధిస్తున్న దీర్ఘకాలిక సమస్యలపైనా ఉండాలి.

2) కొన్ని రాష్ట్రాల్లో విద్యార్థి, యువజన, మహిళా సంఘాలకు పార్టీ ర్యాలీల్లోనూ, కార్యక్రమాల్లోనూ పాల్గొనమని కోరుతూ సర్క్యులర్‌లు జారీ చేస్తున్నారు. ఇలా చేయకూడదు. సంయుక్త కార్యాచరణ ఉంటే ఆయా ప్రజా సంఘాలు వారి యూనిట్లకు సర్క్యులర్‌లు జారీ చేయాలి.

3) ప్రజా సంఘాల కమిటీలకు ఆయా పార్టీ కమిటీల ద్వారా అన్ని పేర్లనూ ప్రతిపాదించే పద్ధతిని మానుకోవాలి. కేవలం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి (ట్రేడ్ యూనియన్లయితే ట్రెజరర్) పోస్టులను మాత్రమే ఆయా పార్టీ కమిటీల ఆమోదం ఉండాలి. ప్రజా సంఘాల కమిటీలోని ఇతర సభ్యులు, ఆఫీస్–బేరర్ల పేర్లను ప్రజా సంఘంలోని పార్టీయేతురులు, సభ్యుల అభిప్రాయం తీసుకుని ఫ్రాక్షన్ కమిటీ/ఫ్రాక్షన్‌లు ప్రతిపాదించాలి.

4) అనేక రాష్ట్రాల్లో ప్రజా సంఘాల కార్యాలయాలు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కూడా పార్టీ కార్యాలయాల్లోనే ఇంకా పనిచేస్తున్నాయి. తొలుత రాష్ట్ర ప్రజా సంఘాల కార్యాలయాలను పార్టీ కార్యాలయాల నుండి వేరేచోటకు మార్చాలి. తరువాత జిల్లా స్థాయిలో కూడా ఈ పనిచేయాలి. ఇప్పటికీ కింది స్థాయిలో అనేక ప్రాంతాల్లో ప్రజా సంఘాల నిధులను పార్టీ నిర్వహిస్తున్నది.

5) ప్రజా సంఘాల్లో పనిచేస్తున్న పార్టీ క్యాడరు, మనం ప్రజాల్లోని కొంత భాగానికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నామని గుర్తించాలి. మన స్వతంత్ర వేదికనూ, కార్యకలాపాలనూ కొనసాగిస్తూనే ఇతర సంఘాలతో కలిసి ఐక్య వేదికల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలి.

6) కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీలు ప్రజా సంఘాల పనిపై కాలానుగుణంగా సమీక్షించాలి. దురదృష్ట వశాత్తూ మనం ఈ ముఖ్యమైన కర్తవ్యాన్ని కాలాను గుణంగా నిర్వర్తించలేకపోతున్నాము.

7) ప్రజా సంఘాల పనిలోని అంశాలన్నీటినీ పార్టీ సబ్ – కమిటీలు, ఫ్రాక్షన్ కమిటీలు చర్చించకూడదు.

## IV

## ప్రజాతంత్ర పనివిధానం చాలా ముఖ్యమైనది ఎందుకు?

ప్రజాసంఘాల వ్యవహారాల నిర్వహణలో దాని సభ్యులను, ప్రజలనూ విస్తృత స్థాయిలో పాల్గొనేట్లు చేయడానికి చైతన్య పూర్వకమైన, పద్ధతి ప్రకారం కృషి చేసి నప్పుడు మాత్రమే ప్రజా సంఘాల విశాలత్వం కొనసాగుతుంది.

దీన్నే మనం ప్రజా సంఘాల ప్రజాతంత్ర పనివిధానం అంటాం.

ఇది విశాల ప్రజానీకాన్ని రాడికలైజ్ చేయడాన్నీ, చురుకుగా పనిచేయించడాన్నీ వేగవంతం చేస్తుంది. ప్రజా పునాది నిరంతరాయంగా విశాలం కావడానికి సహకరిస్తుంది.

ప్రజాతంత్ర పనివిధానం అంటే ఆయా ప్రజాసంఘాల సభ్యులనూ, సభ్యులు కానివారినీ ఆయా ప్రజా సంఘాల విధాన నిర్ణయం దాని నిర్ణయాలను తీర్చిదిద్దడం, రోజువారీ సమస్యలపై ఆందోళనలు చేపట్టడం మొదలైన అంశాలపై చర్చించేట్లు చేయడం. బహిరంగ సభల్లో, లేక కనీసం సభ్యుల సమావేశాల్లో హాజరైన జనానికి మహాసభల్లో చర్చించే అంశాలను గురించీ, సంస్థ ఆమోదించిన విధానం గురించీ వివరించి తదనంతరం మహాసభల ప్రతినిధులను ఎన్నుకోవడం అనేది ప్రజా తంత్ర పనివిధానంలో ముఖ్యమైన అంశం. ఈ ప్రజాస్వామ్యం నిబంధనా వళిలోని నిబంధనలు పాటించడానికే పరిమితం కాదు. ఈ విశాలమైన ప్రజాస్వామ్య రూపాలను అమలు పరచడం ద్వారా మాత్రమే సభ్యులనూ, సభ్యులు కానివారినీ సంస్థ రోజువారి పనిలోకి తీసుకురాగలం.

ప్రజా సంఘాల విధానాల రూపకల్పనలోనూ, వివిధ స్థాయిల్లో కార్యకలాపాల్లోనూ పాల్గొనడం ద్వారా, చర్చలు, పోరాటాల్లో పాల్గొనడం ద్వారానే ప్రజలు వర్గ శిక్షణనూ, వర్గ–చైతన్యాన్నీ పొందుతారు. కానీ ప్రజల తంత్ర పనివిధానం లేకపోవడం వల్ల ఈ అభివృద్ధి కుంటుపడిపోతుంది. అందువల్ల ప్రజలు ఉన్నత స్థాయి రాజకీయ చైతన్యం పొందలేకపోతారు. ప్రజా సంఘాలను ప్రజాతంత్ర యుతంగా పనిచేయించడంలో వైఫల్యం బ్యూరాక్రాటిజానికి దారితీస్తుంది. ఇది ప్రజల్లోని అన్ని రకాల చొరవలనూ చంపేస్తుంది. వారిని సంస్థలకూ, నాయకత్వానికీ పనికిరాకుండా చేసేస్తుంది. ఇది ప్రజా సంఘం విస్తరణకు ఆటంకమవుతుంది. ఇది ప్రజల నుండి అంతర్గత నాయకత్వం, క్యాడరు అభివృద్ధిని నిరోధిస్తుంది. దానివల్ల క్యాడర్ కొరత ఏర్పడుతుంది. సభ్యత్వం స్తంభించిపోవడానికి ఇదో కారణం.

మన సంఘాలు ఆఫీస్ – బేరర్లు, ఎగ్జిక్యూటివ్‌లు, లేదా మండళ్లు వంటి ఉన్నత స్థాయి సంస్థలతో నడపబడతాయి. ప్రధానమైన ప్రజాబాహుళ్యం ప్రేక్షకుల్లా మిగిలిపోతారు. కొన్ని సమావేశాల్లో శ్రోతలుగానో లేక ఏడాదికొకసారి సభ్యత్వం సేకరించేటప్పుడు మాత్రమే వారు ప్రమేయం ఉంటుంది. ఇది మొత్తం సంస్థ ప్రభావాన్ని స్తంభింపజేస్తుంది. మొత్తం సంస్థ బాధ్యతంతా కొద్ది మంది ఉన్నత స్థాయి నాయకులు, చురుకుగా పనిచేసే కార్యకర్తల చేతుల్లోకి పోతుంది. వీరికి ప్రజాబాహుళ్య సభ్యత్వంతో సంబంధాలు ఉండవు.

ప్రజాతంత్ర పనివిధానాన్ని ఆటంక పరిచే కొన్ని తప్పుడు పద్ధతులు:

1) పార్టీ మార్గదర్శక పాత్ర పేరుతో ప్రజా సంఘానికి సంబంధించిన అన్ని

విషయాలనూ పార్టీ కమిటీలే తరచూ నిర్ణయించేస్తుంటాయి. ప్రజా సంఘం వేదికలను బైపాస్ చేస్తాయి లేక ఫ్రాక్షన్‌లతో చర్చించడాన్ని దాటవేస్తాయి.

2) కొందరు ప్రజా సంఘం, పార్టీ పని విధానంలోని తేడాను గుర్తించరు. కమ్యూనిస్టు పార్టీ కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలపై ఆధారపడి పనిచేస్తుంది. కానీ ప్రజా సంఘం దీనికి భిన్నమైన ప్రజాతంత్ర సూత్రాలపై ఆధారపడి పనిచేస్తుంది. ప్రజా సంఘంలోని పార్టీ సభ్యులు కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలపై ఆధారపడి పనిచేస్తారు కానీ దీన్ని మొత్తం ప్రజా సంఘానికి వర్తింపజేయకూడదు. చాలా మంది ఈ విషయంలో గందరగోళానికి లోనై పార్టీ సూత్రాలనే ప్రజా సంఘానికి వర్తింపజేస్తారు.

3) ప్రజా సంఘాన్ని పనిచేయించడంలో ఏకైక పెద్ద పొరపాటు ఏమంటే, క్షేత్రస్థాయిలో/మౌలికమైన యూనిట్లను నిర్మించడంతో విఫలం కావడం, ఒక వేళ అటువంటి యూనిట్లు ఉంటే వాటిని పనిచేయించకపోవడం. ప్రజలను కార్యాచరణలోకి దించాలంటే యూనిట్ స్థాయిలో ప్రజా సంఘాలను పనిచేయించడం చాలా ముఖ్యం. ఇక్కడ, ఈ స్థాయిలో మాత్రమే సాధారణ ప్రజానీకం ప్రజా సంఘాల జీవనంలో పాల్గొనడం అనేది జరుగుతుంది. క్షేత్ర స్థాయి యూనిట్లు ప్రజా సంఘానికి ప్రాథమిక నిర్మాణ ఇటుకలు కనుక వాటి పనివిధానాన్ని మెరుగుపరచకుండా మనం ప్రజా తంత్ర పనివిధానం అని ఎంత చెప్పినా అవన్నీ గాలిమాటలే అవుతాయి.

4) నాయకుల, కార్యకర్తల వ్యక్తిగత పనివిధానం, బ్యూరాక్రాటిక్ ధోరణి ప్రజలు పాల్గొనడానికి ఆటంకాలు కల్పించి తద్వారా వారి చొరవను చంపేస్తుంది. ప్రజా సంఘాల నాయకులైన పార్టీ కార్యకర్తలు ప్రజాతంత్ర పద్ధతిలో పనిచేయడం లేదు. వివిధ స్థాయిల్లో సంఘానికి సంబంధించిన ప్రజలందరినీ పాల్గొనేట్లు చేయడం లేదు. అందువల్ల ప్రజా సంఘాలు వ్యక్తి చుట్టూ తిరిగే లేక ఒక చిన్న గ్రూపు ఆస్తులుగా మారిపోతున్నాయి.
చాల మంది నాయకులకు ప్రజా సంఘాల సంస్థల్లో అభిప్రాయాలను విని, అర్ధవంతమైన చర్చను పెంపొందించేందుకు చైతన్యవంతమైన కృషి చేసే ఓపిక లేకపోతోంది.

5) కొన్ని ట్రేడ్‌యూనియన్లలో కామ్రేడ్స్ రిటైర్ అయిన తరువాత కూడా నాయకత్వ స్థానాల్లో కొనసాగే ధోరణి కొనసాగుతోంది. ఈ అలవాటు కొత్త కామ్రేడ్స్ రాకుండా అడ్డుపడుతోంది. కొన్ని సందర్భాల్లో, కామ్రేడ్స్ ప్రజా సంఘాల నాయకత్వం నుండి రిటైర్ అయిన తరువాత కూడా వారికి కార్మికులతో, పార్టీ క్యాడర్లతో సంబంధాలు లేకపోయినా పార్టీ ఫ్రాక్షన్‌లలో కొనసాగుతున్నారు. ఇది కూడా కొత్త క్యాడర్ రాకుండా అడ్డుపడుతోంది.

కార్మికులనూ, ఉద్యోగులనూ ప్రమోట్ చేయాలి, వారిని యూనియన్ నాయకత్వాల్లోని కీలక బాధ్యతల్లో ఉంచాలి.

6) కొన్ని రాష్ట్రాల్లో, కొంతమంది ట్రేడ్‌యూనియన్ నాయకులు అనేక యూనియన్లలో నాయకులుగా కొనసాగుతున్నారు. దానివల్ల వారు ఆయా కమిటీల సమావేశాలకు హాజరుకాలేరు, సభ్యులను కలుసుకోలేరు, నేరుగా పోరాటాలను నడపలేరు. ఒక కామ్రేడ్ ఆఫీస్–బేరర్‌గా ఉండే సంఘాల సంఖ్యను తగ్గించాల్సిన అవసరం ఉంది. ట్రేడ్ యూనియన్లలోనూ, ఇతర వర్గ సంఘాల్లోనూ కొత్త క్యాడర్‌ను ప్రమోట్ చేసుకోవాలి.

7) ఫ్రాక్షన్ కమిటీలు ప్రజా సంఘాలకు సంబంధించిన రోజవారీ పనివిషయాలు చర్చించడానికీ, లేక మహాసభకు ఏర్పాట్లు చేయడం, ఆఫీస్–బేరర్ల ప్యానల్‌ను నిర్ణయించడం వంటి పనులకు పరిమితమైపోతున్నాయి. చాలా సందర్భాల్లో, అటువంటి పని విధానం వల్ల ట్రేడ్ యూనియన్ పనిలో ప్రజాతంత్ర పనివిధానం కొడిగట్టిపోతోంది.

## V

## పార్టీ పాత్ర: మార్గదర్శకత్వమా, బదులుగా తనే పనిచేయడమా?

పార్టీ ఏదో మంచితనం కోసం ప్రజా సంఘాల్లో పనిచేయడం లేదు. వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం వైపు వర్గాలనూ, ప్రజలనూ సమీకరించేందుకు తను చేస్తున్న కృషిలో ప్రజా సంఘాలు ఒక ముఖ్యమైన లింకు అని పార్టీ భావిస్తోంది. అందువల్ల మనం ప్రజా సంఘాల స్వతంత్ర పనివిధానం అంటున్నామంటే దానర్థం, పార్టీ ఏ విధంగానైనా ప్రజా సంఘాల జీవితంలో జోక్యం చేసుకోవచ్చు అని కాదు. దానర్థం ఏమంటే పార్టీ మార్గదర్శక పాత్ర వహిస్తుంది మినహా, ప్రజా సంఘం స్థానాన్ని ఆక్రమిస్తుందని కాదు. ప్రజా సంఘాల స్వతంత్ర పని విధానాన్ని పార్టీ ఎలా నిర్వహించాలో గత భాగంలో విపులంగా చెప్పబడింది కనుక దాన్ని మళ్లీ చెప్పాల్సిన అవసరం లేదు.

ఒక ప్రజా సంఘంలో పార్టీ పనిచేసే విధానం ఎలా ఉండాలంటే, ఆ ప్రజా సంఘపు సాధారణ లక్షణానికి భంగం కలిగించకుండా దాని వెనుకనున్న మెజారిటీ ప్రజానీకంపై క్రమంగా తన ప్రభావంతో పట్టు సాధించగలగాలి.

పార్టీ మార్గదర్శక పాత్రను ఆదేశాలతోనో, అధిపత్యంతోనో, లేక దాని కమిటీలను పార్టీ సభ్యులతో నింపేయడంతోనో జరగకూడదు. అలా కాకుండా వాటిలో పనిచేస్తున్న పార్టీ సభ్యులను, మనతో విభేధించే పార్టీయేతరులను కూడా ఒప్పించి

వారిని మన అవగాహనలోకి తీసుకురావాలి.

పార్టీ మార్గదర్శక పాత్ర అంటే, అది వెనుకబడిన సెక్షన్ ప్రజలు నిరంతరాయంగా ప్రజా సంఘంలోకి రావడాన్ని అడ్డుకోకుండానే వారి చైతన్యాన్ని నిరంతరాయంగా పెంపొందించాలి. అలా కాకపోతే ఆ ప్రజా సంఘం పార్టీకి చేరువగా ఉండే మిలిటెంట్ల సంఘం అయిపోతుంది. ప్రధానమైన ప్రజా బాహుళ్యం నుండి వేరుపడిపోయి వారిని చురుకుగా పనిచేయించలేకపోతుంది.

ప్రజలు ఎడ్యుకేషన్ ద్వారా, రోజువారీ పోరాటాల అనుభవాల ద్వారా సంపాదించుకున్న ప్రాథమిక చైతన్యాన్ని విప్లవ రాజకీయ చైతన్యంగా మార్చడానికి పార్టీ ఫ్రాక్షన్ల ద్వారా పనిచేయాలి. మార్గదర్శకత్వం అంటే ఏమిటో ఈ క్రింది మాటల్లో కేంద్ర కమిటీ స్పష్టంగా చెప్పింది: "ఈ సందర్భంగా ప్రజల్లో పనిచేసే ప్రజా సంఘాల్లో పార్టీ పని కనిపించకూడదు. లేకపోతే ప్రజలతో లింకు తెగిపోతుంది. ప్రజా సంఘాలకు మార్గదర్శకత్వం వహించే పరమ సూత్రం అది. ప్రజా సంఘాన్ని పార్టీ ప్రతినిధిగా మార్చేయడం ద్వారా పార్టీని ప్రజా సంఘానికి ప్రత్యామ్నాయంగా మార్చడం వల్ల చాలా నష్టదాయకమైన పరిణామాలు సంభవిస్తాయి."

"ఈ సంస్థల్లో పార్టీ మార్గదర్శక పాత్ర అంటే అందులోని విస్తారమైన ప్రజల చైతన్యాన్ని కొత్త, ఉన్నత స్థాయికి పెంచడమే. ప్రజా సంఘపు విస్తృత లక్షణాన్ని మార్చకుండా వారిని పార్టీ నినాదాలవైపు ఆకర్షితులను చేయడమే."

పార్టీ మార్గదర్శక పాత్ర అనేది ఒక వైపు మాత్రమే జరిగే క్రమం కాదు. పార్టీ ఇచ్చే వైపూ, ప్రజలూ, ప్రజా సంఘాలూ పుచ్చుకునే వైపూ ఉండాలి. ప్రజలనుండి నేర్చుకోడానికి పార్టీ ప్రయత్నం చేయాలి.

## పార్టీ ఎలా మార్గదర్శకత్వం వహిస్తుంది?

పార్టీ ప్రధానంగా ఫ్రాక్షన్లు, సబ్-కమిటీల ద్వారా ప్రజా సంఘాల్లో పనిచేస్తుంది.

వీటి ద్వారా ప్రజా సంఘాల్లో పనిచేసే పార్టీ సభ్యులు, పార్టీ శాఖలకు మార్గదర్శకత్వం వహిస్తుంది.

## సబ్-కమిటీలు, ఫ్రాక్షన్ కమిటీలు

ఫ్రాక్షన్లు, ఫ్రాక్షన్ కమిటీలు, సబ్-కమిటీల ఏర్పాటు, పని విధానం గురించిన సూత్రీకరణలను కేంద్ర కమిటీ 1974 తీర్మానంలో పేర్కొన్నది.

16వ పార్టీ మహాసభ నివేదికలో పార్టీ ఫ్రాక్షన్లు, ఫ్రాక్షన్ కమిటీలు, సబ్ - కమిటీల కర్తవ్యాలను గురించి వివరించింది. అవి: అ) ఒక నిర్దిష్ట ప్రజా సంఘంలో పార్టీ విధానాన్ని అమలు పర్చడంపై మొత్తంగా పర్యవేక్షించడం. ఆ) ఆయా ప్రజానీకంలో

రాజకీయ–సైద్ధాంతిక కృషి చేయడం, ఇ) పార్టీ సాహిత్యాన్ని పంచడం, అమ్మడం, ఈ) మిలిటెంట్లను గుర్తించి వారిని పార్టీలోకి తీసుకోడానికి సిద్ధం చేయడం ఎ) ప్రజా రంగాలకు సంబంధించిన నిర్ణయాలను అమలు చేయడంలో పార్టీ కమిటీలకు తోడ్పడడం.

సబ్–కమిటీ, ఫ్రాక్షన్ కమిటీల ఒక ముఖ్యమైన పని పార్టీని నిర్మించడం. ఈ పనిని ఆయా ప్రజా సంఘాల్లో పనిచేసే పార్టీ నాయకులు, సభ్యులు ఫ్రాక్షన్ కమిటీల, ఆయా పార్టీ కమిటీల మార్గదర్శకత్వంలో నిర్వహించాలి. వారు పార్టీ కమిటీకి ప్రతిపాదనలు చేయాలి, పార్టీ నిర్మాణంలో పురోగతిని పర్యవేక్షించాలి.

ప్రజా సంఘంలో ఫ్రాక్షన్ సభ్యుల ద్వారా పార్టీ విధానాలు, నిర్ణయాలను అమలు పరిచే బాధ్యతను ఫ్రాక్షన్ కమిటీలు నిర్వహించాలి.

ప్రజా సంఘాల బయట ఉన్న కొత్త సెక్షన్ ప్రజలను చేరుకోడానికి ఎటువంటి కృషి చేయాలన్న అంశాలను అవి పరిశోధించాలి. కొత్త ప్రాంతాలకూ, కొత్త సెక్షన్లకూ చేరుకోవడానికే ప్రాధాన్యత ఇవ్వాలి. అటువంటి కార్యకలాపాలను వారు నిరంతరం రూపొందిస్తూ ఉండాలి. వర్గేతర, మార్క్సిస్టు వ్యతిరేక సిద్ధాంతాలైన మతతత్వం, నయా–ఉదారవాద సిద్ధాంతాలను ఎదుర్కొనడానికి సైద్ధాంతిక కృషి చేయాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల్లో ముఖ్యంగా యువతలో పురోగామి, విప్లవ సిద్ధాంతాలు పెరగడానికి వీలైన వాతావరణం సృష్టించడానికి ప్రయత్నించాలి.

సబ్–కమిటీలు, ఫ్రాక్షన్ కమిటీలు పార్టీ సభ్యులకు కాలానుగతమైన పనిని రూపొందించాలి. పార్టీ సాహిత్య అమ్మకాలు, సైద్ధాంతిక కృషి, ఆగ్జిలరీ శాఖలోకి చేర్పింపులు, క్యాండిడేట్ సభ్యులను తీసుకోవడం వగైరా పార్టీ నిర్మాణ సమస్యలను చేపట్టాలి.

కాని ఈ అంశాలన్నిటిలోనూ వివిధ స్థాయిల్లో సబ్–కమిటీలు, ఫ్రాక్షన్ కమిటీల పని చాలా లోపభూయిష్టంగా ఉంది. సబ్–కమిటీలు, ఫ్రాక్షన్లు పార్టీ నిర్మాణం మీద, ప్రజలకు రాజకీయ చైతన్యం కల్పించే అంశాల మీద సరైన శ్రద్ధ పెట్టడం లేదు.

ప్రజా సంఘాల కమిటీల పరిధిలోని అంశాలపై మాత్రమే కేంద్రీకరించే వైఖరి కొనసాగుతోంది. ఫ్రాక్షన్ కమిటీలు పార్టీ నిర్మాణం పనిని వదిలిపెట్టి ప్రజా సంఘాల దైనందిన వ్యహారాలపై కేంద్రీకరించి ప్రజా సంఘాలకు బదులుగా అవే ఆయా సంఘాల దైనందిన వ్యవహారాలు చక్కబెడుతున్నాయి, మహా సభల ఏర్పాట్లు, ఆఫీస్ బేరర్ల ప్యానళ్లను నిర్ణయించడం వంటి పనులు చేసేస్తున్నాయి. దానివల్ల ఉద్యమానికి రెండు విధాల హాని చేస్తున్నాయి.

## పార్టీ సభ్యులు

ప్రతి పార్టీ సభ్యుడు ఒక ప్రజా సంఘంలో పనిచేయాలని మన పార్టీ నిబంధనావళి నిర్దేశిస్తోంది. పార్టీ కమిటీలు, ముఖ్యంగా జిల్లా, స్థానిక స్థాయిల్లో పార్టీ సభ్యులకు కొన్ని ప్రజా సంఘాల్లో వారికి తగిన పనిని అప్పగించాలి. ఆయా ప్రజా సంఘాల్లో తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించేందుకు పార్టీ సభ్యులకు ఫ్రాక్షన్ కమిటీలు సహకరించాలి.

కానీ చాలా పెద్ద సంఖ్యలో పార్టీ సభ్యులు తమ బాధ్యతలు నిర్వహించడం లేదని నివేదికలు తెలుపుతున్నాయి. వారిలో చాలా మందికి ఏ బాధ్యతా అప్పగించలేదు. వారిలో కొందరు చురుకుగా లేరు. పార్టీ, ఫ్రాక్షన్లు తమ మార్గదర్శక పాత్రలో విఫలమవుతున్నాయని ఇది తెలియజేస్తోంది. ప్రజా సంఘాల పనిని విస్తృతం చేయాలంటే ప్రజా సంఘాల్లోని పార్టీ సభ్యులను చురుకుగా పనిచేయించడం అత్యంత కీలకం.

## పార్టీ కమిటీల పాత్ర

ప్రతి ప్రజా రంగంలో పనిని పార్టీ కాలానుగతంగా సమీక్షించాలి.

అఖిల భారత కేంద్రం పనిని కాలానుగుణంగా సమీక్షించాలని గతంలో నిర్ణయించినప్పటికీ, అది నిరంతరాయంగా జరగడం లేదు. సబ్-కమిటీ నివేదికల ద్వారా అటువంటి సమీక్షలు జరగాలి. పొలిట్ బ్యూరోలో చర్చించి కేంద్ర కమిటీ ముందు పెట్టాలి. అప్పుడే ప్రజా రంగాల పని మెరుగుపడుతుంది. అఖిల భారత ప్రజా సంఘాల కేంద్రంలోని పార్టీ కార్యకర్తలతో పార్టీ కేంద్రం నిరంతరం సమావేశ మవుతూ, చేసిన పనిని గురించి చర్చించాలి.

అనేక రాష్ట్రాల్లో ప్రజా సంఘాల సమీక్షా నివేదికలను ఆయా పార్టీ కమిటీలకు సమర్పించడం గానీ, అవి వాటిని పరిశీలించడం గానీ జరగడం లేదు. పార్టీ మహాసభ సందర్భంగా మాత్రమే పార్టీ రాష్ట్ర కమిటీలు ప్రజా రంగాల నివేదికలను పరిశీలి స్తున్నాయి.

మనతో ఉన్న వర్గ, ప్రజా సంఘాలను సమన్వయపరచడంతో పార్టీ సహక రించాలి. డూప్లికేషన్లు, గందరగోళం లేకుండా ప్రజా సంఘాల శక్తులను ఒకే మార్గంలో నడిపించడానికి ఇది తోడ్పడుతుంది.

# VI

## అమలులో మిశ్రమ అనుభవాలు

ప్రజాసంఘాల స్వతంత్ర, ప్రజాస్వామిక పనివిధానాన్ని బలోపేతం చేయ డానికీ, పార్టీకీ, ప్రజా సంఘానికీ మధ్య సరైన సంబంధాలను కొనసాగించడానికీ

పార్టీకి చెందిన మూడు పత్రాలు నిర్దిష్ట మార్గదర్శకత్వం అందించాయి. అవి: 1974లో వెలువడిన 'పార్టీ, ట్రేడ్ యూనియన్ సంస్థలపైన' అనే పత్రం, 1981లో వెలువడిన 'ప్రజా సంఘాలపై' అనే పత్రం, 2004లో వెలువడిన 'ప్రజాసంఘాలతో వ్యవహరించే తీరుపై' అనే పత్రం. గత పత్రాల అమలులో కొంత మెరుగుదల ఉన్నప్పటికీ ఇంకా అనేక బలహీనతలు కొనసాగుతున్నాయని 2004 పత్రం పేర్కొంది. తదుపరి 2015లో కొల్‌కొతా ప్లీనం, రాష్ట్రాల నుండి వచ్చిన నివేదికల ఆధారంగా, 2004 కేంద్ర కమిటీ పత్రం అమలును సమీక్షిస్తూ కింది విధంగా పేర్కొంది: "ప్రజా సంఘాల పనిలో పార్టీ నేరుగా జోక్యం చేసుకునే ధోరణి మొత్తంమీద కొనసాగుతూనే ఉంది. వివిధ రూపాల్లో జరుగుతున్న ఈ జోక్యం వల్ల ప్రజా సంఘాల స్వతంత్ర పనివిధానం దెబ్బతింటున్నది, వాటిని విశాలంగా నడపాలన్న లక్ష్యం కూడా దెబ్బతింటున్నది. వివిధ స్థాయిల్లో ప్రజా సంఘాలను పార్టీ అనుబంధ సంస్థలుగా పరిగణించే ధోరణి ఇప్పటికీ ఉన్నది (పేరా 2.02).

ప్రజా సంఘాల పనివిధానాన్ని మెరుగుపరచాల్సిన అవసరం గురించి అది ఇలా చెప్పింది: "ప్రజా సంఘాలు స్వతంత్రంగా, ప్రజాతంత్రయుతంగా నడవడం కోసం ఆయా సంఘాల్లో మన పనివిధానాన్ని సరిదిద్దు కోవడం అనేది నిరంతర క్రమం. బలహీన రాష్ట్రాల్లో మనం ముందడుగు సాధించాలంటే అక్కడ విశాలమైన సెక్షన్ల ప్రజలు మన వర్గ, ప్రజా సంఘాల పరిధిలోకీ, కార్యక్రమాల్లోకీ వచ్చే విధంగా మనం పనిచేయడం ప్రధాన కర్తవ్యమని 2004లో ఆమోదించబడిన 'ప్రజా సంఘాలతో వ్యవహరించాల్సిన తీరుపై' అనే పత్రం స్పష్టం చేసింది. మౌలిక వర్గాలైన ట్రేడ్‌యూనియన్లు, కిసాన్ సభలు, వ్యవసాయ కార్మికసంఘాల్లో పని ఇప్పటికీ ఈ వర్గాల్లోని కొద్దిమందికి మాత్రమే పరిమితమై పోయింది. కొద్ది మినహాయింపులు తప్ప యువజన, విద్యార్థి, మహిళా రంగాలకూ కూడా ఇదే వర్తిస్తుంది. 2004 పత్రంలో నిర్దేశించిన కర్తవ్యాలను పార్టీ అమలు చేస్తూనే ఉండాలి." (పేరా 2.25)

## VII

## ప్రజా సంఘాలకు చెందిన ఇతర అంశాలు

### అఖిల భారత కేంద్రం

ప్రజా సంఘాల అఖిల భారత కేంద్రంలో ప్రస్తుత బలం, పని పరిస్థితి (టియు కేంద్రం మినహా) ఆయా ప్రజా సంఘాల అఖిల భారత అభివృద్ధి, విస్తరణ కర్తవ్యాల నిర్వహణకు సరిపోవు. అందువల్ల అఖిల భారత కేంద్రం నుండి కనీస సంఖ్యలో ఆఫీస్-బేరర్లు పనిచేయడం, వారి పూర్తికాలం పనిని ప్రజా సంఘాల కృషికి

కేటాయించడం అవసరం. ఈ కేంద్రాల్లో పనిచేసే క్యాడర్లను పెంచుకోవడం అవసరం. అదే విధంగా అన్ని ప్రజా సంఘాల రాష్ట్ర కేంద్రాలను కూడా అదనపు క్యాడర్ల రిక్రూట్‌మెంటుతో బలపచురుకోవాలి.

వారి రంగాల్లో పరిణామాలను అధ్యయనం చేసి, సరైన సమయంలో క్యాంపెయిన్లు, ఉద్యమాలకు సరైన నినాదాలు, డిమాండ్లతో రావడం కోసం తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలి.

**క్యాడర్లు**

పరిస్థితుల్లో పెద్దగా మార్పులేదు గనుక క్యాడర్ల కొరత ఇప్పటికీ వెన్నాడుతోంది. ప్రజా సంఘాలకు తగినంత మంది క్యాడర్లను కేటాయిండం లేదు. సరైన, తగిన సంఖ్యలో క్యాడర్లను కేటాయించడం అనేది ప్రజా సంఘాల విస్తరణకు ముఖ్యమైన అవసరం. వివిధ ప్రజా రంగాలకు తగిన క్యాడర్లను కేటాయించే విషయమై పార్టీ కమిటీలు సమయానుగతంగా చర్చిస్తుండాలి. ప్రజా సంఘాల్లో పనిచేసే పూర్తికాలం కార్యకర్తల పనిని పార్టీ కమిటీలు సమీక్షించాలి. వారి కనీసావసరాలు, కుటుంబ అవసరాలను తీరుస్తుండాలి. ప్రజా సంఘాల్లో పార్టీ సభ్యుల పనిని సమయానుగతంగా అంచనావేయాలి.

ప్రజా సంఘాలకు పార్టీ కేటాయించిన క్యాడర్లు తమ పూర్తి కాలాన్ని ఆయా ప్రజా సంఘాలకు ఉపయోగించడం లేదు. దానర్థం వారు పనిచేయడం లేదని కాదు. వారు అన్ని రకాల పనులు చేస్తున్నారు. కానీ వారి సంఘాలకు మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదు. కొంతమంది క్యాడర్లు వారి సంఘాల్లో బాధ్యతల నిర్వహణకు న్యాయం చేయగల స్థాయిలో లేరు. వారి సామర్థ్యాలను పెంచడానికి మనం చేయాల్సినంత చేయడం లేదు.

అన్ని స్థాయిల్లోనూ మరింత మంది యువ క్యాడర్లను రిక్రూట్ చేసుకోడానికి కృషి చేయాలి. పార్టీకి కొత్త క్యాడర్లను అందించగల యువజన, విద్యార్థి రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. యువకులకు నోటిమాటలతో ప్రోత్సాహం ఇచ్చినంత మాత్రాన పరిస్థితిలో మార్పురాదు. అన్ని స్థాయిల్లోని కమిటీల్లో యువజనులు, మహిళలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలి. కమిటీల పనిలో వారి పాత్ర ఉండేట్లు చూడాలి.

**బలహీన ప్రాంతాలు**

నిర్మాణంలోని హెచ్చుతగ్గులను సరిచేయాల్సి ఉంది. హిందీ మాట్లాడే ప్రాంతాల్లోని ప్రజా సంఘాల సభ్యత్వం 10 శాతం కన్నా తక్కువగా ఉన్నదని గణాం

కాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతాల్లో మన కార్యకలాపాల విస్తరణకు జరుగుతున్న కృషి ఏమాత్రం సంతృప్తికరంగా లేదు. ఈ బలహీనతను సరిదిద్దుకోడానికి చర్యలు తీసుకోవాలి.

**సామాజికాంశాలు**

మన దేశంలో మతతత్వ, అస్థిత్వవాద రాజకీయాలు ఎన్నో రెట్లు పెరిగాయి. ఇది మన వర్గాల జీవితాలను కూడా ప్రభావితం చేస్తోంది. మన సంస్థలు ఈ మార్పులను గమనిస్తున్నాయి గానీ ఈ సవాళ్లను ఎదుర్కొనడానికి తగినంత పని చేయడంలేదు. అక్కడక్కడా కొన్ని చర్యలు తీసుకోవడం జరుగుతోంది, కానీ ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాల్సి ఉంటుంది.

దళితులు, గిరిజనులు ఇతర సామాజిక బలహీనవర్గాల వారి మీద దాడులు పెరుగుతున్నాయి. వారి రాజ్యాంగ హక్కులమీద కూడా దాడి జరుగుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే సామాజిక న్యాయం ఒక పెద్ద ప్రశ్నగా మారిపోయింది. దీన్ని సరిదిద్దాలంటే మన సంఘాలు పెద్ద ఎత్తున సామాజిక, పోరాట కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంది. ఆదివాసీ, దళిత వేదికలు ఏర్పాటు చేయడం ద్వారా మనం కొంత కృషి చేశాం. అన్ని ప్రజా సంఘాల సంయుక్త వేదిక ఏర్పాటు చేశాం. కానీ ఇవన్నీ అనుకున్న ఫలితాలు సాధించలేదు. ఈ విషయంలో మరింత కృషి జరగాల్సి ఉంది.

**లింగవివక్ష**

సమాజంలోని పితృస్వామిక భావజాలం, ఫ్యూడల్ విలువలను సవాలు చేయడం కోసం ప్రజా సంఘాలు మన నాయకులు, క్యాడర్లలో లింగ చైతన్యం పెంపొందించాలి.

అన్ని వర్గ, ప్రజా సంఘాలు స్వతంత్రంగానూ, సంయుక్తంగానూ లింగ సమస్యలను చేపట్టేట్టు పార్టీ చూడాలి. వివిధ ప్రజా సంఘాల్లోని మహిళా సమస్యలను అంటే మహిళా కార్మికులు, మహిళా రైతులు, మహిళా వ్యవసాయ కార్మికులు, మహిళా విద్యార్థులు, యువజనుల సమస్యలపై పనిచేయాలి. నయా–ఉదారవాదం, హిందూత్వ రాజకీయాల వల్ల మహిళలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నందున ఆయా సంస్థలు మహిళల సమస్యలను చేపట్టాలి. వివిధ కమిటీల్లోనూ, ఆఫీస్–బేరర్ల ప్యానల్‌లోనూ మహిళలను ప్రమోట్ చేసేందుకు చైతన్య పూర్వకమైన విధానం అవసరం.

**అకౌంట్స్**

ప్రజా సంఘాల్లో కాలానుగుణంగా ఎకౌంట్లు సమర్పించడం, వాటిని ప్రజా సంఘాల కమిటీల్లో ఆమోదించడంలో బలహీనతలు ఉన్నాయి.

ప్రజా సంఘాల కేంద్రాల వద్ద ఉన్న నిధులను వినియోగించే విషయంలో కొన్ని నియమాలు, నిబంధనలు రూపొందించాల్సిన అవసరం ఉంది.

**సభ్యత్వం**

ప్రజా సంఘాలు ఏడాది పొడవునా సభ్యత్వం చేర్పించడం సాధారణ మైపోయింది. దాదాపు ప్రతి సంవత్సరం మన సంఘాలు కోటాలు పూర్తి చేయడం కోసం సభ్యుత్వ చేర్పింపు సమయాన్ని పొడిగించుకుంటూ పోతున్నారు. సభ్యత్వ చేర్పిం పుకు నిర్ధిష్ట క్యాంపెయిన్, నిర్ధిష్ట టైమింగ్ ఉండాలి.

**ప్రాథమిక యూనిట్**

ప్రజా సంఘాల ప్రాథమిక స్థాయి పని అనేది అనేక విధాల చాలా ముఖ్యమైనది. క్షేత్రస్థాయి యూనిట్లను చురుకుగా స్వతంత్రంగా, ప్రజాతంత్రయుతంగా పనిచేయించ డానికి తీవ్రమైన కృషి జరగాలి. ప్రాథమిక యూనిట్ ద్వారానే సభ్యత్వం చేర్పించడం, పునరిద్ధరించడం జరగాలి. ఏడాదికొకసారి సభ్యత్వ పునరుద్ధరణ అయిన తరువాత యూనిట్ స్థాయి మహాసభలు జరగాలి. అఖిల భారత మహాసభలతోపాటు, జిల్లా, రాష్ట్ర మహాసభలు జరపవచ్చు.

**క్షేత్రస్థాయి పోరాటాలు**

మన ప్రజా సంఘాలు క్షేత్ర స్థాయిలో తగినన్ని సుస్థిర పోరాటాలను నిర్మించడం లేదు. కొన్ని రాష్ట్రాల్లో కొద్దిపాటి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ మన సంఘాలు కింది స్థాయిలో నిర్ణయాత్మక పోరాటాలను నిర్మించాల్సిన అవసరం ఉంది. ఇవి మన క్యాడర్ల నైతిక స్థైర్యాన్ని పెంచడమే కాకుండా సాధరణ ప్రజల్లో మన ప్రభావాన్ని పెంచుతుంది. మనం సిపిఐ(ఎం) స్వతంత్ర బలాన్ని పెంచదలుచుకుంటే, మన ప్రజా సంఘాలన్నీ ముందుకొచ్చి స్థానిక పోరాటాలను చురుకుగా ప్రారంభించి, నాయకత్వం వహించాలి.

**ఉమ్మడి పోరాటాలు**

విజయవంతమైన ఉమ్మడి ఉద్యమాలకు ఇటీవల విజయవంతమైన సంయుక్త రైతాంగ పోరాటం చక్కని ఉదాహరణ. ఇది సుస్థిరమైన సంయుక్త ఉద్య

మూల పటిమనూ, బాధల్లో ఉన్న ప్రజల నైతిక బలాన్ని పెంచే సామర్థ్యాన్నీ రుజువు చేస్తోంది. బిజెపి నేతృత్వంలోని మతతత్వ–కార్పొరేట్ కూటమి అనుసరిస్తున్న ప్రమాదకరమైన, వినాశకరమైన నయా–ఉదారవాద, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల హక్కులను కాపాడాలంటే అటువంటి సంయుక్త పోరాటాలు చాలా జరగాల్సి ఉంది. ఇప్పటికే మన సంఘాలు అనేక ఉమ్మడి వేదికలపై పనిచేస్తున్నాయి. వీటిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. అటువంటివి లేని చోట వాటిని ఏర్పాటు చేయడానికి ఆయా రంగాలు చొరవ తీసుకోవాలి.

మూడు వర్గ సంఘాల (ట్రేడ్ యూనియన్, కిసాన్ సభ, వ్యవసాయ కార్మిక సంఘం) ఉమ్మడి పోరాటం నిర్మించడానికి మనం చేస్తున్న కృషి ఈ దిశలో సాగాలి. ఈ కృషి యొక్క రాజకీయ ప్రభావాన్ని గురించి మన సంఘాలు అర్థం చేసుకోవాలి.

## సైద్ధాంతిక పోరాటం

అనేక ప్రజా సంఘాల కేంద్రాలు పత్రికలనూ, ఇతర కరపత్రాలనూ, ప్రచార సామగ్రినీ తెస్తున్నాయి. ప్రతి రంగంలో సైద్ధాంతిక కృషి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ పత్రికల్లో వచ్చే అంశాలపై చర్చ జరపాలి. ప్రస్తుతం ఆర్ఎస్ఎస్, బిజెపిల ఆధ్వర్యంలో మతతత్వ శక్తులు బలపడ్డం, హిందూత్వ, మనువాద సిద్ధాంతం అంతటా, చివరికి సామాన్య ప్రజల్లో కూడా విస్తరించడం వంటి ప్రమాదాల వల్ల మతతత్వానికి వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటాన్ని తీవ్రతరం చేయాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. ప్రతి ప్రజా రంగమూ ఆయా సెక్షన్ ప్రజల్లో సైద్ధాంతిక ధోరణులను అధ్యయనం చేసి దానికి అనుగుణంగా ప్రచార కృషికి ప్రణాళికలు వేసి అమలు చేయాలి.

♦ ♦ ♦ ♦ ♦

**ప్రతులు** : **1000**
**ప్రచురణ కాలం** : **జూలై, 2023**
**వెల** : **₹. 20/-**

**ప్రచురణ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ**

27–13–3, గవర్నర్‌పేట, విజయవాడ – 2,
ఫోన్ నెం. 0866 2577202, 9490098000

**పార్టీ ఎడ్యుకేషన్ సిరీస్** – 64